అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
బుధవారం 26-4-2023 | సమగ్ర తెలుగు దినపత్రిక | www.navatelangana.com
సంపుటి : 9 | సంచిక : 115 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50




రక్షణ చట్టం ఏది ?
మితిమీరిన సమాచార చౌర్యం !

అడ్డూఅదుపూ లేని ఉల్లంఘనలు | భారత్‌లో పరిస్థితిపై ఐఎంఎఫ్

దేశంలో డిజిటల్ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. 2009లో ఆధార్ వ్యవస్థను ప్రారంభించారు. వ్యక్తుల వ్యక్తిగత సమాచారం మొత్తం ఇందులో నిక్షిప్తమై ఉంటుంది. ఇప్పుడు ప్రతి దానికీ ఆధార్ అవసరమవుతోంది. అలాంటప్పుడు ఆ సమాచారాన్ని గోప్యంగా ఉంచకపోతే కోట్లాది మంది ప్రజలు నష్టపోయే ప్రమాదం ఉంది. సమాచార రక్షణ చట్టం అందుబాటులో లేకుంటే వ్యక్తుల సమాచారం తేలికగా బహిర్గతమవుతుంది.

సమగ్ర చట్టమేదీ అందుబాటులో లేకపోవడంతో దేశంలో సామాజిక భద్రతా వ్యవస్థ, సబ్సిడీ కార్యక్రమాలకు చెందిన సమాచారం మొత్తం బయటకు పొక్కుతోంది. దీనివల్ల అవినీతికి ఆస్కారం ఏర్పడుతోంది. ఉదాహరణకు ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)నే తీసుకుందాం. ఇందులో ఎంత అవినీతి జరుగుతోందో చెప్పనక్కరలేదు. అసలైన లబ్ధిదారుల స్థానంలో వేరే వారిని ఎంపిక చేయడం, అమ్మకాలు సరిగా చేయకపోవడం, గోధుమలు-బియ్యాన్ని దారి మళ్లించడం వంటి చర్యల కారణంగా ఈ వ్యవస్థలో అవినీతి రాజ్యమేలుతోంది. సమగ్ర సమాచార రక్షణ చట్టాన్ని రూపొందిస్తే ఇలాంటి అవకతవకలకు అడ్డుకట్ట వేయవచ్చు.



న్యూఢిల్లీ : భారత్‌లో నేటికీ వ్యక్తుల సమాచారాన్ని గోప్యంగా ఉంచేందుకు, దానిని పరిరక్షించేందుకు సమగ్ర చట్టమేదీ అమలులో లేదని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) తెలిపింది. దీనివల్ల వినియోగదారుల గోప్యత, డిజిటల్ హక్కులు ప్రమాదంలో పడుతున్నాయని అభిప్రాయపడింది. ఈ మేరకు ఐఎంఎఫ్ ఒక పత్రాన్ని విడుదల చేసింది. వినియోగదారుల సమాచారాన్ని ప్రైవేటు కంపెనీలు, ప్రభుత్వాలు సేకరించి ఉపయోగించుకునే అవకాశం లేకుండా చట్టాన్ని రూపొందించాలని సూచించింది. అంతేకాక అలాంటి కంపెనీలు, ప్రభుత్వాలను బాధ్యులను చేసి చర్యలు తీసుకోవాలని కూడా తెలిపింది. ఈ పత్రాన్ని ఇటీవల ప్రచురించారు.

వ్యక్తులకు సంబంధించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచడం ప్రాథమిక హక్కు అని, ఇందుకోసం ప్రభుత్వం ఒక వ్యవస్థను రూపొందించి అమలు చేయాలని 2017లోనే సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే అప్పటి నుంచి రోజులు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం సమాచార రక్షణ కోసం చట్టాన్ని మాత్రం రూపొందించలేదు. దీనివల్ల పౌరులు గోప్యతకు సంబంధించిన ప్రాథమిక హక్కును కోల్పోతున్నారు. తమ సమాచారాన్ని గోప్యంగా ఉంచుకునే అవకాశం లేకపోవడం వల్ల 2021లో ఎనిమిది కోట్ల మంది ప్రజలకు నష్టం వాటిల్లింది. వాస్తవానికి ఈ అవకాశం లేని దేశాల జాబితాలో ఆ సంవత్సరం భారత్ మూడో స్థానంలో నిలిచింది. ఎయిర్ ఇండియా, డొమినో, ఫేస్‌బుక్, మొబిక్‌విక్, అప్‌స్టోక్ వంటి పేరున్న సంస్థలు వినియోగదారుల పేర్లు, ఫోన్ నెంబర్లు, బ్యాంక్ అకౌంట్లు, పాస్‌పోర్టులు, ఆధార్ వంటి సమాచారాన్ని సేకరించి ఉల్లంఘనలకు పాల్పడ్డాయి.

ఇలాంటి ఉల్లంఘనల కారణంగా ప్రతి సంవత్సరం ఎంత మేర నష్టం జరుగుతోందో ఐబీఎం అంచనా వేసింది. 2021లో సమాచార చౌర్యం కారణంగా దేశంలోని వినియోగదారులు 22 లక్షల డాలర్ల మేర నష్టపోయారు. ప్రపంచ దేశాలలో 42.4 లక్షల డాలర్ల మేర సమాచార చౌర్యం జరిగిందని ఐబీఎంను ఉటంకిస్తూ ఐఎంఎఫ్ తెలిపింది. తమ సమాచారం చౌర్యానికి గురవుతుండడంతో వినియోగదారులకు డిజిటల్ మాధ్యమాలపై విశ్వాసం పోతోందని ఐఎంఎఫ్ పత్రం అభిప్రాయపడింది.

2012లో పీడీఎస్‌పై పెట్టిన ఖర్చులో 36 శాతం వరకూ అసలైన లబ్ధిదారులకు చేరనేలేదు. అనర్హులను లబ్ధిదారులుగా చేర్చడం, సబ్సిడీ సరుకులను డీలర్లు అక్రమంగా పక్కదారి పట్టించడం దీనికి కారణం. ఈ నేపథ్యంలో సామాజిక భద్రతా పథకాలను మరింత ఆధునీకరించాల్సిన అవసరం ఉన్నదని ఐఎంఎఫ్ అభిప్రాయపడింది. కోవిడ్ తర్వాత ఈ పథకాలలో చేరిన వారి సంఖ్య బాగా పెరిగింది. అయినప్పటికీ అర్హులైన మహిళలలో సగం మందికి ఇవి ఇంకా చేరలేదు. అందువల్ల మరింత మందిని ...5లో

రెజ్లర్ల ఆందోళనకు వెల్లువెత్తిన మద్దతు

బృందా కరత్, మాజీ సీఎం భూపేంద్ర సింగ్ హుడా తదితరుల సంఘీభావం

- రెజ్లర్ల ఆరోపణలు తీవ్రమైనవే : సుప్రీం కోర్టు
- రెజ్లర్ల పిటిషన్‌పై ఢిల్లీ పోలీసులకు నోటీసులు
- రేపు దేశవ్యాప్త నిరసనకు ఐదు సంఘాల పిలుపు



న్యూఢిల్లీ : లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఎస్ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న రెజ్లర్లకు మద్దతు వెల్లువెత్తింది. మేఘాలయా మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్, హర్యానా మాజీ ముఖ్యమంత్రి భూపేంద్ర సింగ్ హుడా, సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎంపీ బృందాకరత్, మాజీ ఎంపీ, ఏఐకేఎస్ ఉపాధ్యక్షుడు హన్నన్ మొల్లా, రాజ్యసభ ఎంపీ, డీవైఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు ఎఎ రహీం, కిసాన్ నేత రాకేష్ టికాయిత్, రెజ్లర్ గీతా ఫోగట్, ...5లో



కేరళలో వందేభారత్..



ప్రారంభించిన ప్రధాని మోడీ

తిరువనంతపురం : కేరళ మొదటి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం ప్రారంభించారు. తిరువనంతపురం సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో ఉదయం 11.10గంటలకు ఈ రైలు బయలుదేరింది. సెమీ హై స్పీడ్, పూర్తి ఎయిర్ కండీషన్డ్ సర్వీస్ అయిన ఈ రైలు 11 జిల్లాల గుండా ప్రయాణిస్తుంది. దక్షిణాన తిరువనంతపురం నుంచి ఉత్తరాన గల కాసర్‌గోడ్‌ను ఈ రైలు కలుపుతుంది. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ పచ్చజెండాను ప్రధానికి అందచేయగా, ఆయన దాన్ని ఊపగానే రైలు బయలుదేరింది. ఈ కార్యక్రమంలో గవర్నర్ అరిఫ్ మహ్మద్ ఖాన్, ముఖ్యమంత్రి పినరయి విజయన్, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, ఎంపీ శశి థరూర్‌లు పాల్గొన్నారు. కోచి నుండి నేరుగా తిరువనంతపురం చేరుకున్న మోడీ అక్కడ నుండి సరాసరి సెంట్రల్ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. స్టేషన్‌కి రాగానే మోడీ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లోకి వెళ్ళి అక్కడ గల పాఠశాల విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. ఈ వందేభారత్ రైలు 14 రైల్వే స్టేషన్లలో ఆగనుది. 26న కాసర్‌గోడ్ నుండి తిరువనంతపురానికి, 28న తిరువనంతపురం నుంచి కాసర్‌గోడ్‌కు ఈ రైలు తిరగనుంది. గురువారాలు మినహా అన్ని వారాల్లో ఈ రైలు సర్వీసులు వుంటాయి. ఆదివారం ఉదయం నుంచి బుకింగ్స్ ఆరంభమయ్యాయి.

రైతులను ఆదుకోవాలి



సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని గోళ్లపాడు, పొన్నెకల్లు గ్రామాల్లో మంగళవారం తమ్మినేని పర్యటించి తడిసిన ధాన్యాన్ని, నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి మామిడి తోటలకు రూ.50 వేలు, వరి పంటకు 30 వేలు, మొక్కజొన్న రైతులకు ...5లో

చట్టానికి చిక్కిన బీజేపీ విదేశీ స్నేహితుడు !



న్యూఢిల్లీ : ఆస్ట్రేలియాలో 'బీజేపీ విదేశీ స్నేహితుల సంఘం' వ్యవస్థాపక సభ్యుడొకరు తీవ్రమైన నేరాలకు పాల్పడినట్లు అక్కడి కోర్టు నిర్ధారించింది. బాలేష్ ధన్‌కర్ అనే ఈ బీజేపీ 'స్నేహితుడు' మాదకద్రవ్యాలు, లైంగికదాడులు వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడ్డాడని సిడ్నీలోని జిల్లా కోర్టు ధృవీకరించింది. ధన్‌కర్ పైశాచిక అకృత్యాలపై న్యాయస్థానం దిగ్భ్రాంతి వ్యక్తం చేసిందని ఆస్ట్రేలియా మీడియా వ్యాఖ్యానించింది. 'సిడ్నీ చరిత్రలో అత్యంత క్రూరుడైన అత్యాచార నిందితులలో ధన్‌కర్ ఒకరు' అని సిడ్నీ ...5లో

బీజేపీ విధానాలతో
దేశం సర్వనాశనం

కేసీఆర్ నాయకత్వం అనివార్యం

- బ్రెయిన్ లేని బంటి.. పార్టీలు మారే సంటీ ప్రతిపక్ష పార్టీల అధ్యక్షులు : కేటీఆర్



నవతెలంగాణ - సిరిసిల్ల/విలేకరులు

బీజేపీ ప్రభుత్వ విధానాలతో దేశం సర్వనాశనం అయిందని మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. దేశంలోనే తెలంగాణను అభివృద్ధికి చిరునామాగా చేసిన కేసీఆర్ నాయకత్వం దేశానికి అనివార్యమైందని స్పష్టం చేశారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆవిర్భావ సభలు నిర్వహించారు. అందులో భాగంగా సిరిసిల్ల నియోజకవర్గ స్థాయి ప్లీనరీ, పార్టీ ఆవిర్భావ సభ సిరిసిల్ల పురపాలక పరిధి అపెరల్ పార్కు వద్ద నిర్వహించారు. మంత్రి పార్టీ జెండా ఆవిష్కరించి అమరవీరుల ...5లో

గుజరాత్ హైకోర్టుకు రాహుల్

- సూరత్ కోర్టు తీర్పుపై అప్పీల్..!



అహ్మదాబాద్ : పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి కోర్టును ఆశ్రయించారు. సూరత్ సెషన్స్ కోర్టు శిక్షపై స్టే విధించేందుకు నిరాకరించడంతో తాజాగా గుజరాత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మోడీ ఇంటి పేరుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో ట్రయల్ కోర్టు రాహుల్‌గాంధీకి ...5లో

30న మధ్యాహ్నం 1.32 గంటలకు

నూతన సచివాలయ ప్రారంభోత్సవం

- అదే రోజు సుదర్శనయాగం
- నేటి నుంచి 28 వరకు కార్యాలయాల తరలింపు
- ఆరో ఫ్లోర్ సీఎం, సీఎస్‌కు కేటాయింపు
- టీఎస్ఎస్పీకి భద్రత బాధ్యతలు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

సీఎం కేసీఆర్ ఆకాంక్షలు, తెలంగాణ దక్కన్ సంస్కృతీ సంప్రదాయాల మేళవింపుతో నిర్మితమవుతున్న కొత్త సచివాలయం ఈనెల 30న మధ్యాహ్నం 1.32 గంటలకు ప్రారంభం కానుంది. సుదర్శన యాగం పూర్ణాహుతి తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధాన ద్వారం వద్ద రిబ్బన్ కత్తిరించి నూతన సెక్రటేరియట్‌ను లాంఛనంగా ప్రారంభిస్తారు. ఆరో అంతస్తులోకి చేరుకుని సీఎం కార్యాలయంలోని ముఖ్యమంత్రి ఆసనంపై ఆయన కూర్చొంటారు. మధ్యాహ్నం 1.58 గంటల నుంచి 2.04 గంటల మధ్య మంత్రులు, అధికారులు, ఇతర సిబ్బంది తమ కార్యాలయాల్లోకి చేరుకుంటారు. ఆ తర్వాత సచివాలయ ప్రాంగణంలో సీఎం కేసీఆర్ ప్రసంగిస్తారు. ఈ మేరకు కార్యక్రమ షెడ్యూల్‌ను ప్రభుత్వం మంగళవారం సిద్ధం చేసింది.

కొత్త సచివాలయంలోకి ఆయా శాఖల తరలింపు బుధవారం నుంచి ప్రారంభంకానుంది. ఈనెల 27వరకు తరలింపు ప్రక్రియను పూర్తి చేయాలని మంగళవారం ఆయా శాఖల హెచ్‌వోడీలు ఆదేశాలు జారీచేశారు.

దాదాపు రూ.617 కోట్లతో 26.9 ఎకరాల స్థలంలో సుమారు 10.5 లక్షల అడుగుల విస్తీర్ణంలో నూతన సచివాలయాన్ని నిర్మించారు. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలు పార్టీల నేతలను ప్రారంభోత్సవానికి ఆహ్వానించనున్నారు. ఇప్పటికే ముందస్తు అధికారిక ఆహ్వానాలు వెళ్లాయి. తరువాత ముఖ్యమంత్రులకు స్వయంగా కేసీఆర్ ఫోన్ చేసి పిలవనున్నారు. సాగర తీరాన అత్యంత కళాత్మకంగా నిర్మించిన ...5లో

వలస కార్మికులు ఎవరికీ పట్టనోళ్లు

వారి బతుకులు దుర్భరం

- చట్టాల అమలు కోసం పోరాటం : సీడబ్ల్యూఎఫ్ఐ అఖిల భారత ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వలస కార్మికులు ఎవ్వరికీ పట్టనోళ్లుగా మారారనీ, వారి బతుకులు దుర్భరంగా ఉన్నాయని సీడబ్ల్యూఎఫ్ఐ అఖిల భారత ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబు అన్నారు. వలస కార్మికుల చట్టాలనూ పాలకులు, యజమానులు బుట్టదాఖలు చేస్తున్నారని విమర్శించారు. ఆ చట్టాలను పకడ్బందీగా అమలు చేసేందుకు సీఐటీయూ పోరాడుతున్నదని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భవన నిర్మాణ రంగ వలస కార్మికుల రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.సాయిబాబు మాట్లాడుతూ...వలస కార్మికులు రోజుకు 14 నుంచి 16 గంటలు పనిచేస్తున్నారనీ, వారికి ఎక్కడ కూడా కనీస వేతనాలు అమలు కావడం లేదని చెప్పారు. వారికి సామాజిక భద్రత కరువైందన్నారు. అటు సొంత ప్రాంతంలోనూ, ఇటు పని ప్రదేశంలోనూ ఆధార్, రేషన్, ఓటర్ కార్డులు లేక వారు అవస్థలు పడుతున్న తీరును వివరించారు. ప్రతి పౌరునికీ దేశంలో ఎక్కడైనా స్వేచ్ఛగా జీవించే హక్కు ఉంటుందని ఆర్టికల్ 19(1) చెబుతుంటే...వలస ...5లో

బిజినెస్

తగ్గుతోన్న డాలర్ వాడకం

- ప్రత్యామ్నాయాలపై చైనా దృష్టి
- ఎల్ఎన్జి కోసం యుఎఇతో జట్టు



షాంఘై : ప్రపంచ వ్యాప్తంగా డాలర్ వాడకంలో తగ్గుదల చోటు చేసుకుంటుంది. వాణిజ్యంలో అమెరికన్ డాలర్ కాకుండా ఇతర అనుకూలమైన కరెన్సీల వినియోగంపై అనేక దేశాలు దృష్టి పెడు తున్నాయి. చైనా, ఇతర దేశాలు సరిహద్దు వాణిజ్యం కోసం స్థానిక కరెన్సీ లను ఉపయోగించడం ద్వారా డాలర్‌పై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గిస్తు న్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మల్టీపోలార్ అంతర్జాతీయ కరెన్సీ వ్యవస్థను రూపొందించడంపై దృష్టి పెడుతున్నాయని భావిస్తున్నారు. ఈ ఏడాది మార్చి చివరలో షాంఘై పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ ఎక్స్చేంజ్ చైనా యువాన్‌ను ఉపయోగించి యునైటెడ్ అరబ్ ఎమి రేట్స్ నుండి సహజ వాయువును దిగుమతి చేసుకుంది. లిక్విఫైడ్ న్యాచు రల్ గ్యాస్ (ఎల్ఎన్జి) రెండో అతిపెద్ద దిగుమతిదారుగా ఉన్న చైనా తొలి సారి తన సొంత కరెన్సీని దీనికి వాడటం విశేషం. ప్రపంచ వస్తువుల వాణిజ్యం లో చాలా కాలంగా డాలర్ ఆధిపత్యం కొనసాగుతోన్న విషయం తెలిసిందే.

చమురు ఎగుమతి చేసే దేశాలు అంతర్జాతీయ స్థాయిలో డాలర్ కంటే యువాన్ వంటి కరెన్సీలను ఉపయోగించేందుకు ఆసక్తి చూపుతున్నాయని యుఎఇ ఎల్ఎన్జి ఒప్పందంతో తేలిందని స్విట్జర్లాండ్‌లోని ఫ్రిబోర్గ్ విశ్వవిద్యాలయంలోని స్థూల ఆర్థిక, ద్రవ్య ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్ సెర్గియో రోస్సీ పేర్కొన్నారు.

మహీంద్రా నుంచి బొలెరో మాక్స్ పిక్అప్ శ్రేణీ



హైదరాబాద్: మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) పికప్ బ్రాండ్ బొలెరోలో కొత్తగా మాక్స్ శ్రేణీని ఆవిష్కరించింది. మంగళవారం హైదరాబాద్‌లో వీటిని ఆ కంపెనీ సౌత్ జోనల్ హెడ్ అరునంగ్షు లాంఛనంగా మార్కెట్లోకి విడుదల చేశారు. మాక్స్ శ్రేణీ నూతన మైలురాళ్లను సృష్టించనుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కొత్త శ్రేణీ అధిక పేలోడ్ సామర్థ్యం, మెరుగైన మైలేజ్ , పనితీరు, ఉత్తమ సౌకర్యం, భద్రత, అత్యంత విశ్వసనీయ, సమర్థవంతమైన రవాణా పరిష్కారాన్ని అందిస్తుందన్నారు. కనీసం రూ.24,999 డౌన్ పేమెంట్‌తో దీన్ని బుక్ చేసుకోవచ్చన్నారు. ఆకర్షణీయమైన ఫైనాన్సింగ్ పథకాలను కూడా అందిస్తోన్నామన్నారు. వీటి ధరల శ్రేణీని రూ.7.85 లక్షల నుంచి రూ.10.33 లక్షలుగా నిర్ణయించింది.

సహకార బ్యాంక్‌లకు ఆర్‌బిఐ షాక్

ముంబయి : పలు నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను నాలుగు సహకార బ్యాంకులకు ఆర్‌బిఐ షాక్ ఇచ్చింది. ఈ జాబితాలోని తమిళనాడు స్టేట్ అపెక్స్ కో-ఆపరేటివ్ బ్యాంక్, బాంబే మర్కంటైల్ కో-ఆపరేటివ్ బ్యాంక్, జనతా సహకరి బ్యాంక్, బరన్ నాగ్రిక్ సహకరి బ్యాంక్‌లపై కొరడా ఝులిపించింది. ఆయా బ్యాంకులకు రూ.44 లక్షల భారీ జరిమానా విధించింది. తమిళనాడు స్టేట్ అపెక్స్ కో-ఆపరేటివ్ బ్యాంకుకు గరిష్ఠంగా రూ.16 లక్షలు, బాంబే మర్కంటైల్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌కు రూ.13 లక్షలు, జనతా సహకరి బ్యాంక్‌కు రూ.13 లక్షలు, బరన్ నాగ్రిక్ బ్యాంకుకు రూ.2 లక్షల చొప్పున ఆర్‌బిఐ జరిమానా వేసింది.

ఎల్లుండి నుంచి రెన్యూవబుల్ ఎనర్జీ ఎక్స్‌పో

హైదరాబాద్ : నగరంలోని హైటెక్స్‌లో ఏప్రిల్ 28, 29 తేదిల్లో రెన్యూవబుల్ ఎనర్జీ ట్రేడ్ ఎక్స్ పోను నిర్వహించనున్నారు. రెండు రోజుల పాటు సాగనున్న ఈ రెన్యూఎక్స్7వ ఎడిషన్‌లో డిసిఆర్ మాడ్యూల్స్ మోనోఫెషియల్, బైఫేషియల్ వేరియంట్‌లు అందుబాటులో ఉంటాయని గోల్డి సోలార్ గ్లోబల్ హెడ్ హర్దీప్ సింగ్ పేర్కొన్నారు. పవర్ అవుట్‌పుట్ 520 డబ్ల్యుపి నుండి 550 డబ్ల్యుపి వరకు డిసిఆర్ మాడ్యుల్స్ ఉంటాయని.. ఇవి నివాస, ప్రభుత్వ ప్రాజెక్టులకు అనువైనవని తెలిపారు.

తొమ్మిది ఇసి కేంద్రాలకు ఓలా విస్తరణ

హైదరాబాద్ : విద్యుత్ వాహన కంపెనీ అయిన ఓలా ఎలక్ట్రిక్ కొత్తగా హైదరాబాద్‌లో రెండు ఎక్స్‌పీరియన్స్ సెంటర్ల (ఇసి)ను తెరిచినట్లు ప్రకటించింది. దేశ వ్యాప్త విస్తరణలో భాగంగా వీటిని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. శంషాబాద్, ఎఎస్ రావు నగర్‌లో కొత్త అవుట్‌లెట్‌లను ఏర్పాటు చేయడం ద్వారా నగరంలో వీటి సంఖ్య తొమ్మిదికి చేరినట్లు వెల్లడించింది. ఈ స్టోర్లలో ఇవి ఉత్పత్తులను ప్రదర్శన, అమ్మకానికి ఉంచుతోంది.

మీనా ప్రింట్స్ నుంచి కొత్త 'అనంత' బ్రాండ్

హైదరాబాద్:ఎస్‌వి గ్రూపు ఆఫ్ కంపెనీస్, లివా భాగస్వామ్యంతో మీనా ప్రింట్స్ కొత్తగా 'అనంత' బ్రాండ్ చీరను ఆవిష్కరించింది. ఈ బ్రాండ్‌ను హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో విడుదల చేసినట్లు ఆ సంస్థ పేర్కొంది. దక్షిణాదిలో తొలుత అందుబాటులోకి తెచ్చిన ఈ బ్రాండ్‌ను దేశ వ్యాప్తంగా విస్తరించనున్నామని మీనా ప్రింట్స్ ఎండి భరత్ పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన మహారాష్ట్ర ప్రజలు

హైదరాబాద్:మహారాష్ట్రలోని యావత్ మాల్ జిల్లా పరిధిలోని పరాన్ బురి, కెలాపూర్, కరంజి, ఖైర్గావ్, సున్న, వంజ్రి, కోపమంద్వి, పిప్పల్ఖుంటి, కొడ్డురి, పందర్కొద, మాంద్వి, చిల్కల్ వార్ద, పార్వ తదితర గ్రామాలకు చెందిన వారు బీఆర్ఎస్ లో చేరారు. మంగళవారం హైదరా బాద్‌లోని బంజారా హిల్స్‌లో హెూం మంత్రి మహమూద్ అలీ నివాసంలో వారు ఆయన్ను కలిశారు. ఈ సందర్భ ంగా మంత్రి వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. మహా రాష్ట్రలో బీఆర్ ఎస్‌కు అపూర్వ స్పందన లభిస్తున్నద నీ, తెలంగాణ మోడల్ అక్కడ అమలు కావాలని ప్రజలు కోరుకుంటున్నారని వివరిం చారు. కేసీఆర్ నాయకత్వాన్ని అక్కడి ప్రజలు కోరుకుంటున్నారని మంత్రి సందర్భంగా తెలిపారు. పార్టీలో చేరిన ఉపసర్పంచ్ మధుకర్ అల్లూర్ వార్ మాట్లాడుతూ తెలంగాణలో అమలవుతున్న రైతుబంధు, దళిత బంధు, ఉచిత విద్యుత్ వంటి పథకాలు తమను ప్రభావితం చేశాయని తెలిపారు.

ఆర్టిజన్ కార్మికుల డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలి : ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. సమస్యల పరిష్కారం కోసం మంగళవారం నుంచి తలపెట్టిన సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమ్మెకు సంఘీభావంగా అన్ని జిల్లాల్లో ఐఎఫ్‌టీయూ, దాని అనుబంధ శ్రేణులు కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. విద్యుత్ రంగంలోని ఆర్టిజన్ కార్మికులకు శాశ్వత ఉద్యోగులకు వర్తించే అన్ని నిబంధనలను వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. వారికి ఏపీఎస్ఈబీ నిబంధనలను అమలు చేయాలని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న స్టాండింగ్ నిబంధనలను రద్దు చేయాలని పేర్కొన్నారు. ఆర్టిజన్లకు పర్సనల్ బేసిక్‌లో డీఏ కలిపి ఫిట్‌మెంట్ ఇవ్వాలని సూచించారు. పీఆర్సీ-2018లో నష్టపోయిన పది శాతం కలిపి 40 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు చేస్తున్న కుట్రలను గమనించి విద్యుత్ రంగంలోని అన్ని కార్మిక సంఘాలు ఒక తాటిమీదకు రావాలని, ఐక్యంగా ఈ సమ్మెను కొనసాగించాలని కోరారు.

30న ఒకేరోజు నాలుగు పరీక్షలు

- వేర్వేరు తేదీల్లో నిర్వహించాలి : ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఈనెల 30న ఒకేరోజు నాలుగు పరీక్షలను నిర్వహిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కానిస్టేబుల్, కమ్యూనికేషన్ కానిస్టేబుల్, అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ), జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం) పరీక్షలను ఒకే రోజు నిర్వహించడం సరైంది కాదని పేర్కొన్నారు. ఇది నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడడమేనని విమర్శించారు. ఒకే రోజు కాకుండా వేర్వేరు తేదీల్లో ఆయా పరీక్షలను నిర్వహించాలని కోరారు. నిరుద్యోగులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

మా అమ్మానాన్నలను కలపండి

ప్రభుత్వానికి పిల్లల వేడుకోలు

- స్పౌజ్ బదిలీలు చేపట్టాలి
- 13 జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ఉపాధ్యాయుల నిరసన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'మా అమ్మానాన్నలను కలపండి'అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని పిల్లలు వేడుకున్నారు. ఫ్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. స్పౌజ్ బదిలీలను వెంటనే చేపట్టాలంటూ ఉపాధ్యాయ కుటుంబాలు రోడ్డెక్కాయి. 13 జిల్లాల కలెక్టరేట్ల ఎదుట టీచర్లు మంగళవారం శాంతియుతంగా నిరసన చేపట్టారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, స్పౌజ్ బదిలీలు చేపట్టాలని కోరారు.

జీవో 317 అమల్లో భాగంగా ఉపాధ్యాయ దంపతులను ఒకే జిల్లాకు కేటాయించాల్సి ఉందని, కొన్ని సాంకేతిక కారణాల వల్ల 13 జిల్లాల్లో వారి బదిలీలు నిలిచి పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్పౌజ్ ఫోరం అధ్యక్షులు వివేక్, ప్రధాన కార్యదర్శి ఖాదర్, కో కన్వీనర్లు త్రివేణి, సిద్ధయ్య, ఎస్‌వీసీఎస్ రెడ్డి, ఎస్ఆర్‌కే రావు, సునిత, సూర్య ఒక ప్రకటన విడుదల చేశారు. 2021 డిసెంబర్‌లో ఉపాధ్యాయు ల జిల్లా కేటాయింపు ప్రక్రియ పూర్తవగా, అందులోనే భాగమైన దంపతులను ఒకే జిల్లాకు కేటాయించా ల్సిన విషయం ఇప్పటికీ అపరిష్కృతంగానే మిగిలి పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఉపాధ్యాయ దంపతులు భర్త భార్య ఒకే జిల్లాకు చేరుకోవడం కోసం 16 నెలలుగా ప్రభుత్వానికి, అధికారులకు విన్నవించుకుంటూనే ఉన్నారని పేర్కొన్నారు. గత జనవరిలో స్కూల్ అసిస్టెంట్ విభాగంలోని 615 మందికి బదిలీలు చేపట్టారని గుర్తు చేశారు. ఇంకా 1,600 మందికి స్పౌజ్ కోటాలో ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. వారంతా 2022 జనవరి నుంచి బదిలీల కోసం నిరీక్షిస్తూనే ఉన్నారని వివరించారు.. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ స్పౌజ్ బదిలీల పట్ల కరుణించాలని కోరారు. మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, భాషా పండితుల స్పౌజ్ బదిలీలు వెంటనే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

కాంట్రాక్ట్ పారామెడికల్ స్టాఫ్‌ను విధుల్లోకి తీసుకోవాలి

- సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్షులు కుమార్ స్వామి
- ఆల్ ఇండియా రైల్వే కాంట్రాక్ట్ పారామెడికల్ స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా



నవతెలంగాణ-ఓయూ

దేశవ్యాప్తంగా రైల్వేలో తొలగించి న కాంట్రాక్ట్ పారామెడికల్ స్టాఫ్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షులు జె.కుమార్ స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం జనరల్ మేనేజర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. 2005 నుంచి రైల్వేలో డైరెక్టుగా రిక్రూటైన, కోవిడ్ సమ యంలో డైరెక్ట్‌గా రిక్రూటైన కాంట్రాక్ట్ పారా మెడికల్ స్టాఫ్‌ను రైల్వే యాజమాన్యం విధుల్లో నుంచి తీసే యడం దుర్మార్గ మన్నారు. తొలగించిన ఉద్యోగులంద రినీ బేషరతుగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశా రు. రైల్వే పారా మెడికల్ ఉద్యోగులకు నష్టం చేస్తున్న జీఈఎం పోర్టల్‌ను రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న పారామెడికల్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అలాగే గతంలో పనిచేసిన కాంట్రాక్టు పారా మెడికల్ స్టాఫ్‌కు వెయిటేజీ ఇవ్వాలన్నారు. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్‌ను వెంటనే రద్దు చేయాలని, రైల్వే ఆస్తుల ప్రయి వేటీకరణ ఆపాలని, కేంద్ర ప్రభుత్వం, రైల్వే యాజమాన్యం దిగొచ్చి కాంట్రాక్ట్ పారామెడికల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.అజయ్ బాబు, ఎం. అజయ్ బాబు షామిలి, కవిత, షామిలి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ శతజయంతి నేపథ్యంలో

పార్లమెంటు నియోజకవర్గాల్లో ప్రత్యేక సభలు

టీడీపీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్



నవతెలంగాణ-హైదరాబాద్

తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలుగు దేశం తెలంగాణ శాఖ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ప్రకటించారు. మే 28 ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా 100 ప్రత్యేక సభలను చేపడతామని తెలియ జేశారు. రెండు తెలుగు రాష్ట్రాలలో పార్లమెంటు నియోజక వర్గాల వారీగా ఎన్టీఆర్ శతజయంతి సభలను నిర్వహించేందుకుగాను కార్యాచరణను సిద్ధం చేశామని చెప్పారు. తెలంగాణలో 17 చోట్ల, ఆంధ్రప్రదేశ్‌లో 25 చోట్ల ఈ సభలు జరుగుతాయని చెప్పారు. మొత్తం 100 చోట్ల ఎన్టీఆర్ శత జయంతి సభల ఏర్పాటు చేస్తామన్నారు. తెలంగాణలో ఈనెల 29 నుంచి వచ్చే నెల మే 20 వరకు నిర్వహిస్తామన్నారు. ఎన్టీఆర్ సినీ జీవితం, రాజకీయ రంగప్రవేశం, ముఖ్యమంత్రిగా ప్రజా సంక్షేమ పాలన ప్రాముఖ్యతలను గుర్తు చేస్తూ వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్టు కాసాని వివరించారు. ఈమేరకు ప్రత్యేక సభల షెడ్యూల్‌ను ఖరారు చేశామన్నారు.

సభల షెడ్యూల్

ఏప్రిల్ 29న జహీరాబాద్ పార్లమెంటు - వర్ని(బాన్సువాడ నియోజకవర్గం), మే 3న మహబూబ్‌నగర్ పార్లమెంటు - మహబూబ్‌నగర్ టౌన్, మే 4న భువనగిరి పార్లమెంటు - చౌటుప్పల్ (మునుగోడు నియోజకవర్గం), మే 6న హైదరాబాద్ పార్లమెంటు - కార్వాన్ (కార్వాన్ నియోజకవర్గం), మే 7న ఖమ్మం పార్లమెంటు - ఖమ్మం టౌన్, మే 8న మహబూబాబాద్ పార్లమెంటు - ములుగు , సికింద్రాబాద్ పార్లమెంటు - ఖైరతాబాద్ నియోజకవర్గం, మే 10న మెదక్ పార్లమెంటు - నరసాపూర్ , మే 11న ఆదిలాబాద్ పార్లమెంటు - ఉట్నూరు ,మే 12న కరీంనగర్ పార్లమెంటు - కరీంనగర్ నగరం, మే 13న నాగర్ కర్నూలు పార్లమెంటు - కొల్లాపూర్ , మే 14న పెద్దపల్లి పార్లమెంటు - మందమర్రి టౌన్ (చెన్నూరు నియోజకవర్గం), మే 15న చేవెళ్ల పార్లమెంటు - పరిగి టౌన్, మే 16న వరంగల్ పార్లమెంటు - వరంగల్ నగరం, మే 17న నిజామాబాద్ పార్లమెంటు - ఆర్మూరు టౌన్, మే 19న మల్కాజ్‌గిరి పార్ల మెంటు - బాచుపల్లి(కుత్బుల్లాపూర్ నియోజకవర్గం), మే 20న నల్లగొండ పార్ల మెంటు - మిర్యాలగూడ టౌన్‌లో ప్రత్యేక సభలు జరుగుతాయని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల

సంక్షేమ పథకాలపై ఆరోపణలు తగవు

తెలంగాణ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల వెల్ఫేర్ బోర్డు సీఈఓ గంగాధర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల అమలు తీరులో అవినీతి జరుగు తున్నదన్న వార్తలో వాస్తవం లేదని తెలంగాణ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల వెల్ఫేర్‌బోర్డు కార్యదర్శి, సీఈఓ. ఈ.గంగాధర్ తెలిపారు. వెల్ఫేర్‌బోర్డులో వేల కోట్ల దుర్వినియోగం పేరుతో పత్రికల్లో వచ్చిన కథనాలను ఆయన రిజాయిండర్ ద్వారా ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమ బోర్డు ప్రభుత్వ అజమాయిషీలో పనిచేసే స్వయం ప్రతి పత్తిగల సంస్థ అని పేర్కొన్నారు. తమకు బడ్జెట్ ద్వారా నిధులు రావనీ, కార్మికుల సెస్సు, రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్ ఫీజుల ద్వారానే నిధులను సమకూర్చుకుంటామని స్పష్టం చేశారు. తమ సొంత నిధులను సంక్షేమ పథకాలపై ఖర్చుచేసిన వివరాలతో పోల్చడం సరిగాదని పేర్కొన్నారు. ఈ ఏడాది అన్ని పథకాలపై తాము ఖర్చుచేసింది రూ.411.5 కోట్లు మాత్రమేననీ, రూ.1419 కోట్లు కాదని స్పష్టం చేశారు. లబ్ది దారుల క్లయిమ్స్ స్వీకరణ దశ నుంచి పరిశీలన, అనుమతి, చివరకు క్లయిమ్ మొత్తాన్ని లబ్దిదారుల బ్యాంకు అకౌంట్లోనే జమ చేయడం వరకు మూడో వ్యక్తి ప్రమేయమే ఉండబోదని తెలిపారు. లబ్దిదారుల ఖాతాల్లోనే నేరుగా డబ్బులు జమచేస్తున్నామని తెలిపారు. వ్యవస్థలోని లోపాలను ఎప్పటికప్పుడు సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నామని తెలి పారు. బోర్డు జమా ఖర్చులు సీఏ ద్వారా అంతర్గత ఆడిట్‌తో పాటు అకౌంటెంట్ జనరల్‌తోనూ ఆడిట్ చేయిస్తామని పేర్కొన్నా రు. సెస్సు వసూలు విషయం లో అవకతవకలు జరగలేద నీ, మెట్రో రైలు కేసు కోర్టులో ఉందని తెలిపారు. బోర్డుకు సంబంధించిన వార్తలు రాసే సమయంలో తమను సంప్రదించాలని సూచించారు.

సామూహిక లైంగిక దాడి కేసును పోక్సో కోర్టు రివ్యూ చేయాలి : హైకోర్టు

నవతెలంగాణ -హైదరాబాద్

రాష్ట్రంలో తీవ్ర సంచలనం రేపిన జూబ్లీహిల్స్ సామూహిక లైంగికదాడి కేసులో గతంలో పోక్సో కోర్టు ఇచ్చిన తీర్పును రివ్యూ చేయాలని అదే కోర్టును హైకోర్టు ఆదేశించింది. ఆరో నిందితుడిని మేజర్‌గా పరిగణిస్తూ ఇచ్చిన పోక్సో కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని నిందితుడి తల్లి వేసిన పిటిషన్‌ను జస్టిస్ జి.అనుపమ చక్రవర్తి విచారణ జరిపి పైవిధంగా ఆదేశాలిచ్చారు. 2022 మే 28 స్నేహితులతో కలిసి అమ్నేసియా పబ్ కేసులో ఫ్రెషర్స్ డే పార్టీకి వెళ్లిన తనపై సామూహిక లైంగికదాడి జరిగిందని మైనర్ బాలిక మీడియాకు చెప్పింది.

మే 31 నుంచి అంబేద్కర్ వర్సిటీ డిగ్రీ పరీక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బీఆర్ఏఓయూ) డిగ్రీ మూడు, రెండు, మొదటి సంవత్సరం (పాత బ్యాచ్) 2016, అంతకు ముందు బ్యాచ్ విద్యార్థులకు వచ్చేనెల 31 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి పి వెంకట రమణ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిగ్రీ మూడో సంవత్సరం పరీక్షలు వచ్చేనెల 31 నుంచి జూన్ ఐదో తేదీ వరకు, రెండో సంవత్సరం పరీక్షలు జూన్ ఏడు నుంచి 14వ తేదీ వరకు, మొదటి సంవత్సరం పరీక్షలు అదేనెల 16 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేది వచ్చేనెల పదో తేదీ వరకు ఉందని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు విశ్వవిద్యాలయ పోర్టల్ www.braouonline.in లో నమోదు చేసుకోవాలని సూచించారు. పరీక్ష ఫీజును టీఎస్/ఏపీ ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా డెబిట్, క్రెడిట్ కార్డుతో మాత్రమే చెల్లించాలని కోరారు.

ప్రవేశ పరీక్షల హాల్ టికెట్ల డౌన్ లోడ్ చేసుకోవాలి

- బీసీ గురుకుల కార్యదర్శి డాక్టర్ మల్లయ్య భట్టు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీ గురుకులాల్లో ఇంటర్, డిగ్రీ కోర్సుల ప్రవేశ పరీక్షకు విద్యార్థులు హాల్ టికెట్లను వెబ్ సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవచ్చని మహాత్మా జ్యోతిభా పూలే గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ మల్లయ్యభట్టు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ గురుకుల విద్యాసంస్థల http://mjptbcwreis.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు. ఏప్రిల్ 30న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరగనున్నదని తెలిపారు. అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 277 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నామనీ, సంబధిత ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే 040 - 23328266, 23322377 నంబర్లను సంప్రదించాలని మల్లయ్య భట్టు సూచించారు.

వారంలోనే ఇంటికి..!

- పెండింగ్ లేకుండా డ్రైవింగ్ లెసెన్సులు, ఆర్సీల జారీ
- నెలల తరబడి జాప్యానికి చెక్‌పెట్టేలా ఆర్టీఏ కార్యాచరణ
- వాహనదారులకు సకాలంలో కార్డులు అందేలా చర్యలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

డ్రైవింగ్ లెసెన్సు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారా? నెలలు దాటుతున్నా స్మార్ట్‌కార్డు మీ ఇంటికి చేరలేదా? ఆర్సీ, డీఎల్, ఇలా సర్వీస్ ఏదైనా స్మార్ట్ కార్డు కోసం నిరీక్షిస్తున్నారా? ఇక ఆ చింత వదిలేయమని రవాణాశాఖ వినియోగదారులకు సూచిస్తోంది. గతంలో మాదిరిగా పది నుంచి 20 రోజులు కాకుండా కేవలం రెండు రోజుల వ్యవధి నుంచి వారం రోజుల లోపే వినియోగదారుని ఇంటికి డీఎల్స్, ఆర్సీలు చేరేలా చర్యలు చేపట్టినట్టు రవాణాశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఈ మేరకు లైసెన్సులు, ఆర్సీ కార్డుల ప్రింటింగ్‌లో ఎలాంటి జాప్యం లేకుండా ఏ రోజుకారోజు స్మార్ట్‌కార్డులు ముద్రించడం దగ్గరి నుంచి బట్వాడా వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని చెప్పారు. జిల్లాల వారిగా ప్రింటింగ్ స్టేటస్‌ను సమీక్షించడమేకాక.. పెండింగ్ ఉన్న జిల్లా అధికారితో అప్పటికప్పుడు మాట్లాడి చర్యలు తీసుకుంటున్నారు. మొత్తానికి వినియోగదారులు మళ్లీ ఆర్టీఏ ఆఫీస్‌లకు రాకుండా సకాలంలో స్మార్ట్‌కార్డులు ఇండ్లకు చేరేలా ప్రయత్నాలు చేస్తున్నారు.

రాష్ట్రంలో రవాణాశాఖకు మొత్తం 54 కార్యాలయాలుండగా.. గ్రేటర్‌లోని మూడు జిల్లాల పరిధిలో 11 కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల్లో నిత్యం అయిదారు వేలకుపైగా లావాదేవీలు జరుగుతుంటాయి. కొత్త వాహనాలు రిజిస్ట్రేషన్ల దగ్గరి నుంచి లెర్నింగ్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, పేరు బదాలయింపు, డూప్లికేట్ ఆర్సీ, ఫిట్‌నెస్ సరిఫికెట్లతో సహా వివిధ రకాల సేవల కోసం వేల సంఖ్యలో వాహనదారులు వస్తుంటారు. ఇలా ఈ సేవల నిమిత్తం వచ్చే వాహనదారులకు రవాణాశాఖ డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీలను స్మార్ట్‌కార్డు రూపంలో ముద్రించి అందిస్తోంది. ఇలా ప్రతినెలా సుమారు లక్షకుపైగా కార్డులను పంపిణీ చేస్తోంది. ఇందుకోసం వినియోగించే స్టేషనరీని ప్రయివేటు సంస్థల నుంచి దిగుమతి చేసుకుంటుంది. అలాగే డీఎల్స్, ఆర్సీలను స్మార్ట్‌కార్డులుగా మార్చాక వాటిని దరఖాస్తుదారులకు నేరుగా ఇవ్వకుండా వారి చిరునామాకు తపాలా శాఖ ద్వారా పంపుతారు. ఇందుకు తపాలాశాఖ అధికారులతో ఒప్పందం చేసుకుంది. దాంతో దరఖాస్తు చేసుకున్నవారి స్మార్ట్‌కార్డులు తయారుకాగానే.. తపాలా శాఖ పది నుంచి 15రోజుల్లో చిరునామాకు పంపాలి. కానీ కొన్నేండ్లుగా సకాలంలో వాహనదారులకు కార్డులు అందడం లేదు. ప్రధానంగా నిధులు చెల్లించకపోవడం, మరోవైపు ప్రింటర్ల మొరాయింపులతో నెలల తరబడి కార్డులు ప్రింట్ కాక.. వినియోగదారులు తీవ్ర అవస్థలు పడేవారు. అత్యవసరంగా కావాల్సిన వారు రవాణాశాఖ అధికారులను స్వయంగా కలిసి కార్డులను తీసుకెళ్తుంటారు. గతంలో పోస్టల్ శాఖకు చెల్లించాల్సిన బిల్లులు పెండింగ్ ఉండటంతో కార్డుల బట్వాడా నిలిపివేశారు. తాజాగా పోస్టల్ శాఖ తిరిగి కార్డుల బట్వాడా చేస్తున్నారు. కాగా, సీఎంవో కార్యాలయ అధికారి ఒకరు తన వాహన రిజిస్ట్రేషన్ చేసుకున్నారని.. వారం గడిచినా స్మార్ట్‌కార్డు ఇంటికి చేరకపోవడంతో ఈ విషయం ప్రభుత్వం దృష్టికిపోవడంతో సీరియస్ అయ్యింది. ఆ వెంటనే ఆర్టీఏ అధికారులు నివారణ చర్యలు చేపట్టారు. వెంటనే కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లో కార్డుల ముద్రణ ఆగిపోవద్దని.. ఏ రోజుకారోజు కార్డులు ప్రింటింగ్ జరగాలని, జీరో పెండింగ్ ఉండాలని హుకుం జారీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్టీఏ సిబ్బంది రోజుకు వేలల్లో కార్డులు ముదద్రణ చేస్తున్నారు.

4 నెలల్లో 6.39 లక్షల కార్డులు బట్వాడా..

రవాణాశాఖ గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా రూ. 6.58లక్షల లావాదేవీలు జరగ్గా.. అందులో 6.53లక్షల లైసెన్సులు, ఆర్సీలను స్మార్ట్ కార్డు రూపంలో ముద్రించి.. 6.39లక్షల కార్డులను బట్వాడా చేశారు. మరో 14వేల కార్డులు మాత్రం డిస్పాచ్ చేయాల్సి ఉంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా గ్రేటర్‌తో పాటు రాష్ట్రంలో స్మార్ట్ కార్డుల ముద్రణ ప్రక్రియ చాలా వేగవంతంగా జరుగుతోంది. అంతేగాక లావాదేవీలు జరిగిన రోజు నుంచే స్మార్ట్ కార్డుల డిస్పాచ్‌కు ఆర్టీఏ సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడి నుంచి మరో నాలుగైదు రోజుల్లో పోస్టల్ శాఖ ద్వారా వినియోగదారుల చిరునామాకు చేరవేస్తున్నారు. ప్రస్తుతం అన్ని ఆర్టీఏ ఆఫీసుల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది.

అయితే ఆర్టీఏ ఉన్నతాధికారులు జీరో కార్డు పెండింగ్ కోసమని రోజుకు వందల్లో చేయాల్సిన ప్రింటింగ్ కాస్త వేలల్లో జరుగుతున్నది. ఫలితంగా పలు ఆర్టీఏ కార్యాలయాల్లో యంత్రాలు మొరాయిస్తు న్నాయని తెలుస్తోంది. అయితే ప్రింటర్లు పాడైన వెంటనే వాటి రిపేర్ చేయించే విధంగా చర్యలు తీసుకుంటే ఏ ఇబ్బంది ఉండదని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు.

నేటి నుంచి హైదరాబాద్‌లో డీవైఎఫ్ఐ జాతీయ సమావేశాలు

- ఎస్వీకేలో 28 వరకు నిర్వహణ
- కోట రమేష్, అనగంటి వెంకటేశ్ వెల్లడి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జాతీయ సమావేశాలు బుధవారం నుంచి మూడురోజులపాటు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్వీకే)లో జరగనున్నాయి. మంగళవారం డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి యువజన సంఘం నాయకులు హాజరవుతారని తెలిపారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామంటూ హామీ ఇచ్చిందని తెలిపారు. కానీ ఉన్న ఉద్యోగాలనే తొలగిస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా ప్రయివేటు వ్యక్తులకు కట్టబెడుతున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు యువతను నిర్వీర్యం చేసేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం దేశ యువతలో మతోన్మాద విషబీజాలు నాటుతున్నదని తెలిపారు. పాఠ్యాంశాల నుంచి జాతీయ నాయకుల జీవిత చరిత్రను, డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని తొలగించటం ద్వారా విద్యార్థులను శాస్త్రీయ భావాలకు దూరం చేస్తున్నదని పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో ప్రభుత్వం కాలయాపన చేయకుండా సిట్టింగ్ జడ్జి చేత సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణీత గడువులోపు వేసిన నోటిఫికేషన్లన్నింటికీ ఉద్యోగాలు భర్తీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ బషీర్, తిరుపతి, శివవర్మ, మల్లం మహేష్, సహాయ కార్యదర్శులు జావేద్, పెద్ది సూరి, క్రిష్ణ నాయక్, కిరణ్, యంగ్ ఉమెన్స్ కన్వీనర్ రోషిని ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆర్టిజన్లపై నిర్బంధ చర్యలను ఆపాలి

- రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ న్యాయమైన డిమాండ్లను తీర్చాలని కోరుతున్న ఆర్టిజన్లను రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజులు అరెస్టు చేయించడం దారుణమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ఖండించారు. వారిపై నిర్బంధ చర్యలను ఆపాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు రోజులుగా ఆర్టిజన్లను పోలీసులు కస్టడీలోకి తీసుకోవడం, డ్యూటీలకు వెళ్ళే వారినీ, అర్ధరాత్రి ఇంటికెళ్ళి నాయకులను అరెస్టు చేయడం దారుణమని పేర్కొన్నారు. డ్యూటీలో లేని వారిని కూడా సర్వీస్ నుంచి తొలగించాలని చట్ట విరుద్ధంగా యాజమాన్యం ఆదేశాలివ్వడం అన్యాయమని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో నిర్బంధించిన విద్యుత్ అర్టిజెన్లను వెంటనే విడుదల చేయాలనీ, వారి న్యాయమైన కోర్కెల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం, ట్రాన్స్‌కో, డిస్కమ్ యాజమాన్యాలు కృషి చేయాలని కోరారు.


సంపాదకీయం

సైన్స్‌పై దాడి

"ఊరందరిదీ ఓ దారైతే... ఉలిపి కట్టెది మరోదారి..." అన్నట్టు ప్రపంచమంతటిదీ ఒక దారైతే బీజేపీ నేతలది మరోదారి. శాస్త్ర సాంకేతికాభివృద్ధితో ప్రపంచమంతా పురోగమనానికి బాటలు వేసుకుంటుంటే... మన పాలకులు మాత్రం ఏ రుజువులూ లేని పురాణాలూ, విశ్వాసాల ఆధారంగా దేశాన్ని తిరోగమన బాట

శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవడానికి ఉపయుక్తమైన జీవ పరిణామ క్రమాన్ని పాఠ్యాంశంగా తొలగిస్తే భావి మస్తిష్కాలకు జీవుల పుట్టుక, ఆవిర్భావం గురించి ఏం చెబుతారు? నిస్సందేహంగా తిరిగి మతాన్ని, దైవత్వాన్ని ముడి పెడతారు. నేటి సాంకేతిక యుగంలో ఈ వాదనలను పౌరసమాజం ఖండించాలి. శాస్త్ర ప్రగతిని భావి తరాలకు అందించాలి. నూతన దృక్కోణ సమాజాన్ని ఆవిష్కరించాలి.

పట్టిస్తున్నారు. ఒక మాతృక నుండి సకల జీవరాశులు క్రమానుగతంగా పరిణామం చెందుతూ ఏర్పడ్డాయన్న సత్యాన్ని తెలిపే డార్విన్ సిద్ధాంతం వైజ్ఞానిక ప్రపంచంలోనే ఓ అద్భుత ఆవిష్కరణ. అటువంటి శాస్త్రీయ సిద్ధాంతాన్ని పదో తరగతి పాఠ్యప్రణాళిక నుంచి కేంద్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్‌టీ) చెరిపేస్తోంది. 'విశ్వవ్యాప్తంగా విస్తృత ఆమోదం పొందిన డార్విన్ మేధోశ్రమ ఏ ప్రాతిపదికన దేశీయ చదువులకు నిరర్థకమని ఎన్‌సీఈఆర్‌టీ నిర్ధారించింది?' అని టీఐఎఫ్ఆర్, ఐఐఎస్ఈఆర్, ఐఐటీలకు చెందిన 1800మందికి పైగా శాస్త్రవేత్తలు, అధ్యాపకులు ప్రశ్నిస్తున్నారు. రుజువుకు నిలబడేది సైన్స్. అందుకే ఆనాడు మతవాదుల తిరస్కరణకు గురైన కోపర్నికస్ ప్రతిపాదించిన సూర్యకేంద్ర సిద్ధాంతం కావచ్చు, గెలీలియో కనిపెట్టిన టెలిస్కోపు కావచ్చు... రుజువుకు నిలబడి ప్రపంచానికే వెలుగులు నింపుతున్నాయి. శాస్త్రీయ దృక్పథం లోపించిన గర్హనీయమైన ఏకపక్ష నిర్ణయాలతో కేంద్ర పాలకులు పాఠ్య పుస్తకాల్లో ఇష్టారీతిన మార్పులు చేస్తూ భావి భారతాన్ని అజ్ఞానాంధకారంలోకి నెడుతున్నారు!



పాఠశాల విద్యలో గుణాత్మక మార్పుకు దోహదపడటమే ప్రధాన లక్ష్యంగా... కులమతాలకు అతీతంగా మానవతా విలువలకు పట్టంకట్టే 'వాల్యూ ఎడ్యుకేషన్'ను సృష్టించింది ఎన్‌సీఈఆర్‌టీ. కానీ, నేడు అదే ఎన్‌సీఈఆర్‌టీ చరిత్ర, రాజనీతి, సామాజిక శాస్త్రాల పాఠ్యపుస్తకాల్లో తలపెడుతున్న అహేతుక మార్పులు విద్యావేత్తలను, మేధావులను నిర్ఘాంతపరుస్తున్నాయి. ఈ అనుచిత మార్పులు నాణ్యమైన విద్యా పునాదుల్లేని నవతరాన్ని తయారుచేస్తాయనడంలో సందేహంలేదు. అసత్యాలు, అర్ధసత్యాల్నే పాఠాలుగా నిర్ణయిస్తే సమకాలీన ప్రపంచంతో మన పిల్లలు ఎలా పోటీ పడగలరు? దేశ భవితకు చుక్కానులుగా ఎలా ఎదుగుతారు? అన్నవి ఎప్పటికీ జవాబు లేని ప్రశ్నలుగా మిగిలిపోకూడదు.

ఆనాటి మతగ్రంథాలు, సాంప్రదాయవాదులు ఎంతగా వ్యతిరేకించినా, డార్విన్ సిద్ధాంతం జీవులను అవగాహన చేసుకోవడంలో గొప్ప విప్లవాత్మక మార్పుకు నాంది పలికింది. అదే విధంగా ఆధునిక జీవశాస్త్రంలో డార్వినిజం జీవుల పుట్టుక, పరిణామంపై ప్రజల్లో ఉన్న మూఢనమ్మకాలను నిలువరించడంలో కీలక పాత్ర పోషిస్తూ శాస్త్రీయ ఆలోచనలకు పునాది వేసింది. కానీ, పాలకవర్గం పలు వేదికల ద్వారా భారత శాస్త్ర విజ్ఞానంతో పాటు ప్రపంచ శాస్త్ర విజ్ఞానానికే వక్రభాష్యం పలుకుతోంది. గతంలో జరిగిన జలంధర్ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రముఖ విశ్వవిద్యాలయ వీసీ నాగేశ్వరరావు డార్విన్ సిద్ధాంతానికి మతానికి ముడిపెట్టారు. ఐదేండ్ల క్రితం అప్పటి కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రి సత్యపాల్‌సింగ్ డార్విన్ సిద్ధాంతం తప్పని, దీనిని సైన్స్ పాఠ్య పుస్తకాల నుంచి తొలగించాలన్నారు. ఇలాంటి అసత్య, సూడో సైన్స్ వాదనలతో శాస్త్రీయతను అపహాస్యం చేస్తుంటే మన దేశ ప్రగతి ఎటు పోతుందో అనే ఆందోళన వ్యక్తమవుతున్నది.

అనేక పరిశీలనల్లో రుజువైన ఈ సిద్ధాంతంపై ప్రపంచంలో మతం,మతవాదులు దాడిచేస్తూనేవున్నారు. అమెరికా లాంటి దేశాలలో కూడా పరిణామం కాదు, దైవసృష్టి అని నమ్మేవారున్నారు. కాని ఆయా దేశాలలో పాలకులు మాత్రం సైన్స్‌కే పట్టం కడుతున్నారు. ఆధునిక ప్రపంచం సాధించిన శాస్త్రీయ విజ్ఞానాన్ని కాదని, మానవాళి ఆవిర్భావాన్ని పురాణాల్లో వెతికితే ఏం తెలుస్తుంది..? తద్వారా ఏ ప్రయోజనం సాధించాలనీ..!? ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని వారిని శాస్త్రీయ విజ్ఞానానికి, శాస్త్రీయ భావాలకు దూరంగా ఉంచాలనుకుంటున్నారా..? తిరిగి మధ్య యుగాల్లోకి నడిపించాలనుకుంటున్నారా..? అని యావత్ శాస్త్ర ప్రపంచం ఈ చర్యలను ముక్తకంఠంతో ఖండిస్తోంది. ఇది శాస్త్రీయ సమాజానికే అవమానమని నిరసిస్తోంది. ఒక వైపు కేంద్ర పాలకులు ఆధునిక సమాజ నిర్మాణం, సైన్సు, టెక్నాలజీ అని ఊదరగొడుతూనే ఇలా సైన్సుపై దాడి చేస్తుడటం దేనికి దారితీస్తుంది..? ఆధునిక సమాజానికా? ఆటవిక సమాజానికా?

శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవడానికి ఉపయుక్తమైన జీవ పరిణామ క్రమాన్ని పాఠ్యాంశంగా తొలగిస్తే భావి మస్తిష్కాలకు జీవుల పుట్టుక, ఆవిర్భావం గురించి ఏం చెబుతారు? నిస్సందేహంగా తిరిగి మతాన్ని, దైవత్వాన్ని ముడి పెడతారు. నేటి సాంకేతిక యుగంలో ఈ వాదనలను పౌరసమాజం ఖండించాలి. శాస్త్ర ప్రగతిని భావి తరాలకు అందించాలి. నూతన దృక్కోణ సమాజాన్ని ఆవిష్కరించాలి.

ఆందోళనకరంగా ప్రపంచ మిలిటరీ ఖర్చు!

సోమవారంనాడు స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ(సిప్రి) విడుదల చేసిన వార్షిక నివేదికలో ప్రపంచంలో మిలిటరీ ఖర్చు కొత్త రికార్డు నెలకొల్పినట్లు పేర్కొన్నది. ఈ నేపథ్యంలో చూసినప్పుడు చైనా లేదా మరొక ఏ దేశమైనా యావత్ మానవాళికే ముప్పు తెచ్చే ఆయుధాలతో అమెరికా, దాని మిత్ర దేశాలు భూమి, ఆకాశాలను నింపుతున్నప్పుడు ఎవరైనా వాటిని ఎదుర్కొనేందుకు పూనుకోకతప్పదు. స్టార్‌వార్స్ పేరుతో గగనతలంలో అమెరికా రూపొందిస్తున్న అస్త్ర, శస్త్రాల గురించి దశాబ్దాల తరబడి జరుపుతున్న ప్రచారం అదెలా ఉంటుందో చూపుతున్న సినిమాలు, వాస్తవాల గురించి అందరికీ తెలిసిందే. అందువలన దానికి పోటీగా ఏ దేశం ఏం చేస్తున్నదనే వివరాలు జనానికి తెలియకపోవచ్చుగానీ ఏదో ఒకటి చేస్తారని వేరే చెప్పనవసరం లేదు. ఒకరు బాంబులు విసురుతుంటే రెండోవారు గులాబీలతో స్పందించేంత ఉత్తములు ఈ రోజుల్లో ఎవరూ ఉండరు. అలా ఉండాలన్నా ఉండనివ్వరు. శత్రుదేశాల ఉపగ్రహాల మీద దాడి చేసేందుకు అవసరమైన ఆయుధాలను చైనా రూపొందిస్తున్నట్లు తమ ప్రభుత్వానికి సీఐఏ నివేదించినట్లు ఇటీవల బహిర్గతమైన అమెరికా గూఢచార, ఇతర కీలక పత్రాల్లో ఉంది. చైనా ఆయుధాల గురించి సీఐఏ పత్రాలను ఉటంకిస్తూ ఫైనాన్సియల్ టైమ్స్ పత్రిక జరిపిన సమీక్షలో పేర్కొన్నారు. చైనా కొత్త ఆయుధాలను రూపొందించటం ఇదే కొత్త కాదంటూ కొందరు విశ్లేషకులు గుండెలుబాదుకుంటున్నారు. వారికి అమెరికా, ఇతర దేశాలు ఏం చేస్తున్నదీ కనపడవా? చూడదలచుకోలేదా?


ఎం. కోటేశ్వరరావు

కంటికి కనిపించని సైబర్‌దాడులు అంటే కంప్యూటర్లతో పని చేసే మిలిటరీ, పౌర వ్యవస్థలను నాశనం లేదా పని చేయకుండా చేయటం. అమెరికా తరచూ చేసే ఆరోపణ ఏమంటే తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని చైనా తమ నుంచి అపహరించిందన్నది. సైబర్‌దాడులకు సంబంధించిన పరిజ్ఞానాన్ని కూడా తమ జాతీయ భద్రతా సంస్థ(ఎన్ఎస్ఏ) నుంచి తస్కరించినట్లు కథనాలు రాయిస్తున్నది. చైనా 2016లోనే ఎన్ఎస్ఏ, అమెరికా మిత్రదేశాలకు చెందిన ఐరోపా కంపెనీల నుంచి గుప్త సంకేతాలను తీసుకొని వాటితో అదే కంపెనీల మీదే దాడులు జరుపుతోందన్నది సారం. గత సంవత్సరం అమెరికా కనీసం ఆరు దేశాల ప్రభుత్వ సంస్థలపై దాడులు చేసినట్లు ఇండో-పసిఫిక్ వ్యూహాత్మక సమాచార వ్యవస్థ ఆరోపించింది. అంతరిక్షం, సైబర్ రంగాలలో అమెరికా ముందున్నందున మిగిలిన దేశాలతో పాటు చైనా కూడా తన సామర్థ్యాన్ని మెరుగుపరచుకుంటున్నది. సైబర్ నిఘాలో అమెరికా ప్రపంచ ఛాంపియన్ అని చైనా వర్ణిస్తున్నది. చైనా రూపొందిస్తున్న సైబర్ ఆయుధాలతో గూఢచర్యం, సమాచారాన్ని పంపే అమెరికా ఉపగ్రహాల వ్యవస్థలను పనిచేయకుండా చేయవచ్చని, ఉపగ్రహాలను కూడా అదుపులోకి తెచ్చుకోవచ్చని సీఐఏ తన నివేదికలలో పేర్కొన్నది. అమెరికాకు చెందిన స్టార్‌లింక్ ఉపగ్రహ సమాచార వ్యవస్థ ద్వారా రష్యా సేనల గురించి ఎప్పటికప్పుడు ఉక్రెయిన్‌కు అందచేస్తున్న సంగతి తెలిసిందే. దీని మాతృసంస్థ ఎలాన్ మస్క్ అధిపతిగా ఉన్న స్పేస్ ఎక్స్ కంపెనీ ఇప్పటి వరకు 3,580 చిన్న ఉపగ్రహాలను పంపి 53దేశాలకు సమాచారాన్ని అందచేస్తున్నది, వాటిని పన్నెండువేలకు పెంచాలని కూడా చూస్తున్నది. అంతరిక్షంలో అమెరికా ఆధిపత్యానికి ఇదొక నిదర్శనం.

మన దేశంలో ఉన్న కొంత మంది చైనాను బూచిగా చూపి మిలిటరీ బడ్జెట్‌ను గణనీయంగా పెంచాలని చెప్పటం వెనుక అమెరికా మిలిటరీ కార్పొరేట్ లాబీ ఉందన్నది స్పష్టం. మన జీడీపీతో పోలిస్తే చైనా ఐదురెట్లు ఎక్కువ. అందువలన దానితో మిలిటరీ ఖర్చులో మనం పోటీ పడాలంటే వనరులన్నింటినీ దానికే మళ్లించాల్సి ఉంటుంది. అది జరిగితే ఆర్థికవృద్ధి కుంటుపడుతుంది. అమెరికా ఆయుధ కంపెనీలకు లాభసాటి గనుక అది మిలిటరీ ఖర్చు ఎంతైనా పెడుతుంది. దాని జీడీపీ కూడా ఎక్కువే. తనకు లాభం కనుక ఇతర దేశాలనూ ఉసిగొల్పుతుంది. తనను చక్రబంధం చేస్తున్న అమెరికాను అడ్డుకొనేందుకు చైనా కూడా మిలిటరీ ఖర్చు పెడుతున్నా అది తక్కువే.

ప్రపంచంలో రోజు రోజుకూ మిలిటరీ ఖర్చు పెరుగుతున్నది. ప్రపంచం ఏమైనా సరే ఈ ఖర్చు ఎంత పెరిగితే అమెరికా కార్పొరేట్లకు అంతగా లాభాలు. మిలిటరీ ఖర్చు 2021తో పోల్చితే 2022లో 3.7శాతం పెరిగింది. ప్రపంచ జీడీపీ వృద్ధి 2.9శాతం, అంతకంటే తక్కువే అని అంచనా వేస్తున్నారు. డాలర్లలో చెప్పుకుంటే 2022 ఖర్చు 2,240బిలియన్ డాలర్లు. ఇది ప్రపంచ జీడీపీలో 2.2శాతం. ఐరోపాలో గత మూడు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా విపరీతంగా పెరిగింది. ప్రపంచం మొత్తం చేస్తున్న ఖర్చులో మొదటి ఐదు స్థానాల్లో ఉన్న దేశాల వాటా 63శాతం. దేశాల వారీ అమెరికా 39, చైనా 13, రష్యా 3.9, భారత్ 3.6, సౌదీ 3.3శాతం చొప్పున కలిగి ఉన్నాయి. ఉక్రెయిన్‌కు అమెరికా అందచేసిన దాదాపు 20బి.డాలర్లను కూడా కలుపుకుంటే దాని వాటా 40శాతం. ఐరోపాలో అధికంగా ఖర్చు చేస్తున్న బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ ఎనిమిది శాతం, అమెరికా నీడలో ఉండే జపాన్, దక్షిణ కొరియా 2.1శాతం చొప్పున ఖర్చు చేస్తున్నాయి. మొత్తం మీద ప్రపంచ ధోరణులను గమనిస్తే ఉక్రెయిన్ మీద రష్యా సైనిక చర్య, తూర్పు ఆసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు దీనికి మూలంగా కనిపిస్తున్నాయి, వాటికి అమెరికా, దానితో చేతులు కలుపుతున్న పశ్చిమ దేశాలే కారణం అన్నది బహిరంగ రహస్యం. సోవియట్ ఉనికిలో లేదు, దానిలో ఉన్న అనేక దేశాలు ఇప్పుడు అమెరికా చంకనెక్కాయి. అయినప్పటికీ ప్రచ్ఛన్న యుద్ధం నాటి స్థాయిని దాటి మధ్యపశ్చిమ ఐరోపా దేశాల మిలిటరీ ఖర్చు ఇప్పుడు పెరిగింది. ఉక్రెయిన్ సంక్షోభంతో నిమిత్తంలేని ఫిన్లండ్ 36, లిథువేనియా 27, స్వీడెన్ 12, పోలాండ్ 11శాతం చొప్పున ఖర్చు పెంచాయి. అనేక తూర్పు ఐరోపా దేశాలు 2014తో పోల్చితే రెట్టింపు చేశాయి.

ఇక రష్యా ఖర్చు దాని జీడీపీలో ఒక ఏడాది కాలంలో 3.7 నుంచి 4.1శాతానికి పెరిగింది. ఇదే కాలంలో ఉక్రెయిన్ ఖర్చు 640శాతం పెరిగి జీడీపీలో 3.2 నుంచి 34శాతానికి చేరింది. అమెరికాలో ఇటీవలి కాలంలో ఎన్నడూ లేని రీతిలో ద్రవ్యోల్బణం పెరిగి ఇబ్బందులు తలెత్తినా మిలిటరీ ఖర్చు పెంచుతూనే ఉంది. ఉక్రెయిన్‌తో సహా ప్రపంచంలో ఏ దేశానికి మిలిటరీ సాయం చేసినా అది అమెరికా ఆయుధ పరిశ్రమల లాభాలు పెంచేందుకే అన్నది తెలిసిందే. అమెరికాకు యుద్ధం వచ్చిందంటే చాలు పండుగే. రెండవ ప్రపంచ యుద్ధంలో డ్యూపాంట్ కంపెనీ లాభాలు 950శాతం పెరిగాయి. ప్రతి పోరూ అలాంటిదే. ఈ ఏడాది ప్రారంభంలో అమెరికా విదేశాంగశాఖ విడుదల చేసిన సమాచారం ప్రకారం నాటో ద్వారా ఆయుధాల అమ్మకం 2021తో పోల్చితే 2022లో 35.8 నుంచి 51.9 బి.డాలర్లకు పెరిగాయి. అదే

నేరుగా ఈ కాలంలోనే 103.4 నుంచి 153.7 బిడాలర్లకు పెరిగాయి. దక్షిణ చైనా సముద్రం గురించి అమెరికా లేవనెత్తుతున్న వివాదం, తైవాన్‌పై రెచ్చగొడుతున్న కారణంగా ఈ ప్రాంతంలోని అనేక దేశాలు ఆయుధాల కొనుగోలుకు పూనుకున్నాయి. పేట్రియాట్ క్షిపణులను రూపొందించే రేతియాన్, ఎఫ్-16, 22, 35 రకం యుద్ధం విమానాలను తయారు చేసే లాక్‌హీడ్ మార్టిన్, నార్త్‌రాప్ గ్రుయిమాన్ కంపెనీల లాభాలు గణనీయంగా పెరిగాయి. ఈ కారణంగానే ఉక్రెయిన్ వివాదంలో సంప్రదింపులు జరగకుండా అడ్డుపడుతున్నది, పదే పదే తైవాన్ మీద చైనాను రెచ్చగొడుతున్నది. మరోవైపున ఆఫ్రికాలో కొత్త చిచ్చు రేపేందుకు, ఉన్నవాటిని కొనసాగించేందుకు చూస్తున్నది.

అమెరికా, అది ఎగదోస్తున్న దేశాలు ఇటీవలి కాలంలో



మిలిటరీ ఖర్చు పెంచటం, కొత్త కూటములను కడుతుండటంతో చైనా కూడా తన ఖర్చును పెంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కారణంగానే గత మూడు దశాబ్దాలుగా దాని ఖర్చు పెరుగుతూనే ఉన్నప్పటికీ అమెరికా 877 బి.డాలర్లతో పోలిస్తే దాని ఖర్చు 292 బి.డాలర్లు తక్కువే. ఆత్మరక్షణ సిబ్బంది తప్ప మిలిటరీ ఖర్చు లేదని చెప్పుకొనే జపాన్ ఖర్చు 46బి.డాలర్లకు చేరింది. దక్షిణ కొరియా 46.4బి.డాలర్లకు పెంచింది. ఈ రెండు దేశాలూ అమెరికా రక్షణలో ఉన్నాయి. మన దేశం 2021తో పోలిస్తే మరుసటి ఏడాది ఖర్చు(81.4బి.డాలర్లు) ఆరుశాతం పెంచినట్లు సిప్రి పేర్కొన్నది. నైజీరియా 2021లో 56శాతం ఖర్చు పెంచగా గతేడాది 38శాతం తగ్గించింది. నాటో మిలిటరీ ఖర్చు 1,232 బి.డాలర్లకు పెరిగింది. ఐరోపాలో 68.5బి.డాలర్లతో బ్రిటన్ మొదటి స్థానంలో ఉంది. తుర్కియె(టర్కీ) వరుసగా మూడవ ఏడాది మిలిటరీ ఖర్చును తగ్గించింది. ఐరోపా మొత్తంగా 13శాతం పెరిగింది.

స్టాక్‌హోం సంస్థ పరిగణనలోకి తీసుకున్న అంశాల ప్రకారం ప్రపంచంలో 40దేశాలు గణనీయంగా ఖర్చు చేస్తున్నాయి. వాటిలో మన దేశం 4వ స్థానంలో ఉండగా మన పొరుగునే ఉన్న పాకిస్థాన్ 10.3 బి.డాలర్లతో 24వదిగా ఉంది. చైనా తిరుగుబాటు ప్రాంతమైన తైవాన్ 12.5 బి.డాలర్లతో 21వ స్థానంలో ఉంది. నలభై దేశాలలో చివరిదిగా 5.2బి.డాలర్లతో రుమేనియా ఉంది. 2021తో పోలిస్తే అనేక దేశాల రాంకుల్లో మార్పు వచ్చింది. సిప్రి వివరాలను అందచేసిన 36 ఐరోపా దేశాల్లో 23 ఖర్చును పెంచటం ఉక్రెయిన్ సంక్షోభ ప్రభావాన్ని వెల్లడిస్తున్నది. వీటి ఖర్చు 0.4శాతం స్విట్జర్లాండ్ నుంచి లక్సెంబర్గ్ 45శాతం గరిష్టంగా ఉంది. పదమూడు దేశాల ఖర్చు 0.4శాతం నుంచి 11శాతం వరకు తగ్గింది. వరల్డ్ మీటర్ విశ్లేషణ ప్రకారం ఆఫ్ఘనిస్తాన్ తన జీడీపీలో 61శాతం ఖర్చు చేస్తున్నది. తలసరి మిలిటరీ ఖర్చును డాలర్లలో చూస్తే అమెరికా 2,240, చైనా 163, శ్రీలంక 116, పాకిస్థాన్ 50, మయన్మార్ 48, భారత్ 43, బంగ్లాదేశ్ 27, నేపాల్ 7 చొప్పున ఖర్చు చేస్తున్నది.

ఏ దేశమైనా మిలిటరీ ఖర్చును పెంచితే అది జనాల మీద భారం, జీవితాలు మెరుగుపడే అవకాశం లేదన్నది అనేక దేశాల అనుభవం చెబుతున్నది. ఉగ్రవాదం కారణంగా పక్కనే ఉన్న శ్రీలంక తన వనులన్నింటినీ ఉగ్రవాదాన్ని అణచి వేసేందుకుగాను మిలిటరీని విపరీతంగా పెంచింది. ఉగ్రవాదులను నిర్మూలించినా దాని మిలిటరీ ఖర్చు వెంటనే తగ్గదని పైన పేర్కొన్న తలసరి ఖర్చు వెల్లడిస్తున్నది. అలాగే మన దేశంతో గిల్లికజ్జాలు పెట్టుకొనే పాకిస్తాన్ తలసరి ఖర్చు మనకంటే ఎక్కువే. అది ఇప్పుడు ఆర్థికంగా ఎంత దివాళా తీసిందో, ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో చూస్తున్నదే. మన దేశంలో ఉన్న కొంత మంది చైనాను బూచిగా చూపి మిలిటరీ బడ్జెట్‌ను గణనీయంగా పెంచాలని చెప్పటం వెనుక అమెరికా మిలిటరీ కార్పొరేట్ లాబీ ఉందన్నది స్పష్టం. మన జీడీపీతో పోలిస్తే చైనా ఐదురెట్లు ఎక్కువ. అందువలన దానితో మిలిటరీ ఖర్చులో మనం పోటీ పడాలంటే వనరులన్నింటినీ దానికే మళ్లించాల్సి ఉంటుంది. అది జరిగితే ఆర్థికవృద్ధి కుంటుపడుతుంది. అమెరికా ఆయుధ కంపెనీలకు లాభసాటి గనుక అది మిలిటరీ ఖర్చు ఎంతైనా పెడుతుంది. దాని జీడీపీ కూడా ఎక్కువే. తనకు లాభం కనుక ఇతర దేశాలనూ ఉసిగొల్పుతుంది. తనను చక్రబంధం చేస్తున్న అమెరికాను అడ్డుకొనేందుకు చైనా కూడా మిలిటరీ ఖర్చు పెడుతున్నా అది తక్కువే. తనకోసం అది అయుధాలను రూపొందిస్తున్నది కనుక కొన్నింటిని ఎగుమతి కూడా చేస్తున్నది. 2021లో ప్రపంచ మిలిటరీ సేవలు, అయుధాల వంద పెద్ద కంపెనీల మార్కెట్ 592 బి.డాలర్లని అంచనా. వాటి ఎగుమతిలో 2018 నుంచి 2022 వరకు పది అగ్రశ్రేణి దేశాల వారీ వాటా అమెరికా 40, రష్యా 16, ఫ్రాన్స్ 11, చైనా 5.2, జర్మనీ 4.2, ఇటలీ 3.8, బ్రిటన్ 3.2,స్పెయిన్ 2.6, దక్షిణ కొరియా 2.4, ఇజ్రాయెల్ 2.3శాతం వాటాలను కలిగి ఉన్నాయి. మన దేశంలో కూడా కొన్ని బడా కంపెనీలు లాభసాటిగా ఉండే ఆయుధ తయారీకి ఉబలాటపడు తున్నాయి. మిగిలిన అంశాలన్నీ సరిగా ఉంటే అలాంటి పని చేసినా అదొక తీరు లేనప్పుడు మన పెట్టుబడులను వాటి మీదే కేంద్రీకరిస్తే జనం సంగతేంగాను. అందుకే ఎదుటి వారు తొడకోసుకుంటే మనం మెడకోసుకుంటామా అని పెద్దలు ఏనాడో చెప్పారు. దాన్ని మన పాలకులు పాటిస్తారా?

సెల్: 8331013288



విశ్వాసం పేరుతో విచ్ఛిన్నం!


వేములవాడ రాజన్న, యాదాద్రి లక్ష్మీనర్సింహ, తిరుపతి వెంకన్న, కొండగట్టు ఆంజనేయ, ఆలంపూర్ జోగులాంబ, వరంగల్ భద్రకాళి... పేర్లు, ప్రమాణాలు ఏవైతేనేం...ప్రజల్ని ఎటు తీసుకెళ్తున్నారు ఈ క్షుద్ర రాజకీయ సన్యాసులు. ఉన్నాడో... లేడో విశ్వాసం మీద ఆధారపడిన దేవుణ్ణి తమ స్వార్థ రాజకీయాల కోసం వాడుకుంటున్నారు. మనుధర్మ సూత్రాలను అమల్లోకి తెస్తూ, దేవుడి చుట్టూ బీజేపీ రాజకీయాలు నడుపుతుంటే, సెక్యులర్ అంటూ చంకలు గుద్దుకొనే నేతలు, పార్టీలు కూడా అనుకోకుండా ఆ 'అజెండా సెట్టింగ్'లో కొట్టుకుపోతున్నారు. ప్రమాణం చేయకపోతే ప్రజలు విశ్వసించరేమో అనే అవిశ్వాస, అశక్త రాజకీయానికి ఒడిగడుతున్నారు. ఈ బూర్జువా రాజకీయ నేతల్ని ఫాలో అయ్యే ప్రజలు కూడా 'అమ్మతోడు' అంటూ అయిందానికీ, కానిదానికీ ఒట్లు పెట్టుకుంటున్నారు. ఆ ఒట్లే తమను గట్టెక్కిస్తాయని విశ్వసిస్తున్నారు. త్రేతాయుగంలోనే ఆకాశవాణి, పుష్పక విమానాలు ఉన్నాయనీ, 'బోడి మీ సైన్స్ గొప్పేంటి' అని ప్రచారం చేసే బీజేపీ రాజకీయ భక్తాయిలు కమ్యూనిస్టులు మినహా అన్ని రాజకీయపార్టీలను మతం మత్తులోకి లాగేస్తున్నారు. గతంలో ఈ ప్రమాణాల లొల్లి అప్పుడప్పుడు వినిపించేది. ఇప్పుడు 'బండి' ఎక్కాక ఈ దురదగొండి పీక్‌కు వెళ్లి అందరికీ అంటుకుంది. ఈతరం రాజకీయ నాయకుడికి కావల్సింది ప్రజలకు సేవచేసి మన్ననలు, గుర్తింపు పొందడం కాదు. ఉలుకుపలుకులేని దేవుడి ముందు తడిబట్టలతో ప్రమాణాలు చేయడం, ఆ సెంటిమెంట్‌ను తమ రాజకీయ అవసరాలకు వాడుకోవడం. ఇంతకన్నా దుర్మార్గం, రాజకీయ పలాయనవాదం ఏమన్నా ఉందా? ప్రజలకు ఆదర్శంగా ఉంటూ, సమాజాన్ని చైతన్యపర్చాల్సిన ఈ నేతలు దేవుళ్ల పేర్లను ప్రస్తావిస్తూ, మతాన్ని, రాజకీయాలను అనుసంధానం చేసుకుంటూ వ్యూహాత్మకంగా 'ఒట్టు'ను గట్టెక్కిస్తూ ప్రజల్లో విభజన సృష్టిస్తున్నదనే సోయిని ఆయా పార్టీల నేతలు కోల్పోతున్నారు. కేంద్రంలో మహామౌనజ్ఞాని మోడీ 9ఏండ్లలో సాధించిన ప్రగతిని ప్రజలకు చెప్పడం మానేసి, ఆదిశంకరుడు, తీర్థంకరుడు, రామానుజాచార్యులు వంటి విగ్రహాలను ఆవిష్కరిస్తూ, ప్రజల్లో 'ఒట్టు' పట్ల విశ్వాసాన్ని పెంచుతున్నారు. దేశం ఎటుపోతుందో..? ప్రజల్ని ఏ మార్గంలోకి తీసుకెళ్తున్నారో దిశాదశ లేకుండా దేశ రాజకీయం సాగుతుంది. ఈ ప్రమాదాన్ని గుర్తించేనేమో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజకీయాల్లోకి మతాన్ని చొప్పించడాన్ని నేరంగా పరిగణించారు. అన్ని రాజ్యాంగ వ్యవస్థల మాదిరే ఈ మతరాజకీయ నిషేధాన్ని కూడా బీజేపీ తుంగలో తొక్కి 'ప్రమాణాలు' పేరుతో అడ్డతోవలు తొక్కుతుంది. ఆ మాయలో, ఆ ఉచ్చులో, ఆ అజెండా సెట్టింగ్‌లో మనమూ కొట్టుకుపోవద్దు. కాస్త చైతన్యవంతమైన, స్ఫూర్తి దాయకమైన ఆలోచన చేద్దాం. సమాజాన్ని 'ప్రమాణాల' సంస్కృతికి దూరంగా తీసుకెళ్దాం!!

-ఎస్ఎస్ఆర్ శాస్త్రి, సెల్:9490099086

చీకట్లు వేగంగా కమ్ముకుంటున్నాయి

ప్రజాస్వామ్య మూలస్తంభాలకు బీటలు పడిపోతున్నాయి. ప్రతిరోజు రాజ్యాంగం అపహాస్యం చేయబడుతోంది. చట్టబద్ధ సంస్థలన్నీ ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేయబడుతున్నాయి. వాతావరణం ద్వేషపూరితమై భగ్గున మండుతోంది. 2014లో భారత ప్రజాస్వామ్యంపై ఫాసిస్టు కొండచరియ విరిగిపడ్డ తర్వాత, అప్పటిదాకా నామమాత్రంగానైనా నడిచిన ప్రజాస్వామ్య వ్యవస్థలన్ని ఒక్కొక్కటిగా కూలిపోతున్నాయి. సాంఘిక మాధ్యమాల ద్వారా అసత్య ప్రచారాలు విద్వేష బీజాలను నేరుగా వ్యక్తుల మనస్సులోనే నాటుతున్నాయి.

మానవ సమాజం మెరుగైన పాలనా వ్యవస్థ కోసం చరిత్ర పొడవున సాగించిన సుదీర్ఘ మేధో సంఘర్షణ ఫలితంగా ఆవిష్కరించబడిన ప్రజాస్వామ్య భావనకు, ప్రజా సమస్యలు, ప్రజా సంక్షేమమే కేంద్రం కావాలి. విద్య, వైద్యం, ఉపాధి కల్పన, వ్యవసాయం, అభివృద్ధి, వాతావరణ సంక్షోభం వంటివి దేశ రాజకీయ యవనికపై చర్చించబడవలసిన అంశాలుగా ఉండాల్సింది. అయితే హిందూత్వ శక్తులు అధికారం చేపట్టిన తరువాత మసీదులు, గుళ్ళు, ట్రిపుల్ తలాక్, గోమాంసం, హిజాబ్ చుట్టూ మన చర్చ కేంద్రీకృతమై పోతున్నది. పెరుగుతున్న ధరలు, ప్రయివేటు పరం అవుతున్న ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రయివేటు వ్యక్తుల పరం అవుతున్న వనరులు, జాతి ఉమ్మడి సంపద చర్చించబడవలసిన అంశాలు కావన్నంతగా మన దృష్టి మరల్చబడింది. వాస్తవాలకు అద్దం పట్టవలసిన ప్రజాస్వామ్యపు నాలుగో స్తంభం అధికారంతో మిలాఖతై దృష్టి మళ్లింపు రాజకీయాలకు కావాల్సినంత దోహదపడుతున్నది. గత దశాబ్ద కాలంగా సాంఘిక, ప్రసార మాధ్యమాల ద్వారా అదే పనిగా కొనసాగుతున్న విద్వేష, అసత్య ప్రచారం మన సహజ వివేకాన్ని మసకబార్చింది, మనల్ని మానవీయ స్పందనలకు దూరం చేసినట్టుంది.


టి. హరికృష్ణ
9494037288

అందుకేనేమో కేవలం ఆవు మాంసం కలిగి ఉన్నాడన్న అనుమానంతో మహమ్మద్ అఖ్లాక్‌ను, ఆవుల్ని కబేళాకు తరలిస్తున్నాడన్న అనుమానంతో పెహలు ఖాన్ అనే పాడి రైతును బహిరంగంగా కొట్టి చంపినా మన 'సామూహిక వివేచన'కు చీమకుట్టినట్టైనా కాలేదు. హత్రాస్‌లో అగ్రవర్ణాల వారి చేతిలో లైంగిక దాడికి గురైన 19ఏండ్ల దళిత అమ్మాయి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు చివరి చూపుకు కూడా అవకాశం ఇవ్వకుండా అర్ధరాత్రి రెండు గంటలకు పోలీసులే దహనం చేసినప్పుడు కూడా మనం కనీసం మనవీయ స్పందన లేకుండా పోయాం.

అంతెందుకు మొన్నటికి మొన్న గుజరాత్ అల్లర్లలో గర్భిణీ అని కూడా చూడకుండా బిల్కిస్ బానోపై లైంగికదాడి చేసిన 11మందిని 'సత్ప్రవర్తన' కలిగి ఉన్నారన్న నెపంతో విడుదల చేసినప్పుడు కూడా మన మానవత్వం మిన్నకుండి పోయింది. నిజానికి మనలోని మానవత్వం ఎందుకిలా ఆవిరి అవుతున్నది. ద్వేషం అసహనపు విషపు గాలికి మనం ఎందుకు అలవాటు పడుతున్నాం. మనిషి ప్రాణం కన్నా ఆవు ప్రాణం విలువైనదని ఎవరు చెబుతున్నారు? మనిషి కోసం మతం కాదని మతం కోసమే మనిషి అన్నంతగా వాతావరణన్ని ఎవరు వేడెక్కిస్తున్నారు? ప్రశ్నించే గొంతులకు చెరసాలలే ఎందుకు బహుమానాలు అవుతున్నాయి? ఇలా మనం దృష్టి పెట్టవలసిన అంశాలేవి సాంఘిక మాధ్యమాలలో గాని, ప్రసార మాధ్యమాలలో గాని చర్చకు రావటం లేదు. చర్చనంత మతం చుట్టూ మత విశ్వాసాల చుట్టూ నడపటానికి, కీలకమైన విషయాల నుంచి మన దృష్టి మళ్లించటానికి, మన ప్రాధామ్యాల్లో మతాన్ని, పరమత విద్వేషాన్ని ముందుంచటానికి విశ్వప్రయత్నం చేస్తున్న వికృతకాలం గుండా మన ప్రజాస్వామ్యం కష్టతర ప్రయాణం చేస్తున్నది.

రాజ్యాంగం అన్నా, రాజ్యాంగ విలువలు అన్నా వీసమెత్తు గౌరవం లేని వాళ్ళు అధికారంలో ఉన్నప్పుడు మన రాజ్యాంగం ప్రమాదంలో ఉన్నట్టే కదా! భారత రాజ్యాంగం సనాతన ధర్మానికి భారతీయ విలువలకు అనుగుణంగా లేదని సంఘ్ పెద్ద అంటాడు. రాజ్యాంగాన్ని మార్చటానికే వచ్చామని ప్రభుత్వ పెద్దలంటారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తెచ్చిన చట్టాలు చాలా వరకు రాజ్యాంగానికి వ్యతిరేకమైనవే. గత ప్రభుత్వాలు ఇలాంటి



చట్టాలు చేయనేలేదని కాదు గాని, అలాంటి చట్టాలు అనేకం కోర్టుల్లో ఓడిపోయేవి. ప్రజాస్వామ్య వాదులకు గానీ, సామాన్య ప్రజానీకానికి గానీ, అన్యాయమైన చట్టాలకు వ్యతిరేకంగా పోరాడి న్యాయం పొందటానికి కోర్టులు ఆలంబనగా ఉండేవి. కానీ 2014 తర్వాత, అది అయోధ్య తీర్పు అయితేనేమి, ట్రిపుల్ తలాక్, హిజాబ్, అగ్రకుల, వర్ణ పేదలకు 10శాతం రిజర్వేషన్ తీర్పులు అయితేనేమి, ఒకదాని వెంట ఒకటిగా వస్తున్న తీర్పులన్నీ న్యాయవ్యవస్థం నిష్పాక్షికతను సందేహాస్పదం చేస్తున్నాయి.

న్యాయవ్యవస్థ సౌధానికి నిలువెత్తు పగుళ్ల కనిపిస్తున్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో న్యాయవ్యవస్థ ఇక ఎంత మాత్రం రాజ్యాంగ మౌలిక స్వభావ పరిరక్షకురాలు కాజాలదన్న భయం కలుగుతూ ఉన్నది. ఇది భారత ప్రజాస్వామ్యానికి మాత్రమే కాదు, భారత విశాల ప్రజా సామాన్యానికి కూడా పొంచి ఉన్న పెద్ద ప్రమాదమని గ్రహించాలి. ప్రజాస్వామ్య విలువలే వమ్మయిపోతే మనకు దిక్కేది? అయితే ముంచుకొస్తున్న హిందూ అధిక సంఖ్యాక ఆధిపత్య వాదానికి సాధారణ ప్రజానీకం అధిక మూల్యం చెల్లిస్తున్నది.

హిందుత్వవాద శక్తులు అధికారంలోకి వచ్చాక, మొదటి సంవత్సరాలలో గోరక్షణ, ట్రిపుల్ తలాక్ రద్దు, సీఏఏ, ఎన్ఆర్‌సీ వంటి అంశాలతో దేశం దృష్టిని ముస్లిం మైనారిటీల పట్ల విద్వేషాన్ని నింపటానికి శత విధాల ప్రయత్నించింది. భీమా కోరేగాం అల్లర్ల పేరుతో తప్పుడు కేసులు బనాయించి దేశంలోని ప్రగతిశీల శక్తులను అక్రమంగా జైల్లో నిర్బంధించింది. దక్షిణ భారతదేశంలో సైతం విద్వేష రాజకీయాలను పెంచి పోషిస్తూ ఉన్నది. మన రాష్ట్రంలో సైతం హేతువాదులు, నాస్తికులు, అంబేద్కర్‌వాదులు ప్రగతిశీల శక్తులపై భౌతిక దాడులు జరుపుతున్నది. అయితే 2002 సంవత్సరంలో ముస్లిం మైనారిటీలపై వారు సాగించిన నరమేధానికి పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల యువతను వాడుకున్నట్టే, ఇక్కడ సైతం ఈ వర్గాల యువతనే దాడులకు ఉసిగొలుపు తున్నది. నరేంద్ర దబోల్కర్, గోవిందుపన్సారే, కలబుర్గి, గౌరీ లంకేష్ వంటి వారి హత్యల కోసం ఉపయోగించింది బడుగు బలహీన వర్గాల యువకులనే.మన రాష్ట్రంలో సైతం ప్రగతిశీల, అభివృద్ధి

న్యాయవ్యవస్థ సౌధానికి నిలువెత్తు పగుళ్లు కనిపిస్తున్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో న్యాయవ్యవస్థ ఇక ఎంత మాత్రం రాజ్యాంగ మౌలిక స్వభావ పరిరక్షకురాలు కాజాలదన్న భయం కలుగుతూ ఉన్నది. ఇది భారత ప్రజాస్వామ్యానికి మాత్రమే కాదు, భారత విశాల ప్రజా సామాన్యానికి కూడా పొంచి ఉన్న పెద్ద ప్రమాదమని గ్రహించాలి. ప్రజాస్వామ్య విలువలే వమ్మయిపోతే మనకు దిక్కేది? అయితే ముంచుకొస్తున్న హిందూ అధిక సంఖ్యాక ఆధిపత్య వాదానికి సాధారణ ప్రజానీకం అధిక మూల్యం చెల్లిస్తున్నది.

కాముక శక్తులపై దాడులకు ఉపయోగిస్తున్నది బడుగు బలహీన వర్గాల యువకులనే. 'భారత నాస్తిక సమాజం' సంస్థకు రాష్ట్ర బాధ్యుడైన బైరి నరేష్, అంబేద్కర్ వాది రేంజర్ల రాజేష్, నిర్మల్ ప్రాంతానికి చెందిన అంబేద్కర్ వాది మగ్గడి దిగంబర్, బోధన్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌లపై ఇటీవల జరిగిన దాడులన్నింటిలో వెనకబడ్డ, దళిత యువకులనే వాడుకున్నారు. ఈ దాడులన్నీ జరిగింది, అనేక రకాలైన ప్రగతిశీల ఉద్యమాలు నడిచిన మన ప్రాంతంలోనే, మన రాష్ట్రంలోనే. అనేక సంఘసంస్కరణ, నాస్తిక, హేతువాద ఉద్యమాలు నడిచి, ప్రజా సామాన్యంలో ప్రగతిశీల చర్చకు దారి తీసిన చోటే దాడులు జరుగుతున్నాయి. ఆలోచనలో, ఆచరణలో ఒక అడుగు ముందే ఉన్న మన ప్రాంతంలోనే హిందుత్వ శక్తులు బరితెగించి దాడులు చేస్తూ ఉండటం, భిన్న పాయలుగా, విడివిడిగా ప్రజాక్షేత్రంలో పనిచేస్తున్న ప్రగతిశీల వాదులకు ఒక హెచ్చరిక లాంటిదే. మన సమాజం క్రమంగా నియంతృత్వం నుంచి ఫాసిజం లోకి ఒక్కొక్క అడుగు వేస్తున్న దనటానికి ఇది ఒక తిరుగులేని సూచిక.



ఆమె ఓ రేడియో జాకీ, వ్యాఖ్యాత, సినీ గీత రచయిత్రి, కవయిత్రి, వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్... ఇలా ముఖాముఖి నిర్వాహకురాలిగా సాహిత్య లోకంలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న వర్ధమాన రచయిత్రి. తెలుగు సాహితీ వనంలో వికసించిన సుమబాలై పరిమళిస్తోంది. ఎదిగిన కొద్ది ఒదిగి వుండాలనే దానికి నిలివెత్తు నిదర్శనం... ఆమే నిత్యం చిరునవ్వులు చిందించే **విశ్వైక**... తన సాహిత్య ప్రయాణం వెనక దాగిన పదేండ్ల శ్రమ గురించి తన మాటల్లోనే...

తెలుగు సాహితీవనాన వికసించిన సుమబాల

సాహిత్య సృజన చేస్తానని నేను కలలోనైనా ఊహించలేదు. ఊహించనివి జరగటమే జీవితం అంటారు కదా! అలా నేను ఈ మార్గంలోకి వచ్చాను. నా నేపథ్యం విషయానికి వస్తే నేను పుట్టి పెరిగింది గుంటూరు జిల్లా సత్తెనపల్లి. ఇంటర్ వరకు అక్కడే చదువుకున్నాను. డిగ్రీ గుంటూరులోని ఉమెన్స్ కాలేజీలో పూర్తి చేశాను. తర్వాత అక్కడే కంప్యూటర్ కోర్సు నేర్చుకొని ఉద్యోగం కూడా చేశాను. అమ్మ, నాన్న, నేను, చెల్లి మధ్యతరగతి కుటుంబం. నాన్న హెల్త్ సూపర్వైజర్ గా సేవలందించి రిటైర్ అయ్యారు. అమ్మ గృహిణి. మంచితనం, మానవత్వం వారు మాకు ఇచ్చిన ఆస్తులు. మేము ఏం చేస్తామన్నా ఎంతో ప్రోత్సహించేవారు.

తాతయ్య నాకందించిన ఆస్తి సాహిత్యం

భాష పైన మమకారం ఉన్న అమ్మానాన్న పాఠశాలకు వెళ్లక ముందు నుండే మాకు వేమన, సుమతి శతకాలు వల్లె వేయించేవారు. నాకు సాహిత్యం పైన మక్కువ ఎప్పుడు కలిగింది అనే విషయానికి నా దగ్గర నిర్దిష్టమైన సమాధానం లేదు. సాహితీమూర్తి అయిన మా తాతయ్య పద్యాలు అనర్గళంగా పాడేవారు. ఒక పుస్తకం కూడా రాశారు. నా పెండ్లికి అదే కానుకగా ఇచ్చారు. దాన్ని ఇప్పటికీ జాగ్రత్తగా దాచుకున్నాను. ఆయన ప్రభావమే నాపై వుందనకుంటాను. అదే విధంగా చిన్నప్పటి నుండి నేను చదివిన కథల పుస్తకాల ప్రభావం కూడా నాలో ఎక్కడో తెలియకుండానే అంతర్లీనంగా ఎదిగి సాహితీ సృజన వైపు నన్ను నడిపించాయని నమ్ముతాను.

అది కవిత అని తెలియదు...

చిన్నతనం నుండి ఎంతో చురుగ్గా ఉండే దాన్ని. కళలంటే చాలా మక్కువ. ఆటలు, పాటలు,డాన్సులు దేనిలో తగ్గేదాన్ని కాదు. చిన్నతనంలో వ్యాసరచన, వక్తృత్వం పోటీలలో పాల్గొని బహుమతులు గెలుచుకున్నాను. నేను ఇంటర్లో ఉన్నప్పుడు సామాజిక కవితను రాశాను. నాన్న దాన్ని చూసి చెప్పేదాకా అది కవిత అని నాకు తెలియదు. నాన్న స్నేహితులు అది చూసి చాలా బావుందని పత్రికలో అచ్చు వేయించారు. తర్వాత పైచదువులు, వివాహం, ఇద్దరు పిల్లల బాధ్యత క్రమంలో రచనలు చేయలేదు.

ఖాళీ సమయంలో....

పిల్లలు ప్రాథమిక తరగతులకు వెళ్లే సమయంలో నాకు దొరికిన ఖాళీ సమయం నన్ను రచనలకు ప్రేరేపించింది. అనుకోకుండా అదే సమయంలో నాకు రేడియో వ్యాఖ్యాతగా అవకాశం వచ్చింది. ఇంట్లో నుండే దానికి వర్క్ చేసేదాన్ని. ఆ క్రమంలో నేను ప్రతిరోజు వార్తాపత్రికలు చదివేదాన్ని. ప్రతి విషయాన్ని అన్నీ కోణాలలో చూడాలని నాకు బాగా తెలిసింది అప్పుడే. గత తొమ్మిదేండ్ల నుండి రేడియో వ్యాఖ్యాతగా కొనసాగుతున్నాను. ఇంటి పని అంతా చూసుకొని రేపటి కార్యక్రమానికి సంబంధించిన అంశాన్ని గురించి పూర్తిగా రాసుకునేదాన్ని.



సినిమా పాటలు...

నేను రాసిన కవితలను ఫేస్బుక్‌లో పెట్టేదాన్ని. చాలామంది చూసి బాగున్నాయని కామెంట్స్ పెట్టేవాళ్ళు. ఆ ప్రోత్సాహంతో రోజుకొక కవిత రాసి పెట్టేదాన్ని. అలా ఫేస్బుక్ లో నా కవితలు చూసిన ఒక మ్యూజిక్ డైరెక్టర్ సినిమాకు పాటలు రాస్తారా అని అడగడం, నేను ప్రయత్నించటం ఇప్పటికి మూడు సినిమాలలో ఆరు పాటలు, ఆల్బమ్ సాంగ్స్ ప్రైవేట్ సాంగ్స్ ఇలా దాదాపు దాదాపు 10కి పైగా పాటలు బయటకు వచ్చాయి. కుటుంబ సభ్యులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా రాత్రి సమయంలోనే ఎక్కువగా రాసుకునేదాన్ని. ఇలా రెండు మూడు నెలలు నాకు నిత్యకృత్యమైంది. ఆ సందర్భంలో కాస్త ఆరోగ్యం కూడా దెబ్బతింది.

కొన్నింటిని పట్టించుకోను

ప్రశంసల విషయానికి వస్తే నేను రాసిన పాట చాలా బాగుంది అంటూ నా తొలి పాట పాడిన చిత్ర ఫోన్ చేసి నన్ను మెచ్చుకున్నారు. జీవితంలో మరువలేని ఘట్టాలలో ఇది ఒకటి. నా కవితలకు ఎందరో ప్రముఖుల నుండి ప్రశంసలు లభించాయి. కొన్ని కవితలకు నగదు బహుమతులు కూడా వచ్చాయి. ఈమధ్య కథలు, వ్యాసాలు కూడా రాస్తున్నాను. ఇటీవల రైతును గురించి రాసిన కవిత రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి పొందింది. ప్రతి పనిలోనూ ప్రశంసలతో పాటు విమర్శలు కూడా ఎదురవుతాయి. ప్రతి విమర్శను పట్టించుకో వలసిన అవసరం లేదు. కొన్నింటిని మాత్రం సద్విమర్శగా తీసుకొని మనల్ని మనం మెరుగుపరుచుకోవాలి. నేను ఎదిగే క్రమంలో నా భర్త, నా పిల్లలు నాకు ఎంతో సహకారం అందిస్తున్నారు. వారి సహకారం లేనిదే నేను ఇంత దూరం రాకపోయేదాన్ని.

ఎంత కష్టం వచ్చినా...

సాహిత్యం సేవ విషయానికి వస్తే నేను 'అక్షరయాన్' మహిళా రచయిత్రుల సంస్థకు ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నాను. మా సంస్థ ద్వారా ఎన్నో అద్భుతమైన కార్యక్రమాలు చేపడుతున్నాము. మహిళా రచయితలకు ఒక గౌరవాన్ని, స్థానాన్ని నిలిపే దిశగా మంచి ప్రోత్సాహాన్ని అందిస్తూ.. చక్కని అవకాశాలను కల్పిస్తూ అయినంపూడి శ్రీలక్ష్మి మమ్మల్ని ముందుకు నడిపిస్తున్నారు. మనం ముందుకు ఎదిగే క్రమంలో మొదట అడుగుపడి ఉండదు. కానీ అతి కష్టం మీద అడుగు వేసి ఉంటాము. ఆ తర్వాత వచ్చే ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ నడుస్తున్నాం. ఇంకా ఎన్ని కష్టాలు వస్తాయో అని బాధపడటం కాదు.. ఏ కష్టం వచ్చినా నేను దాటగలను అనే విషయాన్ని మనం నేర్చుకోవాలి. ప్రతిసారి ప్రతి విషయమూ మనకు అనుకూలం కాకపోవచ్చు. దానిని గూర్చి ఆలోచించటం మానేసి ముందుకు నడుస్తూనే పోవాలి. ప్రతిభను పెంచుకుంటూ పోవాలి. అదే నేను కొనసాగిస్తున్నాను.

సరైన ప్రణాళిక వుంటే

నా స్వరం బాగుండటంతో అప్పటిలో నన్ను సీరియల్స్ కి డబ్బింగ్ చెప్పడానికి పిలిచారు. ఇంట్లో పిల్లలకు ఇబ్బంది కలుగుతుందని నేను చేయను అని చెప్పాను. కానీ వాణిజ్య ప్రకటనకు గాత్రం చేస్తుంటాను. సెంట్రల్ రైల్వే వారివి, రియల్ ఎస్టేట్, జ్యువెలరీ షాప్ ల వారి ప్రకటనలు చేసాను. ఈ మధ్య ఒకదానిలో నటించాను కూడా. అది ఇంకా రిలీజ్ కాలేదు. వ్యాఖ్యాతగా మాట్లాడటం నాకు చాలా ఇష్టం. వ్యాఖ్యతగా ఎందరో ప్రముఖుల మధ్యలో మాట్లాడటం మొదట్లో కాస్త భయం అనిపించినా తర్వాత అది అలవాటుగా మారింది. రవీంద్ర భారతి, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, త్యాగరాయ గాన సభ ఇంకా పలు వేదికల పైన వ్యాఖ్యాతగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. సరైన ప్రణాళిక ఉంటే ఏదీ పెద్ద సమస్య అనిపించదు.



మధురానుభూతులు

పెండ్లి తర్వాత నా భర్త ఉద్యోగ రీత్యా హైదరాబాద్ వచ్చాను. దాంతో నా సాహితీ రచన అంతా హైదరాబాద్ లోనే మొదలయ్యింది. అమ్మ, నాన్న తర్వాత నన్ను ఎక్కువగా ప్రోత్సహించిన వారిలో మా చిన్నాన్న విద్యాసాగర్ శర్మ ఒకరు. నా అభివృద్ధిని అందరితో ఎంతో ఆనందంగా పంచుకునే వారు. ప్రశంసలు మన మనసును ఎంతో ఉత్తేజ పరుస్తాయి. మరింతగా మనం ముందుకు వెళ్లడానికి దోహదపడతాయి. నేను రాసిన తొలి పాటకు ఆదిత్య మ్యూజిక్ వారు ప్లాటినం డిస్క్ తో సత్కరించారు. అలాగే నా ఈ ప్రయాణంలో జానకి, విశ్వనాథ్ గార్లను కలవడం ఒక మధురానుభూతి. నా రచనలను మెచ్చుకున్న వారిలో తనికెళ్ళ భరణి, సుద్దాల అశోక్ తేజ, మాధవ పెద్ది సురేష్, జమున ఇలా ఎందరో ప్రముఖులు ఉన్నారు. ఎదిగే క్రమంలో నా భర్త, నా పిల్లలు నాకు ఎంతో సహకారం అందిస్తున్నారు. వారి సహకారం లేనిదే నేను ఇంత దూరం రాకపోయేదాన్ని. ఇలా శ్రేయోభిలాషులందరి సహకారంతో నాదైన ముద్రవేస్తూ తెలుగు సాహితీవనాన చిన్నారి సుమబాలనై పరిమళిస్తున్నాను.



నేను రాసిన పాటలు

'మహబ్బత్ మే' సినిమాకు గాను "మేఘాల లోగిలిలో పూచే ఆ పువ్వులే.. మహిలోనా వెదజల్లే లేలేత గంధాలే"; "నీకెప్పుడూ నేనెప్పుడూ దూరం కానురా.. నిన్ను కన్న అమ్మ నేను రా" అంటూ రెండు పాటలు రాశాను ఇందులో నా తొలి పాట చిత్ర గారు పాడారు. 'కారులో షికారుకెళ్తే' సినిమాలో "కంటిపాపలో చుక్కలు మెరిసే.. గుండె గూటికి రెక్కలు మొలిచే" 'భగత్ సింగ్ నగర్' సినిమాలో "ఓ బొజ్జ గణపయ్య", "ఎవరేమైనా ఎదురెదైనా", "అల ఓర చూపు చూసి ఎల్లి పోమాకే" మూడు పాటలు రాశాను. "దీపావళి వచ్చింది.. సందళ్ళే తెచ్చింది.. ఈ వేళ మన ఇంటికి" అంటూ దీపావళి పండుగ మీద, "ఆనంద నందనాల రాఖీ పండుగ ఈ రక్షాబంధనాల ప్రేమే అండగా" అంటూ రాఖీ పండుగ మీద మాధవ పెద్ది సురేష్ సంగీత సారధ్యంలో ఆల్బమ్ కి పాటలు రాశాను. ఇంకొక రెండు, మూడు ప్రైవేటు పాటలు, రెండు లఘు చిత్రాలకు పాటలు రాశాను. మరో సినిమాకు రెండు పాటలు రాశాను. అది ఇంకా విడుదల కాలేదు.

30న మధ్యాహ్నం 1.32 గంటలకు

(మొదటిపేజి తరువాయి)



పాలనా సౌధం రాష్ట్రానికే తలమానికం కానుంది. ఆధునిక వసతులు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తెలంగాణ పరిపాలనా సౌధాన్ని నిర్మించిన సంగతి తెలిసిందే. నూతన సచివాలయంలోకి శాఖల తరలింపుపై సీఎస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు బుధవారం నుంచి ఈనెల 28 వరకు తరలింపు ప్రక్రియను పూర్తి చేయనున్నారు.

నూతన సచివాలయం గ్రౌండ్ ఫ్లోర్‌లో రెవెన్యూ శాఖ, మొదటి అంతస్తులో హోం శాఖ, , పంచాయతీ రాజ్, రెండో అంతస్తులో ఆర్థిక శాఖ,మూడో ఫ్లోర్‌లో వ్యవసాయం, ఎస్సీ అభివృద్ధి, పురపాలక శాఖలు, నాలుగో అంతస్తులో ఇరిగేషన్, న్యాయశాఖలు. ఐదో అంతస్తులో జీఏడీఈ, ఆర్‌అండ్‌బీ, ఆరో అంతస్తులో సీఎంవో, సీఎస్ కార్యాలయాలు కొలువుదీరనున్నాయి.

చట్టానికి చిక్కిన బీజేపీ విదేశీ స్నేహితుడు !

(మొదటిపేజి తరువాయి)

మార్నింగ్ హెరాల్డ్ పత్రిక తెలిపింది. ధన్‌కర్‌పై 13 లైంగిక దాడుల కేసులు నమోదయ్యాయి. ఆరుసార్లు ఆయన మహిళలకు మత్తు పదార్థాలు ఇచ్చి లైంగిక దాడులు చేశాడు. మహిళల అనుమతి లేకుండా ఆ అఘాయిత్యాలకు సంబంధించి 17 సార్లు వీడియోలు తీశాడు. 2018 జనవరి-అక్టోబర్ నెలల మధ్య అతను మొత్తం 39 నేరాలకు పాల్పడ్డాడు. వీటన్నింటినీ కోర్టు నిర్ధారించింది.

ప్రధాని నరేంద్ర మోడీతో ధన్‌కర్ కలిసి దిగిన ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. 2014లో సిడ్నీలో జరిగిన మోడీ రిసెప్షన్ కార్యక్రమం ఏర్పాటులో 'బీజేపీ స్నేహితుల సంఘం' ప్రముఖ పాత్ర పోషించింది. ధన్‌కర్ అకృత్యాలు వెలుగులోకి రాగానే ఈ సంఘం మాట మార్చి అతను 2018లోనే రాజీనామా చేశాడని చెప్పుకొచ్చింది. సిడ్నీలోని హిల్టన్ హోటల్ బార్‌లో అనువాదకుల కోసం ధన్‌కర్ పత్రికా ప్రకటన ఇచ్చాడు. ఇంటర్వ్యూ కోసం వచ్చిన కొరియా మహిళలకు మత్తుమందు ఇచ్చి వారిపై లైంగిక దాడికి తెగబడ్డాడు. ఈ నేరాలకు అతను చాలా సంవత్సరాలు జైలులో గడపాల్సి రావచ్చునని న్యాయ నిపుణులు తెలిపారు.

మితిమీరిన సమాచార చౌర్యం!

(మొదటిపేజి తరువాయి)

గుర్తించి వారిని సామాజిక భద్రతా పథకాలలో చేర్చాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలోనే ఇప్పటికైనా సమాచార గోప్యతకు సంబంధించి సమగ్ర చట్టం రూపొందించాల్సి ఉంది.

డిజిటల్ కార్యకలాపాలకు సంబంధించి దేశం గణనీయమైన పురోగతి సాధిస్తున్నప్పటికీ దానిపై ప్రజలలో అవగాహన చాలా తక్కువగా ఉందని ఐఎంఎఫ్ తెలిపింది. ఉదాహరణకు యూపీఐ ఆధారిత చెల్లింపులు పెరిగినప్పటికీ దేశంలో 15 సంవత్సరాల పైబడిన వారిలో కేవలం 35 శాతం మంది మాత్రమే ఈ వ్యవస్థను ఉపయోగించుకుంటున్నారు. వృద్ధులు, పేదలలో డిజిటల్ అక్షరాస్యత మరింత తక్కువగా ఉంటోంది. దీనిని పెంచడంతో పాటు వ్యక్తుల సమాచారాన్ని గోప్యంగా ఉంచేందుకు సమగ్ర చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రెజ్లర్ల ఆందోళనకు వెల్లువెత్తిన మద్దతు

(మొదటిపేజి తరువాయి)

మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు నెట్టా డిసౌజా, కాంగ్రెస్ నేత ఉదిత్ రాజ్ తదితరులు మద్దతు తెలిపారు.

మీ స్పందనేంటి? : ఢిల్లీ పోలీసులను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

మహిళా రెజ్లర్లు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం.. వారు చేస్తున్న ఆరోపణలు తీవ్రమైనవేనని పేర్కొంది. దీనిపై స్పందన తెలియజేయాలంటూ ఢిల్లీ పోలీసులకు నోటీసు జారీ చేసింది. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలనీ, అందుకు ఆదేశాలివ్వాలని కోరుతూ మహిళా భారత అగ్రశ్రేణి రెజ్లర్లు ఏడుగురు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. సీజేఐ జస్టిస్ డివై చంద్రచూడ్ ధర్మాసనం ముందు రెజ్లర్ల తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. 'వీరు మహిళా రెజ్లర్లు. మైనర్‌తో సహా ఏడుగురున్నారు. కమిటీ నివేదిక ఉంది. దానిని బహిర్గతం చేయలేదు. ఎంపీపై ఎఫ్ఐఆర్ కూడా నమోదుచేయలేదు' అని తెలిపారు. దీనికి సీజేఐ డివై చంద్రచూడ్ స్పందించారు. కేసు పత్రాలను తమకు చూపించాలనీ తెలిపారు.

కపిల్ సిబల్ తన వాదనలు కొనసాగిస్తూ బ్రిజ్ భూషన్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు ఉన్నాయని, దయచేసి మైనర్ చేసిన చివరి ఫిర్యాదు చూడాలని కోరారు. 'లైంగిక వేధింపుల ఆరోపణలను నిరూపించడానికి వీడియో రికార్డింగ్‌లు ఉన్నాయి. బాధితులైన ఏడుగురు మహిళా రెజ్లర్లు వేధింపులకు గురైనప్పుడు వారిలో ఒకరి వయస్సు 16 ఏండ్లు. ఆమె బంగారు పతకాన్ని గెలుచుకుంది' అని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తెలిపారు. లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చినా.. బ్రిజ్ భూషణ్ పై పోలీసులు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. ఇలాంటి నేరంలో కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేయనందుకు పోలీసులనూ ప్రాసిక్యూట్ చేయవచ్చని అన్నారు. దీనిపై శుక్రవారం (ఏప్రిల్ 28) విచారణ చేపడతామని ధర్మాసనం తెలిపింది. అంతేగాక, ఈ కేసులో ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచేందుకు జ్యుడిషియల్ రికార్డుల నుంచి ఆ ఏడుగురు రెజ్లర్ల పేర్లను తొలగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దేశం తరపున ప్రాతినిధ్యం వహించిన రెజ్లర్లు, వారిపై లైంగిక వేధింపులు జరిగినట్టు పిటిషన్‌లో తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయని తెలిపింది. ఈ అంశాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకుంటుందని పేర్కొంది.

మూడో రోజుకు చేరుకున్న రెజ్లర్ల ఆందోళన

లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రెజ్లర్లు జంతర్ మంతర్‌లో చేపట్టిన ఆందోళన మంగళవారం మూడో రోజూ కొనసాగింది. వినేష్ ఫోగట్, రవి దహియా, సాక్షి మాలిక్, బజరంగ్ పునియా తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఏఐ) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ శివ శర్మతో పాటు ప్రతినిధులు ఆందోళన వద్దకు చేరుకొని నిరసన తెలిపిన క్రీడాకారులతో చర్చించారు. 'నేను రెజ్లర్లను కలవడానికి, వారి మాటలు వినడానికి వచ్చాను. డిమాండ్‌పై నేను ఏమీ చెప్పలేను' అని ఎస్ఏఐ అధికారి విలేకరులతో అన్నారు. సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ (ఎస్ఎస్సీబీ) దాని అథ్లెట్లు, కోచ్‌లందరినీ రెజ్లర్ల నిరసనలో భాగస్వామ్యం కాకుండా నిషేధించింది.

రెజ్లర్లకు సంపూర్ణ మద్దతు : బృందాకరత్

ఆందోళన చేస్తున్న రెజ్లర్లకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకరత్ అన్నారు. బృందా కరత్, ఐద్వా నేతలు జగ్మతి సంఘ్వాన్, ఆశా శర్మ, మైమూనా మొల్లా, సీపీఐ(ఎం) ఢిల్లీ నేత రాజీవ్ కున్వర్ తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బృందాకరత్ మాట్లాడుతూ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా తమ పార్టీ పోరాటం చేస్తున్నదనీ, అన్ని స్థాయిల్లో జరిగే వేధింపులపై పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. వేధింపులకు పాల్పడిన వారిని బీజేపీ కాపాడుతుందని విమర్శించారు. ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ఈ ధైర్యవంతులైన మల్లయోధులకు ఏఐకేఎస్, సీఐటీయూ, ఏఐఏడబ్ల్యూయూ, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ తన పూర్తి మద్దతును తెలియజేశాయి. హన్నన్ మొల్లా, కృష్ణ ప్రసాద్ (ఏఐకేఎస్), ఎఆర్ సింధు (సీఐటీయు), విక్రమ్ సింగ్ (ఏఐఏడబ్ల్యూయూ) మయూఖ్ బిస్వాస్ (ఎస్ఎఫ్ఐ), హిమగ్నరాజ్ భట్టాచార్య, ఎంపీ ఏఏ రహీమ్ (డీవైఎఫ్ఐ) తదితరులు ఈ బృందంలో ఉన్నారు.

రేపు దేశవ్యాప్త నిరసన

పోరాడుతున్న మల్లయోధులకు న్యాయం కోసం రేపు (ఏప్రిల్ 27న) దేశవ్యాప్త నిరసనకు ఏఐకేఎస్, సీఐటీయూ, ఏఐఏడబ్ల్యూయూ, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చాయి. ఈ మేరకు ఐదు సంఘాలు సంయుక్తంగా ప్రకటన విడుదల చేశాయి. అంతర్జాతీయంగా పతకాలు సాధించి దేశానికి గౌరవాన్ని, ప్రతిష్టను తెచ్చిపెడుతున్న ఒలింపిక్ పతక విజేతలతో పాటు అగ్రశ్రేణి క్రీడాకారులు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వద్ద ధర్నాకు దిగాల్సి రావడం దురదృష్టకరమని పేర్కొన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఒకవైపు "బేటీ బచావో బేటీ పడావో" అంటూ సంబరాలు చేసుకుంటూనే, మరోవైపు ఈ దారుణమైన నేరంలో నిందితుడైన బీజేపీ ఎంపీని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించాయి. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, బ్రిజ్ భూషణ్ సింగ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి.

వలస కార్మికులు ఎవరికీ పట్టనోళ్లు

(మొదటిపేజి తరువాయి)

కార్మికులు మాత్రం పనిప్రదేశాల్లో తీవ్ర వివక్షకు, అణచివేతకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కో రూమ్‌లో ఏడెనిమిది మంది వలస కార్మికులను యాజమాన్యాలు, దళారులు కుక్కి ఉంచుతున్న దైన్యస్థితిని వివరించారు. 1979 అంతర్ రాష్ట్ర వలస కార్మికుల చట్టం ప్రకారం వలస కార్మికుల పేర్లను రిజిష్టర్‌లో నమోదు చేయాలనీ, వారికి పునరావాసం, సమాన పనికి సమాన వేతనం, పిల్లలకు విద్యావైద్య సౌకర్యాలు, రానుపోను ప్రయాణ చార్జీలు, తదితర సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. అయితే, ఇందులో ఏ ఒక్కటి కూడా అమలు కావడం లేదని వాపోయారు. ఇప్పటివరకు అమలులో ఉన్న అంతర్‌రాష్ట్ర వలస కార్మిక చట్టాన్ని అక్యుపేషనల్ సేఫ్టీ హెల్త్, వర్క్ కండిషన్ కోడ్‌లోకి మార్చిందన్నారు. దీంతో ఆ చట్టం రద్దయిపోయిం దని తెలిపారు. ఈ చట్టం రద్దుతో వలస కార్మికులు తమ హక్కులను కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొందని చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం వలస కార్మికుల పేర్లను కార్మిక శాఖ నమోదు చేయాలనీ, రిజిస్ట్రర్లను తప్పనిసరిగా మెయింటెన్ చేయాలని డిమాండ్ చేశారు. వారికి రేషన్, గుర్తింపు కార్డులను ఇవ్వాలని కోరారు. వలస కార్మికులకు కూడా భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. వలస కార్మికులు పని ప్రదేశాల్లో వారు వేధింపులకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత కార్మిక శాఖపై ఉందని నొక్కిచెప్పారు. వలస కార్మికులు నివాసం ఉండే ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తనిఖీ చేయాలని కోరారు. వలస కార్మికులను సమీకరించి హక్కుల కోసం పోరాడేలా భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల ఫెడరేషన్ ముందువరుసలో ఉండాలని సూచించారు. వలస కార్మికులకు అండగా ఉండేదీ, వారిలో ధైర్యాన్ని నింపేదీ ఎర్రజెండానేనని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు వంగూరు రాములు, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రామ్మోహన్ రావు, రత్నాకరం కోటంరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ముదాం శ్రీనివాసరావు, రాష్ట్రనాయకులు లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

(మొదటిపేజి తరువాయి)

ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై ముఖ్యమంత్రి కేసీఆర్‌ను స్వయంగా కలిసి రైతుల బాధలను వివరిస్తానన్నారు. ఆయన వెంట రైతు సంఘం నాయకులు బండి రమేష్, ఉరడీ సుదర్శన్ రెడ్డి, నంద్ర ప్రసాద్, తోట పెద్ద వెంకట రెడ్డి, వరగాని మోహన్ రావు, వీరయ్య, యండపల్లి వెంకటరామయ్య, కొప్పుల రామయ్య, పుచ్చకాయల నాగేశ్వరరావు, కొండం కరుణాకర్, చామకూరి రత్నం, వడ్లమూడి నాగేశ్వరరావు, కారుమంచి గురవయ్య కొప్పుల ఉపేందర్, సిలువేరు బాబు, నూతలపాటి రామారావు

బీజేపీ విధానాలతో దేశం సర్వనాశనం

(మొదటిపేజి తరువాయి)

స్థూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం సాధించాక రెండుసార్లు ముఖ్యమంత్రిగా కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టారని చెప్పారు. దేశాన్ని అభివృద్ధి దిశలో తీసుకుపోవాలంటే కేసీఆర్ లాంటి దమ్మున్న నాయకుడు కావాలన్నారు. మహారాష్ట్రలో కేసీఆర్ బహిరంగ సభలు పెడితే రైతులు, ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, రానున్న రోజుల్లో ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా ఉధృతం అవుతుందన్నారు. 2010 నుంచి 2014 వరకు గుజరాత్ రాష్ట్రంలో జరగని అభివృద్ధిని జరిగినట్టు ప్రచారం చేసుకొని నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయ్యారని ఎద్దేవా చేశారు. బ్రెయిన్ లేని బంటి.. పార్టీలు మారే సంటీలు తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీల అధ్యక్షులు అయ్యారని.. ఇది రాష్ట్రానికి పట్టిన దరిద్రమన్నారు. రాష్ట్రంలో అన్ని కులాలు, మతాల వారు సంతోషంగా ఉన్నారని చెప్పారు. రాష్ట్ర సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడం వల్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారన్నారు. ఇది ఎన్నికల సంవత్సరమని చిన్న పాము అయినా పెద్దకట్టెతో కొట్టాలని కార్యకర్తలకు సూచించారు. ఆదమరచి ఉండకూడదని, అలర్ట్‌గా ఉండాలని కరీంనగర్ పార్లమెంటు సీటును ఈసారి వదులుకునే పరిస్థితి లేదని.. ఎంపీగా బోయినిపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని సూచించారు. మతం పేరు మీద విచిత్ర రాజకీయాలు చేస్తున్న ఎంపీ బండి సంజయ్‌తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. ఇలాంటి వ్యక్తిని గెలిపించుకున్నామా అని ఎవరికి వారు ప్రశ్నించుకుంటూ మనోవేదన చెందుతున్నారని అన్నారు.

కార్యకర్తలే కొండంత అండ : మంత్రి తలసాని

కార్యకర్తలే బీఆర్ఎస్‌కు కొండంత అండ అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సికింద్రాబాద్‌లోని మహబూబ్ కాలేజీలోని ఎస్‌వీఐటీ ఆడిటోరియంలో నిర్వహించిన సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనాన్ని బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో నిర్వహించారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరయ్యారు. బీఆర్ఎస్ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రతినిధుల సభలో మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో గల బీఆర్ఎస్ కార్యాలయంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. మహబూబాబాద్ జిల్లాలోని ఆర్తి గార్డెన్‌లో బీఆర్ఎస్ ప్లీనరీ సమావేశంలో ఎంపీ, బీఆర్ఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు మాలోతు కవిత, ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

గుజరాత్ హైకోర్టుకు రాహుల్

(మొదటిపేజి తరువాయి)

రెండేండ్ల జైలుశిక్ష విధిస్తూ గతంలో తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ తీర్పును సవాల్ చేసేందుకు వీలుగా 30 రోజుల సమయంతో ఇవ్వడంతో పాటు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో భాగంగా రాహుల్ గాంధీ తొలుత సూరత్ సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. రెండేండ్ల జైలు శిక్షను నిలుపుదల చేయడంతో పాటు తనను దోషిగా పేర్కొన్న తీర్పును నిలిపివేయాలంటూ రెండు పిటిషన్లను వేశారు. ఈ క్రమంలో సూరత్ సెషన్స్ కోర్టు ఏప్రిల్ 20న స్టే విధించేందుకు నిరాకరిస్తూ తీర్పును వెల్లడించింది. దీంతో రాహుల్ గాంధీ ఈ తీర్పును సవాల్ చేస్తూ గుజరాత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

రాష్ట్రంలో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం

- సిద్దిపేట జిల్లా ధూల్‌మిట్టలో 8.35 సెంటీమీటర్ల వాన
- వచ్చే ఐదు రోజులూ వర్షం పడే సూచనలు
- కొన్ని ప్రాంతాల్లో వడగండ్లు పడే అవకాశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో మంగళవారం రాత్రి పది గంటల వరకు 453కి పైగా ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎక్కువగా వర్ష ప్రభావం కనిపించింది. నల్లగొండ, జనగామ, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులు, వడగండ్లతో కూడిన వాన పడింది. జగిత్యాల, కరీంనగర్, సిద్దిపేట, సంగారెడ్డి, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజి గిరి జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ వర్షం కురిసింది. సిద్దిపేట జిల్లా ధూల్‌మిట్టలో అత్యధికంగా 8.35 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయింది. రాష్ట్రంలో వచ్చే ఐదు రోజుల పాటు కూడా తేలిక పాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడంతో పాటు వడ గండ్లు కూడా పడొచ్చని హెచ్చరించింది. పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. ఆరెంజ్ హెచ్చరికల జాబితాలో ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్‌భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, నల్లగొండ జిల్లాలున్నాయి. హైదరాబాద్‌లోనూ మంగళవారం పలుచోట్ల వర్షం కురిసింది. రాబోయే 48 గంటల పాటు హైదరాబాద్‌లో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశముంది. వాతావరణం మారిన క్రమంలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే తక్కువ నమోదయ్యే అవకాశముంది. మంగళవారం నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లోనే 40 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సూర్యాపేట జిల్లా రాయిని గూడం లో అత్యధికంగా 40.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు
(మంగళవారం రాత్రి పదున్నర వరకు)

ధూల్‌మిట్ట	(సిద్దిపేట)	8.35 సెంటీమీటర్లు
ఆర్‌సీ పురం	(సంగారెడ్డి)	7.98 సెంటీమీటర్లు
గచ్చిబౌలి	(రంగారెడ్డి)	7.75 సెంటీమీటర్లు
నందనం	(యాదాద్రి భువనగిరి)	7.58 సెంటీమీటర్లు
కీసర	(మేడ్చల్ మల్కాజిగిరి)	7.50 సెంటీమీటర్లు

'నవతెలంగాణ' సేవా కార్యక్రమాలు భేష్

- కంప్యూటర్ కోర్సులను స్థానిక విద్యార్థులు ఉపయోగించుకోవాలి
- బ్యాంక్ ఆఫ్ బరోడా రీజినల్ డిప్యూటీ మేనేజర్ రమేశ్‌కుమార్
- అసెంట్ స్కూల్‌కు ఐదు కంప్యూటర్ల అందజేత





నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నవతెలంగాణ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో అసెంట్ స్కూల్ ఏర్పాటు చేసి విద్యార్థులకు కంప్యూటర్ కోర్సులను ఉచితంగా అందించడం భేష్ అని బ్యాంక్ ఆఫ్ బరోడా రీజినల్ డిప్యూటీ మేనేజర్ రమేశ్‌కుమార్ కొనియాడారు. ఈ కోర్సులను స్థానిక విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని నవతెలంగాణ సాహితీ సంస్థ కార్యాలయంలో అసెంట్ స్కూల్‌లో టైప్‌రైటింగ్, పేజీమేకర్, క్వార్క్, ఫొటోషాప్, విజిటింగ్ కార్డ్స్ డిజైనింగ్ కోర్సులను వ్యక్తిత్వ వికాస నిపుణులు మహిపతి శ్రీనివాసరావు, నవతెలంగాణ సాహితీ సంస్థ జనరల్ మేనేజర్ కె.భరత్, ఎస్టేట్ మేనేజర్ వీరయ్య, బ్యాంక్ ఆఫ్ బరోడా టెక్నికల్ చీఫ్ మేనేజర్ వీ.ఆర్.రావు, అసెంట్ స్కూల్ ఇన్‌చార్జి రాములుతో కలిసి రమేశ్‌కుమార్ ప్రారంభించారు.

గతంలో శిక్షణ పొంది విజయవంతంగా కోర్సు పూర్తిచేసిన 12 మందికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా అసెంట్ స్కూల్‌కు బీఓబీ తరఫున ఆయన ఐదు కంప్యూటర్లను ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..భవిష్యత్‌లోనూ నవతెలంగాణ అసెంట్ స్కూల్‌కు తమ బ్యాంకు తరఫున సహకారాన్ని అందజేస్తామని హామీనిచ్చారు. మహిపతి శ్రీనివాస్‌రావు విద్యార్థులను చైతన్యపరుస్తూ మోటివేషన్ చేశారు. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో ఒక్కో మెట్టు ఎదగాలని ఆకాంక్షించారు.

ప్రతీ విజయం ఒక్క అడుగుతోనే సాధ్యమవుతుందని చెప్పారు. భరత్ మాట్లాడుతూ..తమ సంస్థ ద్వారా రెగ్యులర్‌గా ఉచితంగా కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. ఇక్కడ శిక్షణ పొందినవారు ప్రస్తుతం అనేక రంగాల్లో రాణిస్తున్నారన్నారు. కంప్యూటర్ కోర్సులు నేర్చుకోవడం ద్వారా అనేక సంస్థల్లో ఉపాధి అవకాశాలున్నాయని చెప్పారు. ప్రతిఒక్క విద్యార్థి కూడా క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ కోర్సులను విజయవంతంగా పూర్తిచేయాలని ఆకాంక్షించారు.

200 మంది ఆర్టిజన్ల తొలగింపు

హెచ్-52 యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులపై వేటు

- మిగిలినవారు డ్యూటీల్లో చేరాలి...లేకుంటే టెర్మినేటే..
- విద్యుత్ ఆర్టిజన్ల సమ్మెపై యాజమాన్యం ఉక్కుపాదం
- సమ్మె ప్రభావం లేదని ప్రకటన

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ సంస్థల్లో 200 మంది ఆర్టిజన్ కార్మికులను సర్వీస్ నుంచి తొలగించారు. 'ఎస్మా' అమల్లో ఉన్నా, నిబంధనలకు వ్యతిరేకంగా, క్రమ శిక్షణ ఉల్లంఘించి సమ్మెకు వెళ్లినందుకు వారిపై ఈ చర్యలు తీసుకున్నట్టు విద్యుత్ సంస్థల యాజమాన్యా లు తెలిపాయి. ఆర్టిజన్ల సమ్మెకు పిలుపునిచ్చిన హెచ్-52 యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు లు ఎస్ సాయిలు, జే శివశంకర్‌ను కూడా సర్వీసు నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సమ్మెకు వెళ్లొద్దని పలుమార్లు వారిని హెచ్చరించినా, క్రమశిక్షణ ఉల్లంఘించి, సంస్థలో పనిచేస్తున్న ఇతర ఆర్టిజన్లను రెచ్చగొట్టి, విధులు బహిష్కరించేలా ప్రేరేపించినందున వీరినీ సర్వీసు నుంచి తొలగిస్తు న్నట్టు తమ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే సమ్మె కొనసాగుతుందని హెచ్-52 అధ్యక్షులు సాయిలు సోషల్ మీడియా ద్వారా తెలిపారు. మరోవైపు సమ్మె పిలుపులో భాగస్వామిగా ఉన్న ఇత్తేహద్ యూనియన్ నేతలు ఆ పిలుపును ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించారు. అయితే అదే యూనియన్‌కు చెందిన మరికొందరు నాయకులు మాత్రం అది తప్పుడు ప్రకటన అనీ, సమ్మెలో ఉన్నామని తెలిపారు. సమ్మెలో పాల్గొంటున్న ఆర్టిజన్లు ఇంకెవరన్నా ఉంటే, బుధవారం ఉదయానికల్లా విధుల్లో చేరాలనీ, లేకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని టీఎస్ జెన్‌కో,ట్రాన్స్‌కో, టీఎస్ఎస్పీడీసీఎల్, టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎమ్‌డీలు దేవులపల్లి ప్రభాకరరావు, జీ రఘుమారెడ్డి, ఏ గోపాలరావు వేర్వేరు ప్రకటనల్లో హెచ్చరించారు. టీఎస్‌జెన్‌కోలో వందశాతం మంది ఆర్టిజన్లు విధులకు హాజరయ్యారని వారు తెలిపారు. డిస్కంలలో 80 శాతం మంది కార్మికులు విధుల్లో చేరారనీ, విద్యుత్ సరఫరాలో ఎక్కడా ఎలాంటి అవరోధాలు ఏర్పడలేదని వారు స్పష్టం చేశారు. సమ్మె ప్రభావం విద్యుత్ సంస్థలపై ఏమాత్రం లేదన్నారు. క్రమశిక్షణ ఉల్లంఘిస్తే, విధుల నుంచి తప్పించేస్తామని హెచ్చరించారు.

"విద్యుత్ సంస్థల్లో ఏప్రిల్ 15 వ తేదీన పలు కార్మిక సంఘాలు ఆమోదం తెలిపిన వేతన సవరణ సరిపోలేదన్న సాకుతో కొందరు ఆర్టిజన్లు 25 ఏప్రిల్ నుండి ఇచ్చిన సమ్మె పిలుపు నేపథ్యంలో క్షేత్ర స్థాయి విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ పరిస్థితులపై సమీక్షిం చాం. సమ్మె ప్రభావం విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీల మీద, వినియోగదారులపైనా లేదని నివేదికలు అందాయి" అని సీఎమ్‌డీలు స్పష్టత ఇచ్చారు.

పాలిసెట్‌కు 1.06 లక్షల దరఖాస్తులు

- ఆలస్య రుసుంతో మే 14 వరకు సమర్పణకు అవకాశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పాలిటెక్నిక్, వివిధ డిప్లొమా కోర్సుల్లో 2023-24 విద్యా సంవత్స రంలో ప్రవేశాలకు నిర్వహించే పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పాలిసెట్)కు 1,06,561 దరఖాస్తులొచ్చాయి. ఈ మేరకు రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణా మండ లి (ఎస్‌బీటీఈటీ) కార్యదర్శి డాక్టర్ సి శ్రీనాథ్ మంగళవారం ఒక ప్రకటన విడు దల చేశారు. వారిలో 98,831 మంది అభ్యర్థులు ఫీజు చెల్లించారని తెలిపారు. ఆలస్య రుసుం రూ.200తో వచ్చేనెల 14వ తేదీ వరకు దరఖాస్తులను సమర్పిం చేందుకు అవకాశముందని సూచించారు. పదో తరగతి పరీక్షలు రాసిన వారు, ఇప్పటికే పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. పాలి సెట్ రాతపరీక్షను వచ్చేనెల 17న నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఇతర వివరాల కోసం polycet.sbtet.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రీతి మృతిపై కౌంటర్ వేయండి : హైకోర్టు

నవతెలంగాణ-హైదరాబాద్

వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీ అనస్తీషియా విద్యార్థి ప్రీతిని సైఫ్ అనే మరో మెడికో వేధించారనీ, అతని స్నేహితులతో కలిసి విషమిచ్చి హత్య చేశారని రాష్ట్ర ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లయ్య రాసిన లేఖను హైకోర్టు పిల్‌గా స్వీకరించింది. ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేయాలని చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీలతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం నోటీసులిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మెడికల్ అండ్ హెల్త్ ముఖ్య కార్యదర్శి, డీఎంఈ, వరంగల్ పోలీస్ కమిషనర్, కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, అనస్తీషియా విభాగం చీఫ్‌లకు నోటీసులిచ్చింది. విచారణను జూలై 28కి వాయిదా వేసింది. ప్రీతిని కులం పేరుతో వేధించారనీ, ర్యాగింగ్ చేశారని మల్లయ్య అందులో పేర్కొన్నారు. సైఫ్ తన స్నేహితులతో కలిసి విషమిచ్చి ఆమె చావుకు కారణమయ్యారని ఆరోపించారు. పోలీసుల దర్యాప్తుపై తమకు నమ్మకం లేదని చెప్పారు. సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు

కార్యకర్తలే బీఆర్ఎస్‌కి కొండంత అండ

- మంత్రులు తలసాని, ఎర్రబెల్లి, మల్లారెడ్డి..
- చేతనైతే నాపై పోటీ చేయ్..' రేణుకకు మంత్రి పువ్వాడ సవాల్
- బీఆర్ఎస్ 23వ ఆవిర్భావ వేడుకలు, ఆత్మీయ సమ్మేళనాల్లో మంత్రులు

నవతెలంగాణ-విలేకరులు

బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయిల్లో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ 23వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, ఆత్మీయ సమ్మేళనాల్లో మంగళవారం మంత్రులు పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్ష పార్టీలపై ఆరోపణలు, వారు చేసిన వ్యాఖ్యలపై సవాళ్లు విసిరారు.

హైదరాబాద్‌లోని ఆర్‌టీసీ కళ్యాణ మండపం లో,సికింద్రాబాద్‌లోని మహబూబా కాలేజీలోని ఎస్‌వీఐటీ ఆడిటోరియంలో నిర్వహించిన ముషీరా బాద్, సనత్ నగర్ నియోజక వర్గాల బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సమావేశంలో మంత్రి తలసాని శ్రీని వాస్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి కొండంత అండ అన్నారు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్ అభ్యర్థులు ఓడినా నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యల పరి ష్కారానికి కృషి చేస్తున్నారని చెప్పారు. గెలిచిన ప్రతిపక్ష కార్పొరేటర్లు



ఇప్పటి వరకు ఒక్క రూపాయి అభివృద్ధి పనులైన చేశారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రతినిధుల సభ తూంకుంటలోని జాన్వీ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ సర్కారు ప్రజల మధ్య విద్వే షాలు రెచ్చగొట్టి మత రాజకీయాలు చేస్తున్నదని, కానీ చైతన్యవంతమైన తెలంగాణలో బీజేపీ నేతల పప్పులు ఉడకవని అన్నారు. మేడ్చల్ గడ్డ గులాబీ అడ్డ అని, మూడోసారి గెలిచి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇస్తామని తెలిపారు.

అభివృద్ధి సంక్షేమంలో తెలంగాణ దేశానికే ఆదర్శం : మంత్రి ఎర్రబెల్లి

జనగామ జిల్లా పాలకుర్తి మండ ల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయం లో నిర్వహించిన బీఆర్ఎస్ 23వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పార్టీ గ్రామ అధ్యక్షులు బీఆర్ఎస్ జండాను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడు తూ.. అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో పాలకుర్తి ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామని, పాలకుర్తి, వల్మిడి, బొమ్మెర గ్రామాలను పర్యాటక కేంద్రం గా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పసునూరి నవీన్, తదితరులు పాల్గొ న్నారు. మహబూబాబాద్ జిల్లాలోని ఆర్తీ గార్డెన్స్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, మహ బూబాబాద్ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్‌తో ఎంపీ, జిల్లా అధ్యక్షులు మాలోతు కవిత పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి అంటే బీఆర్ఎస్ అని, ప్రభుత్వాలను ప్రజలకు అందుబాటు లో తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని తెలిపారు.

'చేతనైతే నాపై పోటీ చేయ్..' రేణుకకు మంత్రి పువ్వాడ సవాల్

ప్రత్యర్థుల పాలిట సింహస్వప్నం లా మారబట్టే తనను ఎదుర్కోలేక వ్యక్తిగత దూషణకు



దిగుతున్నారని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. 'అరేయ్.. తురేయ్.. వాడు.. వీడు' అంటూ సభ్యత మరిచి వ్యవహ రిస్తున్నారన్నారు. తూల నాడటం.. వ్యక్తిగత దూషణ తమకు చేతకాక కాదని, మా నాయన, మా నాయకులు తమకు సభ్యత నేర్పించారని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్న కేసీఆర్‌ను ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఖమ్మం నగరంలోని మమత మెడికల్ కళాశాల గ్రౌండ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ ప్రతినిధుల సభలో పువ్వాడ మాట్లాడారు. ఎమ్మెల్యేగా తన తొమ్మిదేండ్ల పదవీకాలంలో అభివృద్ధి చేయడం కోసం కష్టపడ్డ కాని.. ప్రజల దగ్గర డబ్బులు వసూలు చేసిన చరిత్ర తనకు లేదన్నారు. టిక్కెట్ ఇప్పిస్తాననే పేరుతో గిరిజనుల వద్ద రూ.కోట్లు దోచి.. వారి ప్రాణాలు హరించిన చరిత్ర రేణుకాచౌదరిదని విమర్శించారు. కేంద్రమంత్రి, ఎంపీగా ఖమ్మానికి చేసిన ఓ మంచి పనైనా చెప్పగలరా అని ప్రశ్నించారు. దమ్ముంటే రేణుకా చౌదరి తనపై పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఎంపీలు నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) నేత మృదుల్ డే కన్నుమూత

- పొలిట్‌బ్యూరో సంతాపం

న్యూఢిల్లీ : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ మాజీ సభ్యులు కామ్రేడ్ మృదుల్ డే సోమవారం కన్నుమూశారు. ఆయన వయస్సు 76సంవత్సరాలు. గత కొంత కాలంగా ఆయన కేన్సర్‌తో పోరాడుతున్నారు. అవిభక్త బెంగాల్‌లో చట్టగ్రామ్‌లో జన్మించిన కామ్రేడ్ మృదుల్ డే కాలేజీ విద్యార్థిగా వున్నపుడే క్రియాశీలంగా విద్యార్థి ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత పార్టీలో చేరారు. 1960, 1970 ప్రారంభ సమయంలో పోలీసుల అత్యాచారాలకు వ్యతిరేకం గా ఆయన సాహసోపేత పోరాటం చేశారు. రెండుసార్లు జైలుకు వెళ్లి వచ్చారు. కొంతకాలం పాటు డార్జిలింగ్ జిల్లా నుండి ఆయనను బహిష్క రించారు కూడా. అనంతరం మృదుల్ కోల్‌కతాకు తరలివెళ్ళారు. అక్కడ పార్టీ హోల్‌టైమర్‌గా పనిచేశారు. పార్టీ దినపత్రిక గణశక్తిలో చేరారు. సాయంకాలం దినపత్రికగా వున్న గణశక్తిని దినపత్రికగా మార్చడంలో కీలక పాత్ర పోషించారు. సవివరమైన కథనంతో నైపుణ్యం కలిగిన విలేకరిగా ఆయన దీర్ఘకాలం పాటు గణశక్తికి చీఫ్ రిపోర్టర్‌గా చేశారు. 1985లో పార్టీ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీకి ఎన్నికయ్యారు. 2001లో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడయ్యారు. 2008లో కోయంబత్తూరు మహాసభల్లో పార్టీ కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారు. ఆ పదవిలో 2022 వరకు కొనసాగారు. ఆయన మృతికి పార్టీ పొలిట్‌బ్యూరో తీవ్ర విచారాన్ని వ్యక్తం చేసింది. ఆయన భార్య స్వప్న, ఇతర కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియచేసింది.

ప్రకాశ్ సింగ్ బాదల్ మృతి



మొహాలీ: పంజాబ్ మాజీ సీఎం, అకాలీ దళ్ నాయకులు ప్రకాశ్ సింగ్ బాదల్ కన్నుమూసారు. ఆయన వయస్సు 95 ఏళ్లు. కొన్ని రోజులు నుంచి అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి 8:30 గంటలకు బాదల్ తుది శ్వాస విడిచారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులతో ఫోర్టిస్ ఆసుపత్రిలో వారం రోజుల క్రితం బాదల్ చేరారు. శుక్రవారం నుంచి ఐసియులో బాదల్‌కు చికిత్స అందిం చారు. గత ఏడాది జనవరిలో కోవిడ్‌కు గురికావడంతో కొన్ని రోజుల పాటు లూధియానాలోని ఆసుపత్రిలో బాదల్ చికిత్స తీసుకున్నారు.

సీఎం కేసీఆర్ సంతాపం

ప్రముఖ జాతీయ రాజకీయ వేత్త, పద్మ విభూషణ్, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి ప్రకాష్ సింగ్ బాదల్ మృతి పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం ప్రకటించారు. గ్రామ సర్పంచ్ నుంచి కేంద్ర మంత్రి గా పంజాబ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, పంజాబ్ అభివృద్ధి కోసం వారు చేసిన కృషిని సిఎం ఈ సందర్భంగా స్మరించుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు సిఎం కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

'ఉపాధి' ని పట్టణ ప్రాంతానికి విస్తరించాలి

- పల్లెల్లో 200 రోజులు పని కల్పించాలి
- ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్ .పుణ్యవతి
- మహిళలపై హింసకు పాల్పడుతున్న దోషులకు కేంద్రం అండ :రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



నవతెలంగాణ- యాదగిరిగుట్ట

ఉపాధిహామీ చట్టాన్ని పట్టణ ప్రాంతాల్లో అమలు చేసి 200 రోజులు పనిదినాలు కల్పించాలని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి డిమాండ్ చేశారు. ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు రెండు రోజులుగా యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణకేంద్రంలోని మున్నూరు కాపు సత్రం లో నిర్వహించారు. సమావేశం అనంతరం మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పుణ్యవతి మాట్లాడుతూ.. పేదలకు ఉపాధి లేక అల్లా డుతుంటే.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వారిపై భారాలు వేస్తూ అదానీ, అంబానీలకు దోచిపెట్టడంపై ఐద్వా ఆధ్వర్యంలో రాబోయే కాలంలో ప్రజల ను చైతన్యం చేస్తామన్నారు. 2014లో 69వ స్థానంలో ఉన్న అదానీ ప్రపంచ కుబేరుల్లో 2వ స్థానానికి వెళ్లటానికి మోడీ ప్రభుత్వం అనుసరించిన విధాన మే కారణమన్నారు. పేదల నుంచి కుబేర్లకు దోచిపెడుతున్న విధానాలపై వివిధ భాషల్లో పుస్తకాలు ప్రచురించి దేశవ్యాప్తంగా క్యాంపెయిన్ చేయబో తున్నామని, అనంతరం అక్టోబర్ 5న డిల్లీలో భారీ సభ నిర్వహిస్తామని చెప్పా రు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. మహిళల ఆహారం, వస్త్రధారణపై ఆంక్షలు పెడుతూ మనువాద భావజాలాన్ని అమలు చేస్తూ మహిళలపై హింసకు పాల్పడుతున్న దోషులకు అండగా కేంద్ర ప్రభు త్వం వ్యవహరిస్తున్నదన్నారు. మహిళల హక్కులు హరించే విధానాలకు వ్యతి రేకంగా మహిళలను చైతన్యం చేసేందుకు రాష్ట్ర కమిటీలో కార్యాచరణ రూ పొందించుకున్నామని తెలిపారు. ఉపాధి హామీ, డ్వాక్రా సమస్యలపై సర్వే చేసి, ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై అధికారులకు వినతి పత్రాలు ఇవ్వ డంతో పాటు అవసరమైతే ఆందోళనలు నిర్వహిస్తామని చెప్పారు. సమా వేశంలో రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి, ఉపాధ్యక్షులు బి.హైమావతి, కేఎస్ ఆశాలత, యాదాద్రి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అవ్వారి రామేశ్వరి, బట్టుపల్లి అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని ప్రయివేటు వర్సిటీలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గుర్తింపు లేకున్నా ప్రయివేటు విశ్వవిద్యాలయాల పేరుతో ప్రచారం చేస్తూ, పరీక్షలు నిర్వహిస్తున్న గురునానక్, శ్రీనిధి వంటి సంస్థలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రాకున్నా ప్రయివేటు విశ్వవిద్యాలయాల పేరుతో లక్షల రూపాయలను విద్యార్థుల నుంచి వసూళ్లు చేస్తూ అడ్మిషన్లు చేపట్టాయని విమర్శించారు. వాటికి సంబంధించిన బిల్లు ఆమోదం పొందకుండా శ్రీనిధి, గురునానక్ పరీక్షలు షెడ్యూల్ ఇచ్చాయని తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం కూడా అందమైన బ్రోచర్లు వేస్తూ ముందస్తుగా అడ్మిషన్లు చేస్తున్నారని పేర్కొ న్నారు. ప్రభుత్వ అనుమతుల్లేకుండా రూ.లక్షల్లో ఫీజులు వసూళ్లు చేసి, విద్యార్థులను మోసం చేస్తున్న శ్రీనిధి, గురునానక్ ప్రయివేటు వర్సిటీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

'బండి' బెయిల్ పిటిషన్ రద్దుపై నేడు మళ్లీ వాదనలు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఎస్‌సీ హిందీ పేపర్ బయటకు వచ్చిన కేసు విషయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ బెయిల్ రద్దుపై హన్మకొండ 4వ మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో పోలీసులు వేసిన పిటిషన్‌పై మంగళవారం వాదనలు జరిగాయి. సాయంత్రం వరకు వాదనలు జరిగిన అనంతరం తదుపరి విచారణ కోసం న్యాయమూర్తి బుధవారానికి వాయిదా వేశారు.

ధరణి అమలు తీరుపై హైకోర్టు ఆగ్రహం

- సీసీఎల్ఏ హామీతో రిజర్వులో ఉత్తర్వులు

నవతెలంగాణ -హైదరాబాద్

'ధరణి'లో ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులపై మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ విచారణ జరిపారు. నిన్న ఆదేశాల జారీకి అనుగుణంగా చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్(సీసీఎల్ఏ) నవీన్ మిట్టల్ విచారణకు స్వయంగా హాజరయ్యారు. ధరణి పోర్టల్‌లో నమోదైన సేల్ డీడ్‌ల సర్టిఫైడ్ కాపీలను జారీ చేయడం లేదని దాఖలైన అనేక కేసుల్లో కౌంటర్ పిటిషన్ దాఖలు చేయకపోవడం, సమస్యల పరిష్కారానికి చర్యలేమిటో చెప్పకపోవడంపై హైకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. సర్టిఫైడ్ కాపీలను ఎందుకు జారీ చేయడం లేదని ప్రశ్నించింది. సర్టిఫైడ్ కాపీలు ఇవ్వకుండా దరఖాస్తులను రిజక్ట్ అనే పేరుతో ఎందుకు తిరస్కరిస్తున్నారని కూడా ప్రశ్నించింది. కొన్ని సమస్యలను వారం, మరికొన్ని 45 రోజుల్లో పరిష్కరించాలని నిబంధనల్లో ఉన్నప్పటికీ ఎందుకు అమలు చేయలేదని నిలదీసింది. ఎలాంటి కారణాలు తెలుపకుండా సర్టిఫైడ్ కాపీలు కోరిన వారికి నిరాకరిస్తూ మెసేజ్ పంపడంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఈ సమస్యలు ఎప్పటిలోగా పరిష్కరిస్తారని నవీన్ మిట్టల్‌ను ప్రశ్నించింది.

కండ్లకు గంతలు కట్టుకుని వీఓఏల నిరసన

నవతెలంగాణ- విలేకరులు

తమ సమస్యలపై సమ్మె చేస్తున్న ఐకేపీ వీఓఏలు మంగళవారం పలు రూపాల్లో నిరసన తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వీవోఏల దీక్షకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య సంఘీభావం తెలిపారు. కరకగూడెం, భద్రాచలంలో కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. పాల్వంచలో సీఐటీయూ జిల్లా కోశాధికారి పద్మ సంఘీభావం తెలిపారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలకేంద్రంలో వీవోఏలు కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సమ్మెకు సీపీఐ(ఎం), టీడీపీ, బీఎస్పీ, ఎమ్మార్పీఎస్, రజక సంఘాల నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. నాంపల్లి, మర్రిగూడ మండలాల్లో వీఓఏలు కండ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు.

వివేకా హత్య కేసులో రిట్లపై విచారణ వాయిదా

నవతెలంగాణ -హైదరాబాద్

మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కడప వైసీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ బుధవారానికి వాయిదా పడింది. ఇదే కేసులో ఇటీవల ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆర్డర్ కాపీ అందనందున విచారణను వాయిదా వేస్తున్నట్టు జస్టిస్ సురేందర్ చెప్పారు. వివేకా హత్య కేసులో నిందితుడు ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలని సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు మరో జడ్జి జస్టిస్ సుమలత విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

కింది కోర్టు ఇచ్చిన బెయిల్‌ను ఏపీ హైకోర్టు రద్దు చేసేందుకు అంగీకరించలేదనీ, ఇప్పుడు అదే తరహా సీబీఐ పిటిషన్‌లో తెలంగాణ హైకోర్టు విచారణ చేయాల్సిన అవసరం లేదని గంగిరెడ్డి న్యాయవాది చెప్పారు. సాక్ష్యాలను తారుమారు చేసే ప్రమాదం ఉందనీ, బెయిల్‌రద్దు చేయాలని సీబీఐ లాయర్ వాదించారు.

ప్రపంచ సమరం

ప్రచ్ఛన్న యుద్ధకాలంనాటి స్థాయికి ఐరోపా రక్షణ వ్యయం

న్యూయార్క్: స్టాక్హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రిసెర్చ్ ఇన్స్టిట్యూట్(సిప్రి) తయారుచేసిన తాజా వార్షిక నివేదిక ప్రకారం 2022లో ఉక్రెయిన్ యుద్ధ ప్రభావంతో ఐరోపా సైనిక వ్యయం 30 ఏండ్లలో ఎన్నడూ పెరగనంతగా పెరిగింది. ఇదే కాలంలో ప్రపంచ సైనిక వ్యయం 3.7శాతం పెరిగింది. దీని వాస్తవ విలువ 2.24ట్రిల్లియన్ డాలర్లు. గత సంవత్సరంలో ప్రపంచం మొత్తం చేసిన సైనిక వ్యయంలో అత్యంత సైనిక వ్యయం చేసిన మూడు దేశాల- అమెరికా, చైనా, రష్యా వాటా 56 శాతంగా ఉంది. వీటిలో అమెరికా చేస్తున్న సైనిక వ్యయం తన భౌగోళిక రాజకీయ ప్రత్యర్థులకు అంద నంత దూరంలో ఉంది. అమెరికా 877బిలియన్ డాలర్లు, చైనా 292 బిలియన్ డాలర్లు, రష్యా కేవలం 86.4 బిలియన్ డాలర్లు రక్షణ రంగంపై వెచ్చిస్తున్నాయని సిప్రి నివేదిక పేర్కొంది. అయితే అన్ని దేశాలకంటే ఎక్కువగా ఐరోపా సైనిక వ్యయం 13శాతం పెరిగింది. ఇది ఉక్రెయిన్ యుద్ధం



కారణంగా రేకెత్తిన భయాందోళనల వల్ల జరిగివుంటుందని సిప్రి నివేదిక అభిప్రాయపడింది. మధ్య, పశ్చిమ ఐరోపా దేశాల సైనిక వ్యయం 345బిలియన్లకు చేరింది. ఇది 1989 లో ప్రచ్ఛన్న యుద్ధం ముగిసేనాటికి చేసిన సైనిక వ్యయాన్ని మించిపోయింది. ఈ మధ్య కాలంలో చేసిన 2013నాటి సైనిక వ్యయంతో పోలిస్తే 2022లో 30 శాతం దాకా పెరి గింది. దేశాలవారీగా పెరిగిన సైనిక వ్యయాన్ని తీసుకుంటే ఫిన్లాండ్ 36శాతం, లిథ్యూనియా 27శాతం, స్వీడెన్ 12శాతం తమతమ సైనిక వ్యయాన్ని పెంచుకున్నాయి.

అమెరికా పెంచిన సైనిక వ్యయంలో గణనీయ భాగం ఉక్రెయిన్‌కు అందిస్తున్న ఆయుధ సరఫరా రూపంలో ఉంది. ప్రచ్ఛన్న యుద్ధం తరువాత గత సంవత్సరం అమెరికా ఉక్రెయిన్‌కు ఇచ్చిన 19.9బిలియన్ డాలర్ల సైనిక సహాయం మరేదేశానికీ ఇవ్వలేదు. అయితే అమెరికా మొత్తం సైనిక వ్యయంలో ఈ సహాయం వాటా కేవలం 2.3శాతం మాత్రమేనని సిప్రి నివేదిక వివరించింది.

క్షీణిస్తున్న భద్రతా వాతావరణంలో, సమీప భవిష్యత్తులో పరిస్థితులు మెరుగుపడవని భావించి దేశాలు తమతమ సైనిక సంపత్తిని పెంచుకుంటున్నాయి. దేశాల రక్షణ వ్యయం ఇలా పెరుగటం మనం భద్రతలేని ప్రపంచంలో బతుకుతున్నామనటానికి గుర్తు అని సిప్రిలో సీనియర్ పరిశోధకుడిగా పనిచేస్తున్న డాక్టర్ నన్ టియాన్ అన్నాడు.

ఎదురు తన్నిన ఆంక్షలు!

న్యూయార్క్ : ఉక్రెయిన్ పైన రష్యా యుద్ధం ప్రకటించాక అమెరికా నాయకత్వంలోని పాశ్చాత్య దేశాలు రష్యాపైన 10 సార్లకుపైగా ఆక్షలను విధించాయి. ఈ ఆంక్షలతో పాశ్చాత్య దేశాలు ఊహించినట్టు రష్యా ఆర్థిక వ్యవస్థ కుదేలయిపోకపోగా ఆంక్షలు విధించిన దేశాలపైనే వాటి దుష్ప్రభావం పడిందని రష్యా ఆర్థిక మంత్రి అంటన్ సిల్యూనోవ్ ఒక వార్తాసంస్థతో మాట్లాడుతూ అన్నాడు. ఈ ఆంక్షలన్నీ ఎదురుతన్నాయని, పాశ్చాత్య దేశాలలో జీవన వ్యయం తీవ్రంగా పెరిగి సంక్షోభం ఏర్పడిందని, ద్రవ్యోల్బణం విపరీతంగా పెరుగుతున్నదనీ, జీవన ప్రమాణాలు క్షీణిస్తున్నాయని ఆయన చెప్పాడు. కాబట్టి ఏమాత్రం దూరదృష్టిలేకుండా రష్యాపైన విధించిన ఆంక్షల పరంపరతో పాశ్చాత్య దేశాల ఆర్థిక వ్యవస్థలే దెబ్బతింటున్నాయి.

పాశ్చాత్య దేశాల ఆంక్షల ప్రభావం సాధ్యమైనంత తక్కువగా ఉండేలా చేయటానికి రష్యా వ్యూహాత్మకంగా ఒక స్వతంత్ర విధానంతో ఆంక్షలను ఎదుర్కొంటోంది. ద్రవ్యోల్బణాన్ని తగ్గించటానికి పటిష్టమైన బడ్జెట్ నియమాలను ప్రవేశపెట్టింది. అలాగే మీర్ కార్డు, జాతీయ చెల్లింపుల కార్డు వ్యవస్థను రూపొందించి రష్యా ఒక స్వతంత్ర చెల్లింపుల విధానాన్ని ప్రవేశపెట్టింది. వీటితోపాటు సాంకేతిక సార్వభౌమత్వాన్ని సాధించే ప్రయత్నం చేస్తోంది. ఇటువంటి విధానాన్ని అవలంబించటంవల్లనే పాశ్చాత్య దేశాలలోకంటే రష్యాలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత తక్కువగా ఉన్నాయి. నిజ వేతనాలు పెరుగుతున్నాయి.



అంతర్జాతీయ భౌగోళిక-రాజకీయ సమీకరణాలలో మార్పుజరిగిన నేపథ్యంలో అభివృద్ధి చెందిన దేశాలు వర్ధమాన దేశాలపైన అనేక నియమనిబంధనలను పెడుతున్నాయి. ఆంక్షలను విధిస్తున్నాయి. వీటివల్ల డాలర్, యూరోలపైన ప్రపంచంలో విశ్వాసం సన్నగిల్లుతోందని రష్యా ఆర్థిక మంత్రి ప్రకటించాడు. దీనిలో భాగంగానే రష్యా కూడా "తేలికగా మారకం చేసుకోగలిగే" కరెన్సీల నుంచి నమ్మదగిన కరెన్సీలలో తన లావాదేవీలను నడుపుతోంది. ఇక్కడ నమ్మదగిన కరెన్సీలు అంటే సరఫరా చేసిన సరుకుల, సేవలకు సంబంధించిన డబ్బును ఎటువంటి ఇబ్బందీ లేకుండా బదిలీచేసే అవకాశంవున్న కరెన్సీలు అని అర్థం. దీనిలో భాగంగానే రష్యా, చైనాల మధ్య జరుగుతున్న లావాదేవీలలో 70శాతం తమతమ కరెన్సీలలోనే జరుగుతోంది. ఇటువంటి ద్వైపాక్షిక వాణిజ్య లావాదేవీలు ఎంతగా పెరిగితే ఆమేరకు అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్, యూరోల ప్రాబల్యం తగ్గుతుంది.

ఉపాధ్యాయులే నిజమైన జాతి నిర్మాతలు

- మోటివేషనల్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేంద్రరావు



నవతెలంగాణ-ముషీరాబాద్

ఉపాధ్యాయులే నిజమైన జాతి నిర్మాతలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేంద్రరావు అన్నారు. గురువారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో టీచర్స్ వర్క్ షాప్ -2023 నిర్వహించారు. బాల సాహితీవేత్త చొక్కాపు వెంకటరమణ, ఎస్‌సీఈఆర్‌టీ కరికులం కమిటీ మెంబర్ సీఏ ప్రసాద్, ఆకెళ్ల రాఘవేంద్రరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులది గౌరవప్రదమైన బాధ్యతాయుతమైన వృత్తి అని, విద్యార్థుల జీవితాన్ని సరైన దారిలో మలిచేది గురువులేనని చెప్పారు. అధ్యాపకులకు నిరంతర అభ్యాసం ఎంతో ముఖ్యమని, జ్ఞానాన్ని పంచడంతోపాటు విజ్ఞానాన్ని పెంచుకుంటూ పిల్లలకు బోధించాలన్నారు. పిల్లలను ఆలోచించే వాళ్ళుగా తయారు చేయడం, మారుతున్న సిలబస్‌కనుగుణంగా అవగాహన పెంచుకోవడం ఎంతో అవసరమని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పుట్టుకతోనే పిల్లలు టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు కూడా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోకపోతే కాలం వెనక్కి నెట్టివేస్తుందని చెప్పారు. విద్యార్థులకు సిలబస్‌తోపాటు సమాజంపై అవగాహన కలిగించేలా బోధించాలన్నారు. చదువుతోపాటు ఆట, పాట, ఇంగ్లీషు, తెలుగు భాషా పరిజ్ఞానం పెంచుకోవడానికి తగిన సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎన్.సోమయ్య, నాయకులు శాంతారావు, మమతా, రూప రుక్మిణి, సుజావతి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీకి అభినందనలు

- కాంగ్రెస్ ఓబీసీ సమావేశంలో వీహెచ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీసీగణన చేస్తామంటూ హామీనిచ్చిన ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీకి కాంగ్రెస్ ఓబీసీ నేతలు అభినందనలు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాభవన్‌లో మాజీ ఎంపీ వి. హనుమంతరావు అధ్యక్షతన ఓబీసీ నేతలు పొన్నాల లక్ష్మయ్య, జి. నిరంజన్, సంగిశెట్టి జగదీష్, లక్ష్మణ్ యాదవ్, రాజ్ ఠాకూర్, నగేష్ ముదిరాజ్, నూతి శ్రీకాంత్, సునీతారావు, మెట్టు సాయికుమార్, శ్రీకాంత్ తదితరులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ కులగణన చేపట్టాలనీ, వారికి బీసీ రిజర్వేషన్లు పెంచాలంటూ రాహుల్‌గాంధీ డిమాండ్ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీకులగణన జరిపితే జనాభా సంఖ్య ప్రకారం రిజర్వేషన్లు పెరిగి వారికి న్యాయం జరుగుతుందని చెప్పారు. ఇదే అంశంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే కూడా ప్రధాని మోడీకి లేఖ రాసిన విషయాన్ని వీహెచ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

సమన్వయంతోనే రాష్ట్రాభివృద్ధి : సందీప్‌కుమార్ సుల్తానియా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అధికారులు సమన్వయంతో పనిచేసి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశించారు. మంగళవారం రాజేంద్రనగర్‌లోని తెలంగాణ గ్రామీణ అభివృద్ధి సంస్థలో పంచాయతీ అధికారులు, జెడ్పీ సీఈఓలు, డీఆర్‌డీఓలకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను మరింత పకడ్బందీగా అమలు చేయడంపై ఏర్పాటు చేసిన ఓరియెంటేషన్ ప్రోగ్రాం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. నాలుగేండ్లుగా ఉద్యమంగా అధికారులు పనిచేయడం వల్లనే గ్రామాల రూపురేఖలు మారాయని చెప్పారు. ఇదే స్ఫూర్తితో అధికారులు పనిచేయాలని సూచించారు. తడి, పొడి చెత్త సేకరణ, డంపింగ్ యార్డుల ద్వారా వర్మికంపోస్టు తయారీ ద్వారా ఆదాయం పొందేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి అవార్డులుసాధించిన గ్రామపంచాయతీలకు సంబంధించి డీపీఓలు, జెడ్పీ సీఈఓలు, డీఆర్డీఓలకు ప్రశంసాపత్రాలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ హన్మంతరావు అందజేశారు.

విద్యాకాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం : పీడీఎస్‌ఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో తీవ్రమవుతున్న విద్యా కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడుదామని ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (పీడీఎస్‌ఎఫ్) పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవుల నాగరాజు, కుమార్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కరోనా సంక్షోభాన్ని కారణంగా చూపి హేతుబద్ధీకరణ పేరుతో ఎన్‌సీఈఆర్టీ తొమ్మిది, పదో తరగతి సైన్స్ పాఠ్యపుస్తకాల నుంచి చార్లెస్ డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం శాస్త్రీయ దృక్పథాన్ని, హేతుబద్ధమైన ప్రపంచ దృక్పథాన్ని పెంపొందించ డానికి దోహదపడుతుందని తెలిపారు. 11, 12వ తరగతి సామాజిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం పాఠ్యాంశాల్లో నుంచి మహాత్మాగాంధీ హత్య, హిందూ ముస్లింల ఐక్యత, గుజరాత్ అల్లర్లు వాటి పరిణామాలు, ఎమర్జెన్సీ పాఠాలను, 12వ తరగతి చరిత్ర పుస్తకంలో నుంచి మొఘల్ సామ్రాజ్యం పాఠ్యాంశాన్ని తొలగించిందని తెలిపారు.

రాష్ట్రంలో 52 కరోనా కేసులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మంగళవారం ఒక్క రోజే 52 కరోనా కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కోవిడ్ స్టేటస్ బులెటిన్ విడుదల చేసింది. 52 మంది కరోనా నుంచి కోలుకున్నారు. 363 యాక్టివ్ కేసులున్నాయి. కరోనా అనుమానిత లక్షణాలున్న 7,006 మందికి టెస్టులు చేయగా వారిలో 0.76 శాతం మందిలో కోవిడ్-19 ఉన్నట్టు ఫలితాల్లో వెల్లడైంది.

సమస్యల తీవ్రత వల్లే...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యత : తెలంగాణ రైతు సంఘం సమావేశంలో సారంపల్లి, సాగర్

రైతులు ఇతర రంగాలవైపు పోతున్నారు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



వ్యవసాయ రంగంలో నెలకొన్న సమస్యల తీవ్రత వల్లే రైతులు ఇతర రంగాల వైపు పోతున్నారని తెలంగాణ రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ లు ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లారెడ్డి, సాగర్ మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కరిస్తామంటూ హామీలిస్తున్న పాలకులు అధికారంలోకి రాగానే వాటిని మరిచిపోతున్నారని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక చేసిన అప్పులు తీరక రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది దేశవ్యాప్తంగా 12,600 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. వారి కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామనీ, బీమా సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పే ప్రభుత్వాలు రైతుల ఆత్మహత్యలను ఎందుకు నివారించలేక పోతున్నాయని ప్రశ్నించారు. పాత అప్పుల కింద బ్యాంకులు రైతులకిచ్చే రుణాలు జమకట్టు కుంటున్నాయని చెప్పారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు ప్రయివేటు వ్యాపారుల దగ్గర అధిక వడ్డీలకు అప్పులు తీసుకుంటున్నారని గుర్తు చేశారు. విత్తనాలు, పురుగుమందుల్లో కల్తీ, రసాయనిక ఎరువుల ధరలపై ఇచ్చే సబ్సిడీలు ఎత్తేయడం మూలంగా రైతులపై అధిక ధరల భారం పడుతున్నదని చెప్పారు. అన్ని రంగాల్లో కార్పొరేట్లు చొరబడినట్టుగానే వ్యవసాయ రంగాన్ని కూడా ఆయా కంపెనీలకు కట్టబెట్టేందుకే కేంద్ర సర్కారు రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చిందన్నారు. రైతు ప్రతిఘటనను చూసి విధిలేని పరిస్థితుల్లో ఆ చట్టాలను రద్దు చేసిందన్నారు. ఢిల్లీ రైతాంగ స్ఫూర్తితో బలమైన రైతాంగ ఉద్యమాన్ని నిర్మించాలని ఈసందర్భంగా వారు పిలుపునిచ్చారు. రైతులకు అన్ని రకాల విత్తనాలు, ఎరువులను, పనిముట్లను ప్రభుత్వమే సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల నర్సింహారెడ్డి, జూలకంటి రంగారెడ్డి, ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, పి.జంగారెడ్డి, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మాదినేని రమేష్, బుర్రి శ్రీరాములు, సహాయ కార్యదర్శులు మూడ్ శోభన్, కందాల ప్రమీల, బొంతు రాంబాబు, కున్‌రెడ్డి నాగిరెడ్డి, డి.బాల్‌రెడ్డి, అన్నవరపు సత్యనారాయణ, మాటూరి బాలరాజు గౌడ్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, ఎండీ గఫూర్, పల్లపు వెంకటేష్ తదితరులు ఉన్నారు.

యేటా రెండు కోట్ల ఉద్యోగాలేవీ..?

- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. ఒకే దఫాలో రూ.2 లక్షల రుణమాఫీ : సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

యేటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని ప్రధాని మోడీ చేసిన ప్రకటన గురించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ మాట్లాడకుండా అధికారంలోకి రాగానే తెలంగాణలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని మాట్లాడటం విడ్డూరమని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం హన్మకొండ జిల్లాలో పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జీఎస్టీని తీసుకొచ్చి సామాన్యులు బతికే పరిస్థితి లేకుండా చేసిందన్నారు. ప్రతి ఒక్కరి ఖాతాలో వేస్తామన్న రూ.15 లక్షలు, నోట్ల రద్దుతో వెలిసి తీస్తామన్న నల్లధనం ఏమైందని ప్రశ్నించారు. మార్కెట్‌లో నిత్యావసర సరుకుల కృత్రిమ కొరతను సృష్టించి రేట్లు పెంచి అమ్ముకునే విధంగా అంబానీ, అదానీలకు ప్రధాని మోదీ అవకాశం కల్పిస్తున్నారన్నారు. అదానీ ఆర్థిక నేరాన్ని గుట్టురట్టు చేసిన హిండేన్ బర్గ్ సంస్థ ఇచ్చిన నివేదిక గురించి ప్రశ్నించిన రాహుల్ గాంధీని పార్లమెంటుకు రాకుండా కేంద్ర ప్రభుత్వం చేసిన కుట్రలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. కమిషన్ వేసి కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు శాతం ముస్లిం మైనార్టీలకు రిజర్వేషన్లను కల్పించగా, తెలంగాణలో దాన్ని 12 శాతానికి పెంచిన కేసీఆర్.. దాన్ని రద్దు చేస్తామన్న అమిత్‌షా వ్యాఖ్యాలను సీఎం ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వకపోయినప్పటికీ వందలసార్లు ఢిల్లీకి వెళ్లిన సీఎం కేసీఆర్ మనకు రావాల్సిన హక్కులను అడగకుండా స్వార్ధ రాజకీయాల కోసం రాష్ట్ర పునర్విభజన హక్కులను పణంగా పెడుతున్నారని విమర్శించారు.

తెలంగాణ ప్రభుత్వం వెంటనే బీసీలకు సబ్‌ప్లాన్ చట్టం తీసుకురావాలని కోరారు. తెలంగాణలో 54 శాతంగా ఉన్న బీసీలకు బడ్జెట్‌లో రూ.1.50 లక్షల కోట్లు కేటాయించాల్సి ఉండగా, కేవలం రూ.5 వేల కోట్లు మాత్రమే కేటాయించి బీసీలను ఉద్దరిస్తున్నామంటే ఎలాని ప్రశ్నించారు. తెలంగాణ రెండో రాజధానిగా వరంగల్ అభివృద్ధి చెందుతుందని ఆశించినా.. స్మార్ట్ సిటీగా ప్రకటించినప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవేలో 3 వేల ఎకరాలు కోల్పోతున్న నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఒకే దఫా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. టెక్స్‌టైల్స్ పార్క్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను పంపిణీ, నిరుపేదలు సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకుంటే రూ.5 లక్షలు ఇస్తామని తెలిపారు.

ప్రజాస్వామ్యం పరిరక్షించబడాలంటే కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని స్పష్టంచేశారు. సమావేశంలో హన్మకొండ డీసీసీ అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డి, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, టీపీసీసీ ఉపాధ్యక్షులు, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి. శోభారాణి, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ కరెన్సీ చలామణి చేస్తున్న

అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

- 13 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- రూ.30.68లక్షల నకిలీ కరెన్సీ, రూ.60 వేల నగదు, 13 మొబైల్ ఫోన్లు స్వాధీనం
- వివరాలను వెల్లడించిన సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీందర్



నవతెలంగాణ-మియాపూర్

నకిలీ కరెన్సీ చలామణి చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను సైబరాబాద్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. మొత్తం 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.30.68 లక్షల నకిలీ కరెన్సీ, రూ.60 వేల నగదు,13 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను రంగారెడ్డి జిల్లా సైబరాబాద్‌లోని సీపీ కార్యాలయంలో సీపీ స్టీఫెన్ రవీందర్ మీడియాకు వెల్లడించారు. నకిలీ నోట్ల తయారీకి సంబంధించిన విషయంపై పోలీసులకు రెండు నెలల కిందట ఫిర్యాదు అందడంతో పోలీసులు విచారణ చేప ట్టారు. ప్రధానంగా 13 మంది సభ్యులు ఉన్న ఈ ముఠా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, తమిళ నాడు కేంద్రాలుగా చేసుకొని దందా నడిపిస్తున్నారు. 500 నోట్లను జిరాక్స్ ప్రింటింగ్ ద్వారా ప్రింట్ తీసి సాయంత్రం వేళలో ఈ నోట్లను మార్చేవారు. నోట్ల మార్పిడికి ప్రధానంగా చిన్న, మధ్యతరగతి షాప్స్, స్ట్రీట్ వేడర్స్ వారిని లక్ష్యంగా చేసుకొని మార్కెట్లోకి తీసుకొచ్చారు. వీరిలో కొంత మంది బల్క్ డబ్బును కూడా లక్ష రూపాయలు ఒరిజినల్ కరెన్సీ ఇస్తే ఐదు లక్షలు ఫేక్ కరెన్సీని మారుస్తున్నారు. హైదరాబాద్, సైబరాబాద్ కమిష నరేట్ పరిధిలో సాయంత్రం వేళలో నడుస్తున్న షాప్స్ ప్రధానంగా చేసుకోవడం, అమాయక ప్రజలు వీటిని గుర్తించడంలో లోపాలని లక్ష్యంగా చేసుకొని ఈ కరెన్సీ పెద్ద ఎత్తున చలామణి చేశారు. రాజ స్థాన్‌కు చెందిన కొంటె రాజేష్, త్రిపురకు చెందిన నెలదాస్ ఈ ఇద్దరు మిగతా కొంతమందిని అనుచరులుగా ఏర్పాటు చేసుకొని ఈ నకిలీ కరెన్సీ దందాను సాగించారు. రెండు రోజుల కిందట రాజేష్ ఓ హెూటల్ రూంను ఖాళీ చేస్తూ నకిలీ కరెన్సీ ఇచ్చాడు. ఆ హెూటల్ సూపర్‌వైజర్‌కు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రాజేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతన్ని విచారించగా మిగతా సభ్యుల వివరాలు చెప్పడంతో వారిని మంగళవారం అరెస్టు చేశారు. ప్రజలంతా నకిలీ నోట్ల విషయంలో జాగ్ర త్తగా ఉండాలని ముఖ్యంగా సాయంత్రం పూట వ్యా పారం చేసే వ్యక్తులు ఇలాంటి మోసాల పట్ల అప్రమ త్తంగా ఉండాలని సీపీ సూచించారు. సమా వేశంలో ఎస్ఓటీ ఏసీపీ శ్యాంబాబు, ఎస్‌టీఎఫ్, క్రైమ్ డీసీపీ కలమేశ్వర్, మాదాపూర్ డీసీపీ శిల్పావళి, ఆంజనే యులు, రాజగోపాల్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య యువతికి వేధింపుల వల్లే...



నవతెలంగాణ- నస్పూర్

ప్రేమ పేరుతో యువతిని తరచూ వేధించడంతోపాటు.. ఆమె వివాహబంధం విచ్ఛిన్నమవ్వడానికి కారణమైన యువకుడిని బాధిత కుటుంబ సభ్యులు దారుణంగా కొట్టి చంపారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా జైపూర్ మండలం ఇందారం గ్రామంలోని గంగపుత్ర కాలనీలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ముష్కే మహేష్(25) అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమ పేరుతో వేధించేవాడు. విషయం తెలియడంతో యువతికి తల్లిదండ్రులు మరో వ్యక్తితో వివాహం చేశారు. ఆ తర్వాత కూడా యువకుడు వెంటపడుతూ వేధించాడు. అది తెలిసిన ఆమె భర్త విడాకులు ఇవ్వడంతోపాటు, ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రస్తుతం యువతి తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. తమ కూతురు జీవితం ఆగం కావడానికి కారణమైన యువకున్ని తల్లిదండ్రులు, సోదరుడు కలిసి అతన్ని పట్టుకున్ని కొట్టారు. తలపై రాయితో మోదడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. జైపూర్ ఏసీపీ నరేందర్, శ్రీరాంపూర్ సీఐ రాజు సంఘటన స్థలానికి చేరుకొని హత్యకు గల కారణాలను పరిశీలించారు. విచారణ చేపట్టి, నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని తెలిపారు.

రవీంద్ర భారతిలో ఒకటో తేదీన మేడే ఉత్సవాలు

పాల్గొనున్న సీఎం కేసీఆర్, మంత్రి మల్లారెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మే ఒకటో తేదీన రవీంద్రభారతిలో మేడే ఉత్సవాలను నిర్వహించనున్నారు. పదిగంటలకు జరిగే ఆ కార్యక్రమంలో సీఎం కేసీఆర్, కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, కార్మిక శాఖ ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులను పాల్గొననున్నారు. ఈ మేరకు సమాచార, పౌర సంబంధాల శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది.

డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పోస్టు నుంచి డాక్టర్ జి.శ్రీనివాసరావును తప్పించాలి

-సీఎస్‌కు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదే పదే తన తప్పుడు ప్రకటనలతో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ హెూదాను దిగజారుస్తున్న డాక్టర్ జి.శ్రీనివాసరావును ఆ హెూదా నుంచి తప్పించాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఫోరం కార్యదర్శి యం.పద్మనాభరెడ్డి మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి లేఖ రాశారు. ఆరోగ్య కార్యక్రమాలపై నమ్మకం, అనుభవం ఉన్న వ్యక్తిని డీహెచ్ పోస్టులో నియమించాలని విజ్ఞప్తి చేశారు. శ్రీనివాసరావు ప్రభుత్వ కార్యక్రమాలను కించపరిచేలా ప్రకటనలు చేసి ప్రభుత్వానికే చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

సీఎం ఇలాకాలో సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

- గ్రామాలను చుట్టుముట్టిన పోలీసులు
- పోలీసుల కండ్లుగప్పి రోడ్డుపై బైటాయించిన రైతులు



నవతెలంగాణ కొండపాక

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం కొండపాక మండలం బందారం, దర్గా, అంకిరెడ్డిపల్లి గ్రామాలకు సాగునీరు అందించాలని కొన్నేండ్లుగా నాయకులు, అధికారులు, మంత్రి హరీశ్‌రావుకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోవడంతో గ్రామాల రైతులు ఏకమై మంగళవారం దుద్దెడ వేలికట్ట చౌరస్తాల్లో వేరువేరుగా రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు రైతులను రోడ్డు ఎక్కకుండా బందారం సబ్ స్టేషన్ వద్ద పోలీసు వ్యాన్‌తో భారీ పికెటింగ్ ఏర్పాటు చేశారు. పోలీసుల కళ్లుగప్పి రైతులు దుద్దెడకు చేరుకొని రోడ్డుపై బైటాయించారు. దాంతో పోలీసులు దుద్దెడకు చేరుకొని రైతులను అరెస్టు చేసి త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆలస్యంగా చేరుకున్న మరికొందరు రైతులు అరెస్టును నిరసిస్తూ కుక్కునూరు వెళ్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చేర్యాల చౌరస్తా వద్ద రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న త్రీ టౌన్ పోలీసులు ఆగమేఘాల మీద చేర్యాల చౌరస్తాకు చేరుకొని ధర్నా చేస్తున్న రైతులను అరెస్టు చేసి కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఎనిమిదేండ్ల నుంచి తపాసపల్లి రిజర్వాయర్ నుంచి నీరు అందిస్తామని ప్రభుత్వం హామీ ఇస్తూ ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టి, ఎన్నికల అనంతరం ఆ హామీని గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తపాసపల్లి నుంచి మర్పడగ వరకు కాలువను తవ్వి వదిలేశారని కోరారు. మూడేండ్ల కిందట కాలువ పనులు ప్రారంభించినప్పటికీ ఇప్పుడు ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని తెలిపారు. కొండపాక మండలంలో నిర్మించిన మల్లన్న సాగర్ నుంచి నీటిని అందిస్తామని నాయకులు ఎన్నోసార్లు చెప్పినా అమలు చేయడం లేదన్నారు. బందారం చుట్టుపక్కల గ్రామాలకు సాగునీరు అందిస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి నియోజకవర్గంలోని మూడు గ్రామాలకు నీరు అందించకపోవడం ఏంటని ప్రశ్నించారు. అనంతరం అంకిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్, ప్రస్తుత సర్పంచ్ భర్త బడెకోల్ నర్సింలు మాట్లాడుతూ.. అంకిరెడ్డిపల్లి, బందారం, దర్గా గ్రామాల నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు భారీ మెజార్టీని అందించి రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నామని, ఏ ఎన్నికల్లో పిలుపునిచ్చినా ముందుండి ఓట్లు వేయించామన్నారు. రైతుల కోసం కాకుంటే ఇంకెవరి కోసం పని చేస్తారని, సాగునీరు అందించడానికి ఇంత సమయం పడుతుందా అని ప్రశ్నించారు. నాయకులు ఎప్పుడూ రైతుల వెంబడి ఉంటారని, నేను రైతుల వెంబడే ఉంటానంటూ రైతుల ధర్నాకు మద్దతు ప్రకటించారు.

తొమ్మిదేండ్ల పాలనలో ప్రజలకు చేసిందేమిటి?

- సీఎం కేసీఆర్‌కు వైఎస్ షర్మిల సూటి ప్రశ్న


నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తొమ్మిదేండ్ల పాలనలో సీఎం కేసీఆర్ ప్రజలకు ఏం చేశారని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. ఆయనకు రాష్ట్రాన్ని పాలించడం చేతకావటం లేదని విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని చంచల్ గూడ జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన ఆమె ఇంటికి చేరుకోగానే విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. బంగారు తెలంగాణ సాధిస్తామంటూ చెప్పిన కేసీఆర్ సచివాలయానికి ఎప్పుడైనా వెళ్లారా? అని నిలదీశారు. రుణమాఫీ, మహిళలకు సున్నా వడ్డీకే రుణాలు, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్ రూం ఇండ్లు, మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్లు తదితర హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని చెప్పారు. ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటి కూడా నిలబెట్టుకోలేదని షర్మిల విమర్శించారు. ప్రతిపక్షాలు గొంతు విప్పితే వారిపై కేసులు పెట్టి.. జైల్లో పెట్టిస్తున్నారని వివరించారు. తాను సిట్ కార్యాలయంలో వినతి పత్రం ఇవ్వడానికి పోతుంటే.. అరెస్ట్ చేయడమేంటని ప్రశ్నించారు. మహిళను అరెస్ట్ చేసే విధానం ఇదేనా? అని నిలదీశారు. ప్రశ్నించే స్వేచ్ఛ ప్రతిపక్షాలకు లేదా? అని ప్రశ్నించారు. పోలీసులు తనపై దాడులు చేస్తారనే ఉద్దేశంతోనే తోసేశానని షర్మిల అన్నారు. అంతే తప్ప తాను పోలీసులపై దాడి చేయలేదని స్పష్టం చేశారు. ఎడిటింగ్ వీడియోలతో తనపై తప్పుడు కేసులు పెట్టారని తన తల్లి విజయలక్ష్మి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు దారుణమన్నారు. మాజీ సీఎం సతీమణి అనే కనీస గౌరవం కూడా ఆమెకు ఇవ్వలేదన్నారు. తనను ఎంత తొక్కాలని చూస్తారో.. అంత పైకి లేస్తానని షర్మిల ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

డాక్టర్లు లేరు...రోగులకు వైద్యసేవలందించేదెలా?

ఏఆర్‌టీ సెంటర్లలో 14 మంది రాజీనామా

- ఫిబ్రవరి నుంచి ఖాళీగా ఉన్న వైనం
- పీఎల్ హెచ్‌ఐవీ రోగులకు తీరని కష్టాలు
- కొత్త ఏపీడీ వచ్చినా... మారని శాక్స్ పనితీరు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిర్లక్ష్యపు నీడ తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలిని వీడడం లేదు. అధికారులు మారితే పనితీరులో మార్పు వస్తుందని ఆశించినా అలాంటిదేమి కనిపించడం లేదు. కొత్త అధికారులు వచ్చినా అదే ధోరణి కొనసాగుతుండటంతో హెచ్‌ఐవీ రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమాజం నుంచి వివక్షను ఎదుర్కొంటూ నిత్యం మందులు వాడుతూ డాక్టర్ల సలహాలను తీసుకుంటూ ఆయుష్షును పెంచుకుంటున్న వారికి తగిన తోడ్పాటునందించాల్సి ఉంటుంది. మిగిలిన రోగులకు భిన్నంగా వారు ప్రత్యేక మందులు, అవసరాలు కలిగిన నేపథ్యంలో ఆ వ్యాధి వ్యాప్తిని నిరోధించడంతో పాటు రోగులకు తగిన రీతిలో సేవలందించేందుకు జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి (నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ - నాకో) ఏర్పాటైన సంగతి తెలిసిందే. రాష్ట్ర స్థాయిలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి నాకో పరిధిలో పని చేస్తున్నది.

హెచ్‌ఐవీతో నివసిస్తున్న వారిని పాజిటివ్ లివింగ్ విత్ హెచ్‌ఐవీ (పీఎల్ హెచ్‌ఐవీ)గా పిలుస్తుంటారు. రాష్ట్ర నియంత్రణ మండలి వద్ద ఇలాంటి వారు దాదాపు 1.50 లక్షల మందికిపైగా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో కొద్ది (శాతం) మంది ఇప్పటికే మరణించగా, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 80 నుంచి 90 వేల మంది వరకు రెగ్యులర్‌గా ఏఆర్‌టీ సెంటర్ల నుంచి వైద్యసేవలను అందుకుంటున్నారు. వీరి కోసం రాష్ట్రవ్యాప్తంగా 22 ఏఆర్‌టీ సెంటర్లను ఏర్పాటు చేశారు. రోగుల రద్దీని బట్టి పెద్ద సెంటర్లలో ఇద్దరి నుంచి ముగ్గురు వరకు డాక్టర్లుంటారు. 500 పీఎల్‌హెచ్‌ఐవీ రోగులకు ఒక డాక్టరు అందుబాటులో ఉండాలని నాకో నిబంధనలు చెబు తున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ల నోటిఫికేషన్ విడుదల చేయడం, వాటిలో రెగ్యులర్ పోస్టులొచ్చిన 14 మంది (నాకో పరిధిలో కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేసే వైద్యులు) ఈ ఏడాది ఫిబ్రవరిలో తమ పోస్టులకు రాజీనామా చేయడంతో ఖాళీలేర్పడ్డాయి. వీటిని వెంటనే భర్తీ చేయాల్సి ఉంది. గతంలోనూ అలాంటి సంప్రదాయమే కొనసాగింది.

ఏఆర్‌టీ సెంటర్లకు ప్రతి నెలా మందుల కోసం రోగులు వస్తుంటారు. కొన్ని సందర్భాల్లో ఇతరత్రా ఇబ్బందులెదురైతే డాక్టర్లను సంప్రదించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వీరికి నిరంతరాయంగా డాక్టర్లను అందు బాటులో ఉంచాల్సి ఉంటుంది. అయితే గత ఫిబ్రవరి నుంచి పలు ఏఆర్‌టీ సెంటర్లకు చెందిన 14 డాక్టర్ పోస్టులు ఖాళీ అయినా వాటిని భర్తీ చేయకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్నెల్లకు ఒకసారి వైరల్ లోడ్ తదితర పరీక్షలను నిర్వహించి వ్యాధి తీవ్రతను బట్టి మెడికేషన్ ఇస్తుంటారు. అయితే ఒక్కసారిగా నెలల తరబడి డాక్టర్లు అందుబాటులోకి రాకపోవడంతో ఎవరిని సంప్రదిం చాలో అర్థం కావడం లేదని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోస్టుల భర్తీకి సంబంధించిన ఫైల్‌ను కొత్తగా వచ్చిన అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళీధర్, ఇన్‌ఛార్జి ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్వేతా మహంతి దృష్టికే తీసుకెళ్లకపోవడం, పూర్తి స్థాయిలో ప్రాజెక్టు డైరెక్టర్ లేకపోవడం కూడా డాక్టర్ల పోస్టుల భర్తీకి, ఇతర పనుల్లో వేగం తగ్గడానికి కారణంగా తెలుస్తున్నది. ఇప్పటికైనా వైద్యారోగ్యశాఖ మంత్రి జోక్యం చేసుకుని పోస్టుల భర్తీకి ఆదేశించాలని రోగులు కోరుతున్నారు.

జలమండలి మేనేజర్‌ను నిలదీసిన స్థానికులు

నవతెలంగాణ-ముషీరాబాద్



బాగ్ లింగంపల్లి జలమండలి కార్యాలయ పరిధిలోని సూర్య నగర్ బస్తీ, శ్రీరామ్ నగర్ బస్తీ, శ్రీరామ్ నగర్ కామాన్ బస్తీ లో అనేక రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తాగునీరు కలుషితమవుతుందని అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గురువారం రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ రవిచారి జలమండలి అధికారులతో కలిసి బస్తీలలో పర్యటించారు. ఈ సందర్భంగా బాగ్ లింగంపల్లి సెక్షన్ జలమండలి మేనేజర్ జీవనజ్యోతిని బస్తీ వాసులు నిలదీశారు. సమస్య ఉందని చెప్పినా ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చార్మినార్ జోన్‌లో మలేరియా వ్యాధి పూర్తి నిర్మూలన

నవతెలంగాణ-ధూల్‌పేట్



చార్మినార్ జోన్‌లో మలేరియా వ్యాధి పూర్తిగా నిర్మూలించడం జరిగిందని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ మలేరియా విభాగం సీనియర్ ఎంటమాలాజిస్ట్ నామాల శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్ ఆదేశాల మేరకు మంగళ వారం ఎంటమాలజీ ఉద్యోగులు, సిబ్బంది తో కలిసి చార్మినార్ నుండి మదిన సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలేరియా నివారణకు చార్మినార్ జోన్‌లో ప్రజలకు అవగాహన కోసం ప్రచారం చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంటామాలాజిస్టులు, సూపర్ వైజర్స్ , ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత రాజకీయాలను రూపుమాపడానికి మరో ఉద్యమం

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్



నవతెలంగాణ-బంజారాహిల్స్

మత రాజకీయాలకు చరమగీతం పాడటానికి మరో ఉద్యమం తప్పదనీ, ఉద్యమాల గడ్డ తెలంగాణ నుంచి ఆ సాంకేతాలు కేంద్రానికి బలంగా వినిపిస్తున్నాయి కాబట్టే కేంద్రం దుర్మార్గపు చర్యలకు పాల్పడుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మితో కలిసి మంత్రి మాట్లాడారు. మత రాజకీయాలను రూపుమాపడానికి మరో ఉద్యమానికి నాంది పలకాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యకర్తలు బీఆర్ఎస్‌కు ఎలా అండగా ఉన్నారో బీఆర్ఎస్ పార్టీ కూడా దేశవ్యాప్తంగా అదే అండదండలను కొనసాగిస్తూ కార్యకర్తలే పార్టీకి బలమని కేంద్రానికి రుజువు చేయాలని తేల్చి చెప్పారు. దేశవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు పెరిగిపోవడంతో బీజేపీ దాన్ని జీర్ణించుకోలేక పోతుందని తెలిపారు. మరో ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రతి ఒక్కరూ అండగా ఉంటూ ఆయన నాయకత్వాన్ని బలపరుస్తామని వాగ్దానం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి దాసోజు శ్రవణ్, ఉద్యమ నాయకులు మన్నె గోవర్ధన్ రెడ్డి, అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ విప్లవ కుమార్, సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ మన్నే కవిత రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ ప్రారంభం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్/సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ స్పోర్ట్స్ కొచింగ్ క్యాంపును స్పోర్ట్స్ కమిషనర్ విజయలక్ష్మి బేగంబజార్ కార్పొరేటర్ శంకర్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. మంగళవారం ఖైరతాబాద్ జోన్ చాదర్‌ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండ్‌లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ నుండి మే 31వ తేదీ వరకు సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంప్‌లు 37 రోజులపాటు కొనసాగనున్నా యని చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారులు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ సమ్మర్ క్యాంపులలో 44 రకాల క్రీడలలో శిక్షణను ఇవ్వనున్నట్టు తెలిపారు. కోచ్‌లకు క్రీడా సామాగ్రిని అందించారు. ఈ శిక్షణ ఆరేండ్ల నుంచి 16 ఏండ్లలోపు పిల్లలు వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గోషామహల్ సర్కిల్ - 14 డిప్యూటీ కమిషన్ డిడి నాయక్, ఖైరతాబాద్ జోన్ గేమ్స్ ఇన్‌స్పెక్టర్ టి.మాధవి, క్రీడాకారులు, జీహెచ్ఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలేజీ ఆఫ్ టెక్నాలజీలో టెక్నోస్మానియా 2కె 23 ప్రారంభం



నవతెలంగాణ-ఓయూ

టెక్నాలజీ కాలేజీలో మూడు రోజులు పాటు జరగనున్న టెక్నోస్మానియా 2కె 23 వేడుకలు మంగళవారం ప్రిన్సిపాల్ ప్రొ.చింత సాయిలు అధ్యక్షతన ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమ కన్వీనర్ డా. జ్యోతి తాటి మాట్లాడుతూ. టెక్నోస్మానియా కార్యక్రమ షెడ్యూల్ ని ప్రకటించారు. ఏఎమ్ఆర్ మాల్‌లో జరిగిన ఫ్లాష్ మోబ్, క్యాంపస్‌లో చేసిన 3కె రన్ ,బైక్ ర్యాలీ మరియు 25 , 26, 27 తేదీలలో జరగబోవు క్యాటలిసిస్ ఫుడ్ సైనెర్జిస్మ్ టెన్స్రోమా టెక్నాఫార్మా టెక్నో హాస్పిటాలిటీ గురించి వివరించారు. కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొ.రమేష్ కుమార్ కీలకోపన్యాసకర్త ఎంఎంశర్మ గురించి వివరించారు. అనంతర ఎం ఎం శర్మ మాట్లాడుతూ ఉస్మానియాతో, ఐఐసిటితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఇందులో డా.కవిత అయోధ్య పాల్గొన్నారు. ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి ప్రొ.వివి బసవరావు ఫుడ్ సీనరిజం గురించి మాట్లాడబోయే రాఘవరావు గురించి వివరించారు. రాఘవరావు మాట్లాడుతూ ఐఐటీ తిరుపతిలో జరుగుతున్న ఆహార సంబంధ పరిశోధనలపై తెలియజేశారు. ఓయూ వీసీ ప్రొ.రవీందర్ మాట్లాడుతూ యూనివర్సిటీ పరిశోధనలకు పెద్ద పీట వేస్తున్నదని, దానికి అనుగుణంగా వేసుకున్న 21 అంశాల ముఖ్యోద్దేశాలు వివరించి దేశంలోనే ఎన్ఈపీని అమలు పరిచిన మొదటి రాష్ట్ర విశ్వవిద్యాలయం అని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హయవదన , కో- కన్వీనర్ డా. పరశరాములు, కో-ఆర్డినేటర్స్ భాస్కర్, అజిత్‌కుమార్, అభిలాష్ ప్రొపెసర్స్, ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు

ఓయూలో మహాదీక్ష.. అరెస్ట్ చేసిన పోలీసులు

నవతెలంగాణ-ఓయూ



గురుకులాల నియామకాల్లో పురుషులకు జరుగుతున్న అన్యాయంపై మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట పీహెచ్డీ విద్యార్థి కంభంపాటి సత్య నారాయణ ప్రజాపతి ఆధ్వర్యంలో మహాదీక్ష నిర్వహించారు. జీఓ 1274ను రద్దు చేయాలని, హారిజాంటల్ రిజర్వేషన్ అమలు పరచాలని, డెమో రద్దు చేయాలని, .బాయ్స్ స్కూల్స్, కాలేజీల్లో పురుషులకే వందశాతం ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు. తమ డిమాండ్స్ పరిష్కరించకుంటే ఆర్ట్స్ కళాశాల ఉస్మానియా యూనివర్శిటీ ముందు ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. వారిని పోలీసులు అరెస్ట్ చేసి ఓయూ పిఎస్ కు తరలించారు. కార్యక్రమంలో పిడి ఖాన్, శ్రీనివాస్, రాజేందర్, ప్రవీణ్, ఆంజనేయులు, నాగరాజు, నవీన్, కుమార్, వెంకటేష్, ప్రశాంత్, నర్సింహా, రాము, సోమేశ్వర, రాజేష్, మహేందర్, రాజు, రాకేష్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వం ప్రపంచంలోనే అత్యంత క్రూరమైంది

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బోస్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



మోడీ ప్రభుత్వం ప్రపంచంలోనే అత్యంత క్రూరమైందనీ, నియంతృత్వ మోడీ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల దేశంలో పేదరికం, అసమానతలు, అభద్రత భావాలు పెరిగిపోయాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఈ.టి.నరసింహ ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తూ, హానికరమైన విధానాలను అవలంబిస్తున్న బీజేపీ కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలని 'బీజేపీ హటావ్-దేశ్ బచావ్' నినాదంతో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమంలో భాగంగా సీపీఐ శ్రేణులు మంగళవారం లిబర్టీ, హైగహ్ కాలనీ, బషీర్ బాగ్, పూల్ బాగ్, పర్దివాడా, బ్యాండ్ లైన్స్, ఎల్బీ స్టేడియం తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. దుకాణాలు, ఇంటింటికీ తిరిగి బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని కోరారు. ఈ సందర్భంగా వి.ఎస్.బోస్, ఈ.టి.నరసింహ మాట్లాడుతూ అధికారం కోసం బీజేపీ తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు దేశంలో అసత్యాన్ని, విద్వేష రాజకీయాలను ప్రోత్సహిస్తోందన్నారు. మోడీ సర్కార్ సెక్యులర్ భావజాలానికి స్మశాన వాటికగా మార్చి ప్రజలు కలిసి శాంతియుతంగా జీవించలేని భారతదేశాన్ని సృష్టిస్తుందన్నారు. బీజేపీ పాలనలో నిరుద్యోగం, అభివృద్ధి లేమీ, నిత్యావసరాల ధరల పెరుగుదల, కష్టాలు మొదలైన వాటి వల్ల సామాన్యుల జీవన స్థితి మరింత దయనీయంగా మారిందని చెప్పారు. సుస్థిరమైన భారతదేశాన్ని నిర్మించకుండా, ప్రజల కష్టాలను గాలికొదిలేసి ద్వేషం, విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీని వచ్చే ఎన్నికల్లో ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలే జరుగుతున్నాయనీ, పనులు ప్రారంభం కావడం లేదనీ, ముందుకు సాగడం లేదన్నారు. మురికి వాడల్లో నివసిస్తున్న పేదల గుడిసెలను క్రమబద్ధీకరించి పట్టాలు మంజూరు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. హైదరాబాద్ నగరంలో పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇండ్లను తక్షణమే అర్హులైన పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, రాష్ట్ర సమితి సభ్యులు బి.వెంకటేశం, నగర నేతలు నెర్లకంటి శ్రీకాంత్, ఆర్.మల్లేష్, ఆరుట్ల రాజ్ కుమార్, భిక్షపతి యాదవ్, సీహెచ్.జంగయ్య, సిహెచ్.శ్రీనివాస్, లతీఫ్, జె.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కేసీఆర్ లక్ష్యం : మాజీ మంత్రి యాదవ్



నవతెలంగాణ-అంబర్‌పేట

పేదల సంక్షేమం కోసమే తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ మంత్రి సి కృష్ణయాదవ్ అన్నారు. అంబర్ పేటలో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ ఎడ్ల సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్లీనరి జరిగింది. ఈ కార్యక్రమానికి కృష్ణ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి మార్గ దర్శకంగా నిలిచాయన్నారు. అంబర్ పేట నియోజకవర్గంలో గత ఎన్నికల సమయంలో ఎడ్ల సుధాకర్ రెడ్డి నియోజకవర్గ ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఐదు కార్పొరేటర్‌లను, ఎమ్మెల్యేను గెలిపించుకున్న ఘనత సాధించారని అన్నారు. ఎమ్మెల్యే గా గెలిచిన కాలేరు వెంకటేశ్ ఐదు డివిజన్‌లలో రెండే గెలిపించుకున్నారనీ, ఇప్పటికైనా ఎమ్మెల్యే అందర్నీ కలుపుకొని పోవాలని మాజీ మంత్రి సూచించారు. ఎడ్ల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి వస్తున్న ఆదరణను చూసి బీజేపీ నేతలకు వణుకు పుడుతున్నదని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణలో మళ్లీ అధికారం బీఆర్ఎస్‌దేనన్నారు. గరిగంటి రమేష్ మాట్లాడుతూ అంబర్ పేట నియోజకవర్గంలో కొందరు ఒంటెద్దు పోకడ నిర్ణయాల ల్ల పార్టీకి నష్టం చేకూరుతుందని, ఆత్మీయ సమ్మేళనానికి మాజీ కార్పొరేటర్‌లను ఎందుకు పిలవడం లేదంటూ మండిపడ్డారు మాజీ కార్పొరేటర్ పద్మావతి డిపి రెడ్డి మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ ప్రత్యేక దృష్టి అంబర్‌పేట నియోజకవర్గంపై పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు పులి జగన్, గరిగంటి దేవి రమేష్, నగేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ఎజెండా

- డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్
- బీఆర్ఎస్‌కే అవకాశం ఇవ్వాలి : దాసోజు శ్రవణ్

నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగమిస్తోందని, 2014లో తెలంగాణా రాష్ట్రం ఆవిర్భవించాక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల శకం ఆరంభం అయ్యిందని డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సమ్మేళనం మంగళవారం సీతాఫలమండీలో నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ మాట్లాడుతూ. వివిధ కొత్త పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్‌కు దక్కిందని అన్నారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పాటును అవహేళన చేసిన వారికీ సైతం విస్మయం కలిగేలా సంక్షేమ కార్యక్రమాలు అమలులో ఉన్నాయని డిప్యూటీ స్పీకర్ అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ డాక్టర్ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ. తెలంగాణా రాష్ట్రం అన్ని రంగాల్లో విజయం సాధించిందని వివరించారు. భాజపా నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణా రాష్ట్రానికి సహాయ నిరాకరణను అందిస్తోందని విమర్శించారు. అంతకు ముందు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, కార్పొరేటర్లు సామల హేమ, సునిత, కంది శైలజ, లింగాని ప్రసన్న లక్ష్మి లతో కలిసి పార్టీ పతకాన్ని పద్మారావు గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు మోతే శోభన్‌రెడ్డి, లింగాని శ్రీనివాస్, కంది నారాయణ, కరాటే రాజు, సమన్వయకర్తలు జలంధర్ రెడ్డి, రాజ సుందర్ పాల్గొన్నారు. సీనియర్ నాయకుడు గరికపోగుల చంద్రశేఖర్ రూపొందించిన సికింద్రాబాద్ ప్రగతి నివేదికను పద్మారావు గౌడ్ ఆవిష్కరించారు. ప్రముఖ తెలంగాణ కళాకారుడు కనకరాజు బృందం తమ ఆట పాటలతో సభికులను ఆకట్టుకుంది.

'మేడే'ను విజయవంతం చేయండి



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

137 ఏండ్ల క్రితం కార్మికవర్గం తమ హక్కుల సాధన కోసం తమ రక్తాన్ని చిందించి పోరాడి హక్కుల్ని సాధించుకుందినీ, అలాంటి 8 గంటల పని విధానాన్ని ప్రస్తుత కేంద్ర బీజేపీ ప్రభుత్వం తొలగించి 12 గంటల వరకు పని చేయించుకునేందుకు చట్టాలను రూపొందిస్తుందనీ, ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఐక్యమై పోరాటానికి సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ పిలుపునిచ్చారు. మంగళవారం హిమాయత్ నగర్ లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో హైదరాబాద్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేడే గోడ పోస్టర్‌ఐ ఆవిష్కరించారు. అనంతరం నరసింహ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి నాలుగు కోడ్లుగా విభజించి కార్మికుల పొట్టలు కొట్టి యజమాన్యాలకు పొట్టలు నింపేందుకు చట్టాలను రూపొందించడం అన్యాయమన్నారు. ఈ విధానానికి వ్యతిరేకంగా చికాగో అమరవీరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి మాట్లాడుతూ మేడే సందర్భంగా నగరంలోని ప్రతి కార్మిక వాడ, కూడలిల్లో ఎర్రజెండాలను ఎగురవేసి హిమాయత్ నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయం నుండి భారీ కార్మిక ప్రదర్శన నిర్వహించనున్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల చట్టాలను అమలు చేయకుండా కార్మికుల్ని శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారన్నారు. మేడే సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటానికి ప్రతిజ్ఞ నిర్వహించి, భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ హైదరాబాద్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు పి.వెంకటయ్య, ఉప ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, కోశాధికారి బి.వెంకటస్వామి, నగర ఉపాధ్యక్షులు భిక్షపతి, రాజమౌళి, హసీనా, నగర కార్యదర్శులు ఎం.లక్ష్మీబాయి, ఆర్.మల్లేష్, టి.కొమురెల్లి బాబు, ఎండి.ఉమరాన్, జంగయ్య, రమేష్, రాజయ్య, వీరేందర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా పట్ల జాగ్రత్తగా ఉండాలి : మెడికల్ ఆఫీసర్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రజలు మలేరియా. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరవింద్ అన్నారు. మంగళవారం బేగంబజార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ .. మలేరియా కేసులు రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వయస్సుతో నిమిత్తం లేకుండా పిల్లలు మొదలు పెద్దల వరకు ఈ వ్యాధి లక్షణాలు కనబడితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో వృద్ధి చెందే దోమ కాటు వల్ల వ్యాపిస్తుందని తెలిపారు. తమ ఆసుపత్రి పరిధిలో ఇంటింటికీ ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నామనీ, అవసరమైన వారికి వెంటనే మందులను అందిస్తున్నామని అన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బేగం బజార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పి హెచ్ఎన్ నాగేశ్వరి. అకౌంటెంట్ ఉదయ్ నాగశ్రీ. స్టాఫ్ నర్సులు శైలజ. మౌనిక. మమత. రాణి. ఏఎన్ఎంలు నళిని. వందన. శ్యామల. సునీత. ఫార్మసిస్ట్ అంజలి. వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ శుభ్రత కోసం డిక్లట్టర్, డీప్ క్లీన్

నవతెలంగాణ-హైదరాబాద్

కేవలం రెండు సాధారణ దశలలో మీరు వేసవి కాలంలో మీ ఇంటిని శుభ్రంగా చేసుకోవచ్చు. డిక్లట్టరింగ్, డీప్ క్లీనింగ్. ఈ పనులతో చిందరవందరగా, మురికిగా ఉన్న స్థలాన్ని ఆరోగ్యకరమైన, వ్యవస్థీకృతంగా మార్చేందుకు అద్భుతాలు చూడవచ్చు. ప్రక్రియ సామర్థ్యాన్ని, ప్రభావాన్ని ఆప్టిమైజ్ చేసేందుకు నిపుణుల చిట్కాలు, ట్రిక్ తో పాటు, డిక్లట్టరింగ్ వాక్యూమింగ్ లతో ప్రయోజనాలు చాలా ఉన్నాయి. ఈసందర్భంగా డైసన్లో మైక్రోబయాలజీ విభాగంలోరి పరిశోధనా శాస్త్రవేత్త మోనికా స్టూజెన్ మాట్లాడుతూ... అనేక ధూళి కణాలు పరిమాణంలో సూక్ష్మంగా ఉండడంతో ప్రజలు నేలపై కనిపించే ధూళిని గుర్తించినప్పుడు మాత్రమే శుభ్రం చేసుకుంటారన్నారు. అయితే, అది కంటి చూపునకు కనిపించని ధూళి కణాలను తొలగించుకోవాలన్న వ్యాకులత మనసులో ఉంటుందన్నారు. దుమ్ము పేరుకుపోకుండా ఉండేందుకు ఇంట్లో దుమ్మును తొలగించడం, క్రమం తప్పకుండా శుభ్రపరచడం ద్వారా ఈ సమస్యను అధిగమించేందుకు అనుసరించవలసిన ఉత్తమ విధానమని తమ పరిశోధన తెలియజేస్తుందని తెలిపారు.

ఈజ్ ఆఫ్ మూవింగ్ ఇండెక్స్ - ఇండియా రిపోర్ట్ 2022

నవతెలంగాణ-హైదరాబాద్

ఓఎంఐ ఫౌండేషన్ సిద్ధం చేసిన ఈజ్ ఆఫ్ మూవింగ్ ఇండెక్స్ - ఇండియా రిపోర్ట్ 2022ను స్మార్ట్ సిటీస్ మిషన్, మిషన్ డైరెక్టర్, జాయింట్ సెక్రటరీ, ఐఏఎస్ అధికారి కునాల్ కుమార్, భారతదేశంలోని యూఎన్ రెసిడెంట్ కోఆర్డినేటర్ షోంబి షార్ప్ సంయుక్తంగా ఈ నివేదికను విడుదల చేశారు. ఈసందర్భంగా ఓఎంఐ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ, చైనాలో భారత మాజీ రాయబారి గౌతమ్ బంబావాలే మాట్లాడుతూ... పట్టణ కేంద్రాలు దేశంలో ఆర్థిక వృద్ధికి కారకాలు అన్నారు. మొబిలిటీ అనేవి పౌరులు తమ నిజమైన సామర్థ్యాన్ని గ్రహించుకుని వారిని శక్తివంతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. భారతదేశం 10. ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా, అంతకు మించిన ప్రయాణం స్థిరమైన, ఇంక్లూజివ్, సమర్థవంతమైన మొబిలిటీ వ్యవస్థ ద్వారా ఆజ్యం పోయాలని పేర్కొన్నారు.

నెక్స్ట్ నీట్ ఎడిషన్‌ను ప్రారంభించిన ప్రెస్ లాడర్

నవతెలంగాణ-హైదరాబాద్

భారతదేశంలోని అగ్రగామి వైద్య అభ్యసన తయారీ ప్లాట్‌ఫామ్లలో ఒకటైన ప్రెప్లోడర్, తమ అధ్యయనా సామాగ్రి నోట్స్ నెక్స్ట్ ఎడిషన్ అనబడే ఒక పెంపొందిత వెర్షన్ని విడుదల చేసింది. అది నెక్స్ట్, నీట్ పిజి అభ్యాసకుల కోసం ఒక సమీకృతమైన అభ్యసనా పరిష్కారాన్ని అందజేస్తుంది. ఎలైట్ ప్లాను సబ్స్క్రైబ్ చేసుకున్న ప్రెప్లోడర్ క్రియాశీలక అభ్యాసకులందరూ నోట్స్ నెక్స్ట్ ఎడిషన్ను ప్రాప్యత పొందుతారు. ప్రెప్లాడర్ డ్రీమ్ టీమ్ నెక్స్ట్ ఎడ్యుకేటర్లచే రూపకల్పన చేయబడిన నోట్స్ నెక్స్ట్ ఎడిషన్, మొత్తం 19 పాఠ్యాంశాలకూ సమీకృతమైన అభ్యసనా సామాగ్రిని కలిగి ఉంటు ంది. ప్రస్తుతం ఈ పుస్తకాలు ఇంగ్లీషులో లభ్యమవుతున్నాయి. నోట్స్ నెక్స్ట్ ఎడిషన్ ద్వారా అభ్యాసకులు వీటికి ప్రాప్యత పొందుతారని ఆ సంస్థ తెలిపింది.

కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి ఒరగబెట్టిందేమీ లేదు

- పచ్చని తెలంగాణలో విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ
- బీఆర్ఎస్ సమ్మేళనంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



నవతెలంగాణ-అంబర్‌పేట

పచ్చని తెలంగాణలో కులాల మధ్య, ప్రాంతాల మధ్య బీజేపీ చిచ్చు పెడుతూ విద్వేషాలు రెచ్చగొడుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి, ,సంక్షేమం కోసమే పనిచేస్తున్నదని అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధ్యక్షతన సోమవారం కాచిగూడలో మున్నూరు కాపు భవన్లో జరిగింది. ఈ సమ్మేళనానికి మంత్రి హాజరై మాట్లాడారు. ధరలను పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారం మోపిన పాపం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానిదేనన్నారు. అంబర్‌పేటలో గత ఇరవై సంవత్సరాలుగా జరగని అభివృద్ధి కాలేరు వెంకటేశ్ ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత గడిచిన నాలుగేండ్లలో జరిగిందన్నారు. గతంలో 15 సంవత్సరాలు ఎమ్మెల్యేగా, నాలుగు సంవత్సరాల నుంచి కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి అంబర్‌పేటకు, సికింద్రాబాద్ ప్రజలకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. సంవత్సరానికి ఎంపీగా తనకు వచ్చే పార్లమెంటు నిధుల నుంచి ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టలేదని తెలిపారు. మీ ఏరియాలో ఎక్కడైనా ఖర్చు పెట్టారా? అంటూ సభకు హాజరైన ప్రజలను ప్రశ్నించగా, ఎక్కడా లేదన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి కంటే ఎమ్మెల్యేగా కాలేరు వెంకటేశ్ చేసిన అభివృద్ధి అధికమన్నారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ బిజెపి నాయకులు నియోజకవర్గానికి ఒక రూపాయి నిధులు తెచ్చిన దాఖలు లేవన్నారు. సోషల్ మీడియాలో బిజెపి అరాచకాలకు తగిన జవాబు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబర్ పేట డివిజన్ కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు చిట్టేడి నరసింహారెడ్డి, డాక్టర్ సులోచన, డాక్టర్ శిరీష యాదవ్, డాక్టర్ ఓం ప్రకాష్ యాదవ్, మోర శ్రీరాములు ముదిరాజ్, కాలేరు మణికంఠ, సుశీల రెడ్డి, సిద్ధార్థ ముదిరాజ్, ఎర్ర భీష్మ దేవ్, చంద్రమోహన్, మేడి ప్రసాద్, ధాత్రిక్ నాగేందర్ బాబ్జి, రవీందర్ యాదవ్, మన్నే శ్రీనివాస్ యాదవ్, సదానందు, బబ్లు సింగ్, శ్రీకాంత్ యాదవ్, పల్లవి పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రతినిధుల సభ



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ సభకు అన్ని డివిజన్ల నుంచి కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు సభకు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ తాను ఊహించిన దానికంటే నాయకులు, కార్యకర్తలను సభకు తరలించారనీ, అందుకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథిగా దాసోజు శ్రావణ్ పాల్గొని తన సందేశాన్ని అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ నాయకులు ఎన్నో అసత్య ప్రచారాలు చేస్తున్నారనీ, వారి మాటలు తెలంగాణ ప్రజలు నమ్మరన్నారు. బీజేపీ వారు ఎన్ని ప్రయత్నాలు చేసినా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ జండానే ఎగరేస్తామన్నారు. అత్యధిక మెజార్టీతో గెలుపొందుతామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, తాము చేసిన అభివృద్ధి కార్యక్రమాలు తిరిగి మమ్మల్ని గెలిపిస్తాయన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గెలిచిన కార్పొరేటర్లు ఇప్పటి వరకు ప్రజలకు అందుబాటులో ఉండి వారి అవసరాలు తీరుస్తున్నారనీ, ప్రజలకు పథకాలు చేరవేస్తున్నారు అని తెలిపారు. తమ సర్వేలో ప్రతి కార్పొరేటర్ 80 శాతం బాగా పని చేస్తున్నట్టు తేలిందన్నారు. తమ విజయానికి మీడియా ప్రతినిధుల సహాయ సహకారాలు కూడా కావాలనీ, ఏదైనా సమస్య మీ దృష్టికి వస్తే తొందరపడి వార్తలు రాయొద్దనీ, తనకు కాల్ చేసి వివరణ కోరవచ్చని మీడియా వారికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు దళిత బంధును వంద మందికి మాత్రమే ఇచ్చామనీ, రెండో విడతలో అర్జీలు పెట్టుకున్న వారు అనేకమంది ఉన్నారనీ, అందులో నిజమైన లబ్దిదారులను ఎంపిక చేసి మాత్రమే ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్, వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్యరావు, రహమత్ నగర్ కార్పొరేటర్ సీఎస్ రెడ్డి, అన్ని డివిజన్ల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశ్‌కి నేత కేసీఆర్ : పాండురంగాచారి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



తెలంగాణ మలిదశ ఉద్యమంలో తెలంగాణ కోసం పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన సీఎం కేసీఆర్ దేశానికి ప్రాతినిధ్యం వహించాలని తెలంగాణ ఉద్యమకారుడు వలబోజు పాండురంగాచారి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. 2001 నుండి తెలంగాణ రాష్ట్రం కోసం పనిచేశామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి సీఎం కేసీఆర్. ఐటి శాఖ మంత్రి కేటీఆర్ సారథ్యంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తుందన్నారు. తాను 2001 నుంచి తన గురువు గ్యాదరి బాలమల్లు సారథ్యంలో పనిచేస్తున్నానని, ఆయన తన రాజకీయ గురువు అని చెప్పారు.

హమాలీలకు వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

హమాలీ కార్మికుల వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేసి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగురు రాములు, వై. సోమయ్య డిమాండ్ చేశారు. హమాలీ కార్మికుల సమస్యలపై సీఐటీయూ హమాలి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న చేపట్టిన ఛలో లేబర్ కమిషనర్ ధర్నాను జయప్రదం చేయాలంటూ గూడి మల్కాపూర్ కూరగాయల మార్కెట్లో గోడ ప్రత్రిక విడుదల చేశారు. వారు మాట్లాడుతూ హమాలీలకు భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డ్ మాదిరి బోర్డ్ ఏర్పాటు చేయాలన్నారు. 50 కిలోల కంటే అధికంగా ఉండే బరువును నిషేధించాలన్నారు. పని గంటలు, పని భద్రత గుర్తింపు కార్డులు కనీస వేతనాలు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ చట్ట భద్ద హక్కులు కల్పించాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగర్లో వేలాది మంది హమాలీ కార్మికులు గత 40 సంవత్సరం నుండి వివిధ మార్కెట్లలో పని చేస్తూ అనారోగ్యాల బారిన పడుతున్నారని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హమాలీలను ఆదుకోవడంలో ఘోరంగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో హమాలి కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి బి. రాములు, కె. కుమార్, బి.మాధు, భారత్, రాము పాల్గొన్నారు.

నవతెలంగాణ 9
మల్కాజిగిరి
బుధవారం 26 ఏప్రిల్ 2023

బీఆర్ఎస్ ప్రతినిధుల సభకు తరలిన నాయకులు



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా పలు కాలనీలలో కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, పార్టీ డివిజన్ అధ్యక్షులు గుండారపు శ్రీనివాస్ రెడ్డిలు పార్టీ శ్రేణులతో కలిసి బైక్ ర్యాలీగా వెళ్లి బీఆర్ఎస్ పార్టీ జెండాల ఆవిష్కరించారు. అనంతరం పార్టీ ప్రతినిధుల సభకు బయలుదేరారు.

కంటి వెలుగును సద్వినియోగించుకోవాలి

- దమ్మాయిగూడా మున్సిపల్ చైర్ పర్సన్ వసూపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దమ్మాయిగూడా మున్సిపల్ చైర్ పర్సన్ వసూపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ అన్నారు. కంటి వెలుగు రెండో విడత లో భాగంగా దమ్మాయిగూడ పురపాలక సంఘం పరిధిలోని 15 వ వార్డులోని లేక్యూ కాలని వద్ద ఏర్పాటుచేసిన కంటి వెలుగు శిబిరంను చైర్ పర్సన్ ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ స్వామి, స్థానిక వార్డు కౌన్సిలర్ మాదిరెడ్డి నర్సింహా రెడ్డి, కాలనీ వాసులు డాక్టర్లు పాల్గొన్నారు.

కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి పునాది

- గెలిచినా.. ఓడినా ప్రజల మధ్యనే ఉన్నాను
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

ఏ రాజకీయ పార్టీ మనుగడ సాధించాలన్నా కార్యకర్తలే పునాది అని.. అలాంటి కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి కొండంత అండ అని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని మహబూబ్ కాలేజి లోని ఎస్‌వీఐటీ ఆడిటోరియంలో నిర్వహించిన సనత్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా తెలంగాణా తల్లి చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులు అర్పించి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటి వరకు జరిగిన అభివద్ధి కార్యక్రమాలను తెలియజేసే విధంగా ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకిం చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరవీరుల మతికి సంతాప సూచకంగా 2 నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో 13 తీర్మానాలు ప్రవేశపెట్టగా, సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలోని పార్టీ కి చెందిన ప్రతి నాయకుడు, కార్యకర్త ఎంతో గౌరవంగా, తలెత్తుకొనే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని చెప్పారు. ఆదర్శవంతమైన పాలనను అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఇది మనందరికీ గర్వకారణం అన్నారు. మీకు ఏ అవసరం ఉన్నా తాను ఎల్లవేళలా అండగా ఉంటానని చెప్పారు. ప్రజలకు అండగా ఉంటూ సమస్యల పరిష్కారం కోసం పని చేసే వారిని ఆదరించాలని, లేదంటే ప్రజలే నష్టపోతారనే విషయాన్ని గ్రహించాలని కోరారు. జీహెచ్ఎంసీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్ అభ్యర్థులను ఓడించినా వారు నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఇచ్చిన మాటకు కట్టుబడి అంకితభావంతో పని చేసే పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు. గెలిచిన కార్పొరేటర్ లు ఇప్పటి వరకు ఒక్క రూపాయి అభివద్ధి పనులైన చేశారా? అని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కారం కావాలన్నా...అభివద్ధి పనులు చేయాలన్నా అది తెలంగాణ ప్రభుత్వం మాత్రమే చేస్తుందని చెప్పారు. తాను 32 సంవత్సరాల నుంచి రాజకీయాలలో ఉన్నానని, గెలిచినా...ఓడినా నిరంతరం ప్రజల మధ్యనే ఉన్నానని ఆపదలో ఉన్న అనేకమందికి ఎంతో సహాయం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. తాను విమర్శలను పట్టించుకోనని, ప్రజా సంక్షేమం, అభివద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. గతంలో సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వ్యవహరించినా చేయని అభివద్ధిని 2014 తర్వాత సీఎం కేసీఆర్ మంత్రి కేటీఆర్‌ల సహకారంతో వందల కోట్ల రూపాయల వ్యయంతో నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాలలో అనేక అభివద్ధి కార్యక్రమాలు చేశామని వివరించారు. నియోజకవర్గ పరిధిలో అనేక రోడ్ల నిర్మాణం, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం, అనేక దేవాలయాల నిర్మాణం చేసిన విషయాన్ని వివరించారు. ఇవే కాకుండా స్థలంఉండిఇల్లు నిర్మించుకోవాలనుకొనే వారికి త్వరలో ప్రభుత్వం రూ. 3 లక్షల చొప్పున ఆర్థికసహాయం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈసమావేశంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, కార్పొరేటర్ లు కొలన్ లక్ష్మి, హేమలత, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ లు నామన శేషుకుమారి, అత్తిలి అరుణ గౌడ్, ఆకుల రూప, ఉప్పల తరుణి, డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, గుర్రం పవన్ కుమార్ గౌడ్, హన్మంతరావు, శ్రీనివాస్ గౌడ్, నాయకులు శ్రీనివాస్, అశోక్ యాదవ్, ఆనంద్ పాటిల్ జయరాజ్, సరాఫ్ సంతోష్, ఫహీం తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థల గుర్తింపును రద్దుచేయాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్



నవతెలంగాణ-కాప్రా

ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపులను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈసీఐఎల్ నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ముఖ్య నాయకుల సమావేశం జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ కుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రయివేటు , కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలు పెరిగిపోతున్నాయన్నారు. ఎటువంటి ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ముందస్తు అడ్మిషన్లు చేస్తూ, ఇష్టానుసారం ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ అధికారులు పేపర్ ప్రకటనలకే పరిమితమయ్యారని.. కనీసం పట్టించుకునే పరిస్థితుల్లో లేరని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రానున్న విద్యా సంవత్సరంలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్ఠంగా అమలు పరిచే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థల పరిస్థితి అగమ్యగోచరంగా తయారయిందన్నారు. "మన ఊరు మన బడి " పథకం కింద 9వేల పై చిలుకు పాఠశాలలను ఎంపిక చేసుకొని కేవలం ప్రచార ఆర్భాటాలకే ఉపయోగించు కున్నారు తప్ప ఒక్క పాఠశాల అభివద్ధికి నోచుకోలేదన్నారు. ప్రభుత్వ బడులకు వేసవి సెలవులు ఉండడంతో, బడులకు అటెండర్లు ,వాచ్మెన్లు లేక బడులలో ఉన్న సామాగ్రికి రక్షణ లేకపోవడంతో పాఠశాల హెడ్ మాస్టర్లు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. జూనియర్ కళాశాలలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయని చెప్పారు. ఉన్నత విద్యారంగాన్ని గాలికొదిలేశారన్నారు. రానున్న కాలంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎండీ అన్వర్, నాయకులు సోహెల్ , కె.చందు యాదవ్, అంజి పాల్గొన్నారు.

అడ్డగోలుగా మూత్రశాలల నిర్మాణాలు.. నిర్వహణ గాలికి

- బాలానగర్ బస్టాప్ వద్ద రోడ్డుపైనే నిర్మాణం
- ఉన్నది పట్టించుకోకుండా కొత్తది..
- ఉచిత మూత్రశాలలకు మంగళం



నవతెలంగాణ-బేగంపేట్

బేగంపేట సర్కిల్ పరిధిలో అనేక ప్రధానమైన వాణిజ్య , వర్తక ప్రాంతాలున్నాయి. అలాగే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, రెతిఫైల్ బస్టాండ్ , పాస్ పోర్టు కార్యాలయం, మోండా మార్కెట్ లాంటివి ఎన్నో ఉన్నాయి. ప్రతి రోజు నగరం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఆయా పనులపై వచ్చే ప్రజలకు మూత్రశాలల సమస్య వెంటాడుతుంది. మూత్రశాలలు ఎక్కడపడితే అక్కడకట్టుకుంటూ పోయారు తప్పా వాటి నిర్వహణ గాలికి వదలి వేశారని ఆరోపణలు వస్తున్నాయి. గతంలో నిర్మించిన మూత్ర శాలలు అనేకం నేడు శిథిలావస్థకు చేరుకుని అవి నిరుపయోగంగా మారగా అటు తర్వాత మళ్లీ కొత్త పేర్లు పెట్టి నిర్మించడం జీహెచ్ఎంసీ అధికారుల పనిగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు.

ఉన్నది పట్టించుకోకుండా కొత్తది..

గురుద్వారా టెర్మినల్‌లోని బాలానగర్ బస్టాప్‌లో గత 15 ఏండ్ల క్రితం సులభ్ కాంప్లెక్స్ నిర్మించారు. దీన్ని ఆనుకునే బహిరంగ మూత్రశాలలు ఉన్నాయి. అయితే అది పాతది అవ్వడంతో ఇప్పుడు పక్కనే కొత్త నిర్మాణాలు చేపట్టారు. ఈ నిర్మాణాలు అయిపోయాక పాతది కూలగొట్టే అవకాశం ఉంది. అయితే ఉన్న మూత్రశాలలను సరిగ్గా పట్టించుకోలేదని పలు ఆరోపణలు వస్తున్నాయి. అలాగే ప్రస్తుతం ఆర్టీసీ బస్సులు నిలిపే స్థలంలో టాయిలెట్ నిర్మిస్తుండటంతో ప్రయాణికులు, ఆర్టీసీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. జీడిమెట్ల , జగద్గిరిగుట్ట , బాలానగర్ తదితర ప్రాంతాలకు చెందిన బస్సులు ఇక్కడ నిలుపుతారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో కూడా ఇక్కడ బస్సులు కొద్దిసేపు నిలుపుకునే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు ఈ టాయిలెట్ నిర్మాణంతో కేవలం ఒక వైపు మాత్రమే బస్సులు ఆపుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. దీనికి తోడు బస్సుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడి ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు.

ఉచిత మూత్రశాలలకు మంగళం

బేగంపేట సర్కిల్ పరిధిలో ఉండే పలు బహిరంగ మూత్రశాలలను జీహెచ్ఎంసీ అధికారులు విస్మరిస్తూ పెయిడ్ మూత్రశాలలు ఏర్పాటు చేస్తున్నారనే విమర్శలున్నాయి. డబ్బులు వసూళ్లు చేసికునే మూత్రశాలలను అధికారులు ప్రోత్సహిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ప్రయివేటుకు చెందిన పెట్రోల్ బంక్‌లు, హోటళ్లలో ఉచితంగా మూత్ర విసర్జనకు అవకాశం ఉంది. కానీ ఈ మూత్ర శాలల్లో డబ్బు వసూళ్లు చేసుకునేందుకు జీహెచ్ఎంసీ అవకాశం కల్పించడం పట్ల ప్రజలు విస్తుపోతున్నారు. మూత్ర విసర్జనకు రూ.5 వసూలు చేస్తుండడంతో కొందరు సామాన్యులు బయటే మూత్ర విసర్జన చేస్తున్నారు. దాంతో పరిసరాలు పాడవుతున్నాయి.

ఉన్నదాన్ని కూలగొట్టి

మోండా మార్కెట్ ఇందిరాగాంధీ విగ్రహం ప్రాంతంలో బహిరంగ మూత్రశాల ఉండేది . దీన్ని జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోలేదని ఆరోపణలు వచ్చాయి. దీనికి తోడు ఇక్కడ ఉండే వ్యాపారులు కోసం ఈ మూత్రశాలను కూలగొట్టారని తెలిసింది. కూల్చి వేసిన మూత్రశాల వైపు ఓ దుకాణం తెరుచుకోనుందని సమాచారం. దీని కోసం పెద్ద

మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ



నవతెలంగాణ-కాప్రా

ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా కాప్రా సర్కిల్ పరిధిలోని 5 యూనిట్ ల ఆధ్వర్యంలో మంగళవారం కాప్రా సర్కిల్ నుంచి ఈసీఐఎల్ చౌరస్తా వరకు ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించి తిరిగి కాప్రా సర్కిల్ కార్యాలయంలో ర్యాలీని ముగించారు. కాప్రా సర్కిల్ అసిస్టెంట్ ఎండమాలజిస్ట్ రమేష్ మాట్లాడుతూ వారంలో ఒకరోజు డ్రై డే-డ్రై డే, నిర్వహిస్తూ దోమలు వద్ధి చెందకుండా చేద్దాం, దోమకాటు-ఆరోగ్యానికి చేటు, మంచినీటి పాత్రల పై మూతలు పాడుదాం- దోమలు ఆవాసాలుగా మారకుండా చేద్దాం,పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొందాం-ప్రజా ఆరోగ్యాన్ని కాపాడదాం వంటి పలు నినాదాలు చేశారు. లార్వా ఉన్న తోట్టెలు,డ్రమ్ములు,పూల కుండీలు నుండి నీటిలో పెరిగే ఏడీస్ దోమ వలన డెంగ్యూ వ్యాధి వ్యాపిస్తుందని సూచిస్తూ మంచినీటి పాత్రల పై మూతలు తప్పకుండా పెట్టుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు మలేరియా సిబ్బంది మాట్లాడుతూ మలేరియా రహిత సమాజంప్రజభాగస్వామ్యంతోనే సాధ్యమని,ప్రజలందురూ చోరవతోదోమలు వద్ధి చెందకుండా చేయడం-లార్వా నిర్మూలనకు క్రియాశీల పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మలేరియా నివారణలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ విస్తత సేవలు అందిస్తుండడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ లు, నరేందర్ రెడ్డి,కనకరాజు, నరసింహ గౌడ్,పరమేష్ , తదితరులతోపాటు 5 యూనిట్ లు మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు అందరికి అందిస్తాం

- ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



నవతెలంగాణ-మల్కాజిగిరి

రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అందరికి అందిస్తామని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి ప్రభుత్వం చిత శుద్ధితో కృషి చేస్తుందని ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మంగళవారం నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రతినిధుల సభ కార్యక్రమం గౌతమ్ నగర్ పరిధిలోని లక్ష్మీ సాయి గార్డెన్‌లో బద్దం పరుశారాం రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీ పూర్‌రాజు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పాల్గొని ప్రసంగించారు. కార్పొరేటర్లు సునీత రామూయాదవ్,ప్రేమ్ కుమార్, మీనా ఉపేందర్ రెడ్డి,శాంతి శ్రీనివాస్ రెడ్డి, జితేంద్ర నాథ్,సబితా కిషోర్, బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్, కొండల్ రెడ్డి,అధికార ప్రతినిధి, జీఎన్‌వీ సతిష్ కుమార్,రామూయాదవ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే తెలంగాణ ప్రగతికి బాటలు

- మేయర్ మేకల కావ్య



నవతెలంగాణ-జవహర్‌నగర్

బీఆర్ఎస్‌నే తెలంగాణ రాష్ట్రం ప్రగతి బాటలు పట్టిందని, సీఎం కేసీఆర్ విజన్ దేశానికే తెలంగాణ మోడల్‌గా నిలుస్తుందని మేయర్ మేకల కావ్య అన్నారు. మంగళవారం కార్పొరేషన్ లో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జెండా పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సబ్బండ వర్గాల సంక్షేమ లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందనిఅన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

గల్లీ గల్లీలో బీఆర్ఎస్ జెండాలు ఆవిష్కరణ



నవతెలంగాణ-నాచారం

నాచారం, మల్లాపూర్ డివిజన్ల పరిధిలోని భారత రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డిల ఆధ్వర్యంలో గల్లీ, గల్లీలో బీఆర్ఎస్ జెండాలను ఆవిష్కరించారు. కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ వార్డు కార్యాలయంలో పార్టీ జెండాను ఎగరవేసి డివిజన్‌లోని అన్ని కాలనీలో పార్టీ జెండాలను ఆవిష్కరిస్తూ డీజే చప్పుడు బైక్ ర్యాలీతో శ్రీకష్ణ కన్వెన్షన్ లో జరిగిన బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సభకు తరలి వెళ్లారు. మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి వార్డు కార్యాలయం వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించగా ఎలిఫెంట్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి చేతుల మీదుగా పార్టీ జెండాని ఎగరవేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు చర్లపల్లికి బైకు ర్యాలీగా తరలి వెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

నాచారం డివిజన్‌లోని రాఘవేంద్ర నగర్ లో బీఆర్ఎస్ పార్టీ జెండాను రాష్ట్ర ఆటో రవాణా సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య ఆవిష్కరించి ప్రతినిధుల సభకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్, విఠల్ యాదవ్, రాజబాబు, పాండు నాయక్, కట్టబుచ్చి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జెండా పండుగ



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ, పెద్ద చర్లపల్లి, చిన్న చర్లపల్లిలో బీఆర్ఎస్ పార్టీ జెండా పండుగ ఘనంగ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ఆవిష్కరించి మాట్లాడారు. 2001 ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భవించి, సీఎం కెసిఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడం జరిగిందనాఁఅంనరు. భారత రాష్ట్ర సమితిగా రూపాంతరం చెంది, రానున్న రోజుల్లో జాతీయ స్థాయి రాజకీయాల్లోనూ బలమైన శక్తిగా మారి తెలంగాణ రాష్ట్ర సంక్షేమ పథకాలు దేశమంతా ప్రవేశ పెట్టేలా,అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అనే నినాదంతో దేశ రాజకీయాల్లో విజయవంతం కావాలని కోరారు. డివిజన్ నాయకులు బాల్ రెడ్డి,శివ కుమార్ గౌడ్,కనక రాజ్ గౌడ్,రాజేశ్వర్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, నర్సింహ వంశరాజ్, ప్రభు గౌడ్, కొమ్ము రమేష్, సురేష్, ధనుంజయ గౌడ్, రాజు గౌడ్, పెంకటేష్ పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం



నవతెలంగాణ కంటోన్మెంట్


కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలలో భాగంగా మంగళ వారం మర్రి రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన అట్టహాసంగా కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహించారు. మల్లారెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులతోపాటు కార్పొరేషన్ చైర్మెన్‌లు, మాజీ బోర్డు సభ్యులు, నియోజకవర్గానికి చెందిన పలు వార్డులకు సంబంధించిన నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు నాయకులు వారి వారి బస్తీలలో వార్డులలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ర్యాలీగా సమావేశానికి హాజరయ్యారు. మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో తెలంగాణ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మన్నే క్రిశాంక్ , బేవరేజ్ కార్పొరేషన్ చైర్మెన్ గజ్జల నాగేష్ సీనియర్ నాయకుడు శ్రీ గణేష్, దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తెలు నందిత ,నివేదిత, మాజీ సభ్యులు పాండు యాదవ్, లోకనాథం, నళిని ప్రభాకర్, భాగ్యశ్రీ తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు. మర్రి రాజశేఖర్ రెడ్డి కార్యక్రమానికి వచ్చిన నాయకులతో తీర్మానాలు చేయించారు. మాజీ మార్కెట్ చైర్మెన్ టీఎన్ శ్రీనివాస్, తేజ పాల్, నాగినేని సరిత, ముప్పిడి మధుకర్, ప్రభు గుప్తా తో పాటు పలువురు సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

రామానుజాచార్య బోధనలు ఆదర్శనీయం




నవతెలంగాణ-కాప్రా

మానవ సమాజానికి సామాజిక సమతా సూత్రాన్ని ధార్మిక విలువలతో కూడిన శ్రీ రామానుజాచార్యుల బోధనలు ఆదర్శనీయం అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మీర్ పేట్ డివిజన్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో రామానుజాచార్యుల విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రపంచానికి సమతా దార్శని కుడైన శ్రీ రామానుజాచార్య విరాట్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో స్థాపించడం అద్భుతమన్నారు. శ్రీ చినజీయర్ స్వామి, వారి అశేష అనుచరులు, అభిమానులు ఇందుకు సంబంధించి మహా అద్భుతమైన కషి చేసారని కొనియాడారు. రామానుజాచార్యుల మానవులు అందరూ సమానమని, సమానత్వం కోసం వెయ్యేండ్ల క్రితమే ఎంతో కృషి చేశారన్నారు. బీఎల్ఆర్ఃచారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి గుమ్మడి జంపాల్ రెడ్డి పాల్గొన్నారు.



నాచారం : మర్రిగూడ ఎన్ఎఫ్‌సి చౌరస్తా లోని విరాట్ విగ్రహానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బండారి లక్ష్మారెడ్డి పూలమాల లేసి నివాళులర్పించారు. బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతిని ధులు కటార్ల భాస్కర్, మహేష్, గుమ్మడి జంపాల్ రెడ్డి, బాలకష్ణ, రామానుజా సేవా ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.


చర్లపల్లి డివిజన్‌లో బీఆర్ఎస్ ప్రతినిధుల సభ



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ పరిధిలోని శ్రీ కష్ణ కన్వెన్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ప్రతినిధులకు సమావేశానికి ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ హాజరయ్యారు. పార్టీ నాయకులకు,కార్యకర్తలకు హైకమాండ్ ఎల్లవేళలా అండగా ఉంటుందని, ఇక్కడకి వచ్చిన పార్టీ ఇన్‌చార్జులు ఉప్పల్ నియోజవర్గ ఉద్యమకారుల, నాయకులకు దక్కాల్సిన పదవులపై సమాచారం అందిస్తారని తెలిపారు. రాబోయే రోజుల్లో సముచిత స్థానం కల్పించే విధంగా కషి చేయాలని కోరారు. వ్యవసాయం,రైతు సంక్షేమం,మహిళా శ్రేయస్సు, బీసి, గిరిజన, దళిత సంక్షేమం,సామాజిక భద్రత,విద్యా ఉద్యోగం అంశాలపై తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు.దానిని పార్టీ ప్రతినిధులు ఆమోదించారు. వివిధ డివిజన్ల కార్పొ రేటర్లు, మాజీ కార్పొరేటర్లు,వివిధ డివిజన ్ఆధ్యక్ష, కార్యదర్శులు, ఉద్యమకారులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్వాల్‌లో ఘనంగా బీఆర్ఎస్ జెండా పండుగ



నవతెలంగాణ- నేరేడ్‌మెట్

బీఆర్ఎస్ జెండా పండుగను అల్వాల్‌లో ఘనంగా నిర్వహించారు. మంగళవారం అల్వాల్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు వారి డివిజన్లలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. అల్వాల్‌లోని తెలంగాణ విగ్రహం దగ్గర కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి జెండా ఆవిష్కరించారు. మచ్చ బొల్లారంలో కార్పొరేటర్ రాజ్ జితేంద్ర నాథ్, డివిజన్ అధ్యక్షుడు బొబ్బిలి సురేందర్ రెడ్డితో కలిసి జండా ఆవిష్కరించారు. అనంతరం మల్కాజిగిరిలో నిర్వహించిన సభకు తరలి వెళ్లారు. నాయకులు ఉదయ్, రాజసింహారెడ్డి, బలవంత రెడ్డి, నాగేశ్వరరావు, అరవింద్, చంద్రశేఖర్, కవిత, నిర్మల రెడ్డి, మచ్చ బొల్లారంలో ఢిల్లీ పరమేష్ ,విలియం, రాజయ్య, శ్రీశైలం యాదవ్, వీవీ రావు, షేక్ గౌస్, అతిక్ పాష, శ్రావణ్ ముదిరాజ్, శకుంతల నాయుడు, సులోచన, కవిత తదితరులు పాల్గొన్నారు

ఏఎస్‌రావునగర్‌లో బీఆర్ఎస్ జెండావిష్కరణ



నవతెలంగాణ-కాప్రా

ఏఎస్ రావు నగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో బీఆర్ఎస్ జెండాలను ఆవిష్కరించారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాధికా చౌరస్తాలో బేతి సుభాష్ రెడ్డి, రౌండ్ బిల్డింగ్ వద్ద పార్టీ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి జెండాలను ఎగరవేశారు. మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, పజ్జురి పావని మణిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెద్దాపురం కుమారస్వామి, బేతాళ బాలరాజు, కందుల లక్ష్మీనారాయణ, శోభా రెడ్డి మట్ట గిరి, మల్కా రమాదేవి, మంజులా రెడ్డి, భాస్కర్, సురేంద్ర చారి, రాజారెడ్డి, యాకయ్య, చెన్నారావు, ఈసీఐఎల్ బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్లీ బర్డ్ స్కీమ్ ఇంకా 5 రోజులే..

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపు కోసం ఈ ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం 5 శాతం రిబేట్ కల్పించిన నేపథ్యంలో ఇంకా ఐదు రోజులే గడువు మిగిలి ఉంది. ఎర్లీ బర్డ్ స్కీమ్ ఏప్రిల్ 1 నుంచి 30 వరకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఎర్లీ బర్డ్ స్కీమ్ ఆస్తిపన్ను చెల్లింపునకు ఇంకా ఐదు రోజులే మిగిలి ఉన్నందున పెండింగ్ పెట్టకుండా సత్వరమే పన్ను చెల్లించి 5 శాతం రిబేట్ పొందగలరని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు.ఈ నెల 30వ తేదీన ఆదివారం సిటిజెన్ సర్వీస్ సెంటర్‌లు తెరిచే ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వనస్థలిపురం సంక్షేమ సంఘం హడాక్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ -వనస్థలిపురం

వనస్థలిపురం నివాసుల సంక్షేమ సంఘం హడాక్ కమిటీని ఎన్నుకున్నారు. సర్వసభ సమావేశం సంఘం అధ్యక్షుడు ఆర్.జగదీష్ గుప్తా, ప్రధాన కార్యదర్శి కే.సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రస్తుతం సంఘం కాలపరిమితి పూర్తి అయినందున నూతన కమిటీ ఎన్నిక కోసం హడాక్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో వచ్చే నెల (మే 15)లోపు సభ్యత నమోదు కార్యక్రమం పూర్తి చేయాల్సిందిగా అడ్వైజరీ కమిటీ నిర్ణయించింది. కమిటీ సభ్యులుగా బీరం శ్రీధర్, మిట్టా రామ్మోహన్, కాల్వ బాలరాజ్, సురేష్, జాన్, శ్రీధర్ నాయుడు, భాస్కర్ రెడ్డి, ఆకాష్, సంతోష్ కుమార్, ఆశాజ్యోతి, ఇంద్రసేనారెడ్డి, ఉప్పు వెంకటేష్, అనిల్ గౌడ్, శ్రీకాంత్, పాండు రంగారెడ్డి మొత్తం 15 మందిని సభ్యులుగా నియమించారు.

మేడ్చల్ గడ్డ గులాబీ అడ్డా

- మూడోసారి గెలిచి కేసీఆర్‌కు కానుకగా ఇస్తాం
- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా మా పాలన
- మేడ్చల్ నియోజకవర్గ ప్రతినిధుల సభలో మంత్రి మల్లారెడ్డి





నవతెలంగాణ-బోడుప్పల్

మేడ్చల్ గడ్డ గులాబీ అడ్డ అని మూడోసారి గెలిచి సీఎం కేసీఆర్ కు కానుకగా ఇస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామ కూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రతినిధుల సభ తూంకుంటలోని జాన్వీ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వంలోని బీఅర్ఎస్ సర్కారు ప్రజా సంక్షేమ పాలన సాగిస్తూ అన్ని వర్గాలకు సమాన న్యాయం చేస్తున్నదని అన్నారు. ప్రతీ ఇంటికి ఎదో ఒక సంక్షేమ పథకం అందించిన ఘనత కేసీఆర్ సర్కారుకు దక్కిందని అన్నారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి లేని బడ్జెట్ మేడ్చల్ కు కేటాయించినట్టు తెలిపారు.గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చాలా వరకు పూర చేశామని ఇంకా పెండింగ్‌లో ఉన్న హామీలు పూర్తి చేసేలా ముందుకు సాగుతున్నామని చెప్పారు.

మాది సంక్షేమ పాలన - బీజేపీ ది విద్వేష పాలన....

కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలో ఏర్పడిన బీజేపీ సర్కారు మోదటి నుండే ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి మత రాజకీయాలు చేస్తున్నదని కానీ చైతన్యవంతమైన తెలంగాణలో బీజేపీ నేతల పప్పులు ఉడకవని మంత్రి అన్నారు. సర్వ మతాలను గౌరవించేలా కేసీఆర్ పాలన సాగుతుందని అందుకే హిందు, ముస్లిం,క్రిస్టియన్‌ల పండుగలకు వారికి అవసరమైన కానుకలు అందిస్తున్నామని తెలిపారు. చేవెళ్ళ సభలో తెలంగాణ రాష్ట్రానికి ఏం చేశామో చెప్ప లేకనే అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు తీసేస్తామని కేంద్ర హెూం మంత్రి అమీత్ షా మాట్లాడారని ఐక్యమత్యంగా జీవనం సాగిస్తున్న ప్రజల మధ్య వైషమ్యాలు పెంచేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తున్నదని వాటిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత తెలంగాణ సమాజంపై ఉందని అన్నారు.

ఈ కార్యక్రమంలో బీఅర్ఎస్ మేడ్చల్ ఇన్‌చార్జ్ చామకూర మహేందర్ రెడ్డి,బీఅర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి జహంగీర్,బోడుప్పల్ నగర అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి,జవహర్ నగర్ మేయర్ మేకల కావ్య వివిధ పురపాలక సంఘాల చైర్మన్‌లు, బీఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

తీర్మానాలకు ఏకగ్రీవ అమోదం..

మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ బీఅర్ఎస్ ప్రతినిధుల సభలో కొంత మంది నాయకులు ప్రవేశపెట్టిన పలు తీర్మానాలకు సభ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.దళిత బంధు పథకం అమలు,బీసీ సంక్షేమం,కులవృత్తుల సంక్షేమం, మహిళ సంక్షేమం, మైనా రిటీల అభివృద్ధికి కావాల్సిన ప్రణాలికలు, కేసీఆర్ కిట్,కల్యాణ లక్ష్మి,షాది ముబారక్, రైతు బంధు,పట్టణ,పల్లె ప్రగతి, ఎస్టీ సంక్షేమం, రిజర్వేషన్ల పెంపుదల,కేంద్రం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమ కార్యాచరణ లాంటి వాటిపై తీర్మానాలు ప్రవేశ పెట్టగా సభ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

పట్టణ,పల్లె ప్రగతి దేశానికే ఆదర్శం - పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి



రాష్ట్రంలోని పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఈ పథకాన్ని అధ్యయనం చేసేందుకు వివిధ రాష్ట్రాల ప్రతినిధులు మన రాష్ట్రంలోని పంచాయతీలకు, నగర కార్పొరేషన్లను సందర్శిస్తున్నారని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. పట్ట,పల్లె ప్రగతి పై తీర్మానం ప్రవేశ పెట్టిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాలు, పల్లెల నిరంతరం సుందరంగా ఉండేందుకు స్థానిక పాలక సంస్థలకు పూర్తి స్థాయిలో స్వేచ్ఛను కల్పించిన ఘనత సీఎం కేసీఆర్ దేనని అన్నారు.ప్రతి చోటా పల్లె ప్రకృతి వనాలు, పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేసి హరిత హారంతో ప్రాంతాలన్నీ పచ్చదనంతో కళకళలాడేలా చేశాని తెలిపారు. అదే విధంగా వైకుంఠ దామాల నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయింపు చేసి ఆఖరి మజిలీ ఆనందంగా ఉండేందుకు తోడ్పాటును అందించారని అన్నారు. ఈ తీర్మానానికి సభ ప్రతినిధులు ఏకగ్రీవంగా అమోదం తెలిపారు.

మోడీ విధానాలతో ధరలకు ఆజ్యం : మంద సంజీవరెడ్డి



బీఆర్ఎస్ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ.. ఆదాయలు పెరగటంలేదు.. కానీ, నిత్యావసరాల ధరలు మాత్రం సామాన్యుడికి పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయన్నారు. ఏం కొనేటట్టులేదు.. ఏం తినేటట్టులేదని సగటుజీవి అనుకుంటున్న మాటలివి... మోడీ ప్రభుత్వం ఇంధన ధరలు, గ్యాస్ ధరల్ని బాదేస్తుంటే.. నిత్యావసరాల ధరలు భగ్గుమంటున్నాయని తెలిపారు. దీనికి తోడుగా కేంద్రం ఇస్తానన్న ఏడాదికి కోటి ఉద్యోగాల భర్తీ లేకపోవడంతో సరైన ఉపాధిలేక కోట్లాది కుటుంబాల బడ్జెట్ తారుమారైందన్నారు. ఓ వైపు దిగజారిన పొదుపు.. మరోవైపు ఎగబాకుతున్న ధరలతో బతుకుతంటగా మారిందని అందరిలోనూ ఆందోళన వ్యక్తమవుతున్నదన్నారు మానవుని దైనందిన జీవితంలో పొద్దున్నే లేచిన కాన్నుంచి పడుకునే వరకు వాడే అనేక నిత్యావసర వస్తువుల ధరలను పెంచి పేద,మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచిన ఘనత కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ సర్కారుదేనని అన్నారు. సంపదను సృష్టించడంలో కేంద్రం అనుసరిస్తున్న ద్వంద్వ విధానాలతో ప్రజల బతుకు బజారులో పడిందనే చెప్పాలంటూ కేంద్ర ప్రభుత్వం పెంచుతున్న ధరలపై సంజీవరెడ్డి ప్రవేశ పెట్టిన తీర్మానానికి సభ ప్రతినిధుల నుండి విశేష స్పందన వచ్చింది.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య



నవతెలంగాణ-మీర్‌పేట్

మతోన్మాద బీజేపీ నుంచి భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఇంటింటికీ సీపీఐ ప్రజా పోరు యాత్రలో భాగంగా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం లెనిన్ నగర్ చౌరస్తాలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ.. ఏప్రిల్ 14 నుంచి మే 15 వరకు "బీజేపీకి హటావో దేశ్ కు బచావో" పేరుతో దేశవ్యాప్తంగా ప్రజల వద్దకు వెళ్లి ప్రధాని మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వ విధానాల వల్ల దేశంలో వివిధ రంగాల్లో జరుగుతున్న అన్యాయాలను వివరిస్తున్నామని తెలిపారు. నిరంకుశ హిట్లర్ తరహా పాలన సాగిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఓడించి వామపక్ష ప్రగతిశీల లౌకిక ప్రజాస్వామిక శక్తులతో కూడిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చే విధంగా ప్రజలను చైతన్యపరచాలని కార్యకర్తలకు సూచించారు. మతోన్మాదం ముసుగులో భారత రాజ్యాంగానికి రద్దుచేసి దాని స్థానంలో మనువాద రాజ్యాంగం తీసుకురావాలని ఆర్ఎస్ఎస్ పెద్ద కుట్ర చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలందరూ గమనించి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, బి.బాలరాజు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. చంద్రయ్య, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పానగంటి పర్వతాలు, ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, మహేశ్వరం నియోజకవర్గ కార్యదర్శి బి.దత్తు నాయక్, బాలాపూర్ కార్యదర్శి వెంకటరమణారెడ్డి, మహేశ్వరం కార్యదర్శి పల్నాటి యాదయ్య, కందుకూరు మండల కార్యదర్శి కె.రాజు, మహేశ్వరం నియోజకవర్గ సహాయ కార్యదర్శి మారేగోని ప్రవీణ గౌడ్, డిహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షుడు గణేష్, బాలాపూర్ మండల నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సంస్థకు కండక్టర్‌లు, డ్రైవర్‌లే పునాది

నవతెలంగాణ-హయత్‌నగర్



ఆర్టీసి సంస్థకు కండక్టర్, డ్రైవర్‌లే పునాదులు అని హెచ్ఆర్ సీనియర్ కన్సల్టెంట్ కవిత అన్నారు. హయత్ నగర్ 1 డిపోలో కండక్టర్ లకు జరుగుతున్న శిక్షణ శిబిరం లో డిపో మేనేజర్ రఘుతో కలిసి ఆమె పాల్గొని శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్క కండక్టర్, డ్రైవర్ మధ్య డ్యూటీకి వెళ్ళేటప్పుడు స్నేహ పూర్వక బంధం ఉండాలని, డ్యూటీ చేస్తున్న సమయంలో ప్రయాణికులను కస్టమర్ లాగా స్వీకరించి వారితో అవినాభావా సంబంధం ఏర్పర్చుకో వాలన్నారు. వారు మళ్ళీ మళ్ళీ బస్సులలో ప్రయాణిచ్చే విదంగా వారితో వ్యవహారించాలని సూచించారు. సంభాషణ మంచిగా ఉండాలని,బస్ ఎక్కే ప్రయాణికులకు చేదోడు వాదోడుగా ఉంటూ వారు కోరిన గమ్య స్థానాలలో దింపి వారి మన్ననలు పొందాలని తెలిపారు. ఇలాగే ప్రతి ఒక్కరూ కష్ట పడి సంస్థ ను మరింత అభివద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ మేనేజర్ విజయకుమారి పాల్గొన్నారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి

- గడ్డి అన్నారంలో ఘటన

నవతెలంగాణ-చైతన్యపురి

ఓ విద్యార్థి అనుమానాస్పద మృతి చెందిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్గొండ టౌన్ లోని సూర్యవంశం కాలనీలో నివాసం ఉండే జాల లింగేశం కొడుకు జాల రినేష్ (22) చాదర్ ఘాట్ లోనే ఆర్‌జీకేడీ కళాశాలలో ఎంసీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గడ్డి అన్నారం లోని రాఘవేంద్ర బాయ్స్ హాస్టల్ లో ఉంటూ కళాశాలకు వెళ్తున్నాడు. మంగళవారం రినేష్ హాస్టల్లో అనుమానస్పదంగా మృతి చెందాడు. హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు రీనేష్ మృతదేహాన్ని వెంటనే అంబులెన్స్ ద్వారా ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న మృతుడి తల్లిదండ్రులు బంధువులు పెద్ద ఎత్తున హాస్టల్ వద్దకు చేరుకున్నారు. తాము హాస్టల్ వద్దకు రాకముందే మృతదేహాన్ని ఆస్పత్రికి ఎలా తరలిస్తారని తండ్రి లింగేషం పోలీసుల తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతి చెందిన పది నిమిషాల్లోనే ఆస్పత్రికి తరలించడం ఏమిటని మృతుడి బంధువులు ప్రశ్నిస్తున్నారు. కాగా మృతుడి గదిలో ఓ సూసైడ్ నోట్ కూడా లభించింది. అందులో 'నన్ను క్షమించండి. నా చావుకు ఎవరు బాధ్యులు కాదు. అమ్మానాన్న, అన్నయ్య, అత్తయ్య ,కుటుంబ సభ్యులు, స్నేహితులు అందరూ కూడా దయచేసి నన్ను క్షమించండి' అని పేర్కొని ఉంది. అయితే ఆ సూసైడ్ నోటు రీనేష్ రాసింది కాదని అతని రైటింగ్ అది కాదని మృతుడి తండ్రి అంటున్నాడు. మృతికి గల కారణాలను బట్టబయలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మృతుడు రీనేష్ స్నేహితులను హాస్టల్ నిర్వాహకుడిని పోలీసులు ఎందుకు పోలీస్ స్టేషన్ కు తీసుకువెళ్లారని వారు ప్రశ్నిస్తున్నారు. రీనేష్ మృతి అనుమానాస్పదంగా ఉందని వెంటనే అన్ని విషయాలు బట్టబయలు చేయాలని డిమాండ్ చేస్తూ మృతుడి బంధువులు, స్నేహితులు హాస్టల్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలంటూ వారు డిమాండ్ చేస్తున్నారు. అయితే విద్యార్థి మరణానికి గల కారణాలు మాత్రం వెల్లడి కాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

దేశంలో ఎక్కడా లేని అభివృద్ధి తెలంగాణ లోనే..

- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-హయత్‌నగర్



మోడీ సొంత రాష్ట్రంతో పోల్చుకుంటే తెలంగాణలోనే అభివృద్ధి బాగా జరిగిందనడానికి ఈ 9 సంవత్సరాల్లో కేంద్రం ఇస్తున్న అవార్డులే నిదర్శనం అని ఎమ్మెల్యే, ఎంఆర్‌డీసీ చైర్మెన్ దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళ నంలో భాగంగా ముందుగా సభ ఆవరణలో ఏర్పాటు చేసిన జెండా పండుగ కార్యక్రమంలో పాల్గొని జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 50 ఏండ్లలో జరగని అభివద్ధి,సంక్షేమం తెలంగాణ రాష్ట్రం ఎర్పడ్డాక ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో జరిగిందని తెలిపారు .సంక్షేమ ఫలాలను రాష్ట్ర నలుమూలల అమలు చేస్తున్న ఘనత బీఆర్ఎస్ పార్టీకే సొంతమన్నారు. పార్టీ చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ రంగాల్లో జరిగిన తీరుతెన్నులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో పలు తీర్మా నాలు ప్రవేశపెట్టి ఆమోదించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయనంద్ గుప్తా, హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్, రాష్ట్ర మాజీ ఇండస్టియల్ కార్పొరేషన్ చైర్మెన్ అమరవాది లక్ష్మీ నారాయణ,మాజీ కార్పొరేటర్లు ముద్ర బోయిన శ్రీనివాసరావు,కొప్పుల విఠల్ రెడ్డి,సామ తిరుమల రెడ్డి,జిట్టా రాజశేఖర్ రెడ్డి,వజీర్ ప్రకాష్ గౌడ్,పద్మ శ్రీనివాస్ నాయక్, సంగీత ప్రశాంత్ గౌడ్, ధనలక్ష్మి, రోజారెడ్డి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-హయత్‌నగర్



మాన్సూరాబాద్ డివిజన్ బీజేపీ కార్యాలయంలో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం నిర్వహించారు. మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వారం కొంత సమయాన్ని వెచ్చించి కుటుంబ సమేతంగా మన ఇంటిని, పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని సూచించారు. నిల్వ ఉన్న నీటిని తొలగించి దోమలను నియంత్రించాలని, వాటిని రక్షణ పొంది మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది జనార్దన్, గోపి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ముందుకు సాగుతాం

- పీర్జాదిగూడ అధ్యక్షుడు దర్గా దయాకర్ రెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాలతో ముందుకు సాగుతామని బీఅర్ఎస్ పీర్జాదిగూడ అధ్యక్షుడు మేడ్చల్ జిల్లా గ్రంథా లయ సంస్థ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో పీర్జాదిగూడ నగరంలోని పలు డివిజన్లలో గులాబీ జెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించిన తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ డిప్యూటీ మేయర్ కె.శివకుమార్ గౌడ్, బోయన్ పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేశ గొని శ్రీనివాస్ గౌడ్, ప్రదాన కార్యదర్శి పాశం రాజు యాదవ్,సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి, ఉపాధ్యక్షుడు చింతల నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సీపీఐ ప్రజాపోరు యాత్ర



నవతెలంగాణ-హయత్‌నగర్

హయత్‌నగర్ మండలం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని వీరన్న గుట్ట నుంచి సీపీఐ మండల కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ సీపీఐ ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. ఇందులో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాది రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఏడాదికి కోటి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ విఫలమైందన్నారు. ఈ తొమ్మిదిన్నర సంవత్సరాలుగా నిత్యావసరాల వస్తువుల ధరలకు రెక్కలు వచ్చాయని, సామాన్యుడు బతకలేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేయాలని రైతును ముంచే మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చిందని చెప్పారు. రైతుల ఉద్యమంతో వెనక్కి తగ్గి ప్రధాని మోడీ క్షమాపణ చెప్పారన్నారు. ఒక్కొక్కటిగా ప్రభుత్వ రంగ సంస్థలన్నీటిని కారు చౌకగా తన దత్తపుత్రులకు కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న అనేక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చి.. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగాన్ని మంట కలిపి మనువాదాన్ని అమలు చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. వీటన్నింటిపై ప్రజలను చైతన్య పరుస్తూ బీజేపీని తరిమికొట్టడానికి ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం చేపట్టామని తెలిపారు.

మన్సూరాబాద్ డివిజన్, హయత్‌నగర్ డివిజన్, వనస్థలిపురం డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో గడప గడపకూ సీపీఐ కరపత్రాలు పంచుతూ జనాన్ని చైతన్యవంతం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శులు శ్రీదేవి, సత్రు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోలోజు లక్ష్మణాచారి, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్ కుమార్ గౌడ్, మహిళా సమాఖ్య మండల అధ్యక్ష కార్యదర్శులు సరిత, సుభద్ర, సోమన్న, దళితహక్కుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేష్ పాల్గొన్నారు.

వడ్డెర వృత్తిదారులకు రుణాలు ఇవ్వాలి

- సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్



నవతెలంగాణ-తుర్కయాంజల్

వడ్డెర వృత్తిదారుల రుణాలను వెంటనే రుణాలు ఇవ్వాలని వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు విగ్నేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వడ్డెర వృత్తిదారుల సంఘం రంగారెడ్డి జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం తుర్కయంజాల్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, కార్యదర్శులు కుంచం వెంకటకృష్ణ, పల్లపు విఘ్నేశ్, చేతి వృత్తిదారుల జిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్ గోరెంకల నరసింహ మాట్లా డారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏండ్లు గడుస్తున్నా వడ్డెరల బతుకులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. వడ్డెర వృత్తిదారులు నేటికీ సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, సమాజానికి దూరంగా ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో సుమారు 4000 సొసైటీలు ఉన్నా.. ఇప్పటికి ఒక్క పైసా ఖర్చు చేయడం లేద న్నారు. వడ్డెర వృత్తిదారులు చనిపోతే కనీసం ఎక్స్‌గ్రేషియా కూడా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డెర బంధును ప్రకటించి వెనుకబడిన ప్రతి కుటుంబానికీ రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇండ్లు లేని వారికి డబుల్ బెడ్ రూమ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డులు, పింఛన్లు, ప్రతి నియోజకవర్గంలో గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ దేరంగుల రామకృష్ణ, ఇదికట్ల యోగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా కన్వీనర్ గా దేరంగుల లక్ష్మీపతి, కో కన్వీనర్లుగా గోగుల రాజు, తన్నీరు చెన్నమ్మ, సభ్యులుగా గుర్రం సత్యనారాయణ, గండికోట సత్యం, పల్లపు కృష్ణంరాజు, బొంత రాంమూర్తి, దేరంగుల బాలకృష్ణ, దేరంగుల సుదర్శన్, కుంచం బిక్షమయ్య ఎన్నికయ్యారు.

మట్టిలో మాణిక్యం కూచి సాయి శంకర్

- ఉప్పల శ్రీనివాస గుప్త

నవతెలంగాణ-నాగోల్



మట్టిలో మాణిక్యం కూచి సాయి శంకర్ అని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. ప్రముఖ చిత్రకారుడు సాయి శంకర్‌కు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ప్రదానోత్సవ కార్యక్రమం వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో మంగళవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళా లలిత కళావేదికలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల శ్రీనివాస్ గుప్త విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ చిత్రకారుడు కూచి సాయి శంకర్ 27 గంటల పాటు ఏడు ఖండాలలో నివసిస్తున్న 127 కళాకారులు ,127 ఆలపించిన పద్యాలపై నిర్విరామ చిత్రాలు గీసి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ సొంతం చేసుకోవడం ఎంతో సంతోషదాయకమన్నారు. కూచి సాయి శంకర్ ఐదు సంవత్స రాల వయస్సు నుండి చిత్రాలు గీయడం అభినందనీయమన్నారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇండియా కోఆర్డినేటర్ బింగీ నరేందర్ గౌడ్ మాట్లాడుతూ ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించడమే వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లక్ష్యమ న్నారు. అనంతరం కూచి సాయి శంకర్ కు ఉప్పల శ్రీనివాస్ గుప్తా ,వండర్ బుక్ ఆఫ్ రికార్డు ఇండియా కోఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్ తో కలిసి రికార్డును అందజేశారు. కార్యక్రమంలో మల్కాజ్‌గిరి కోర్టు పూర్వ జడ్జి బూర్గుల మధు సూదన్ , రఘునందన్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయం

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్



రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అపర భగీరథుడని, రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొటడం ఖాయమని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న సుల్తాన్ పూర్ గ్రామంలో ఓ పెన్ మైదానంలో మహేశ్వరం నియోజకవర్గం కార్యకర్తల ప్లీనరీ సమావేశం మంత్రి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి,రంగారెడ్డి జిల్లా చైర్ పర్సన్ తీగల అనిత హరినాథ్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆదేశం మేరకు ఈ ప్లీనరీ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. 6 తీర్మానాలను ఆమోదించాలని సీఎం కేసీఆర్ ఆదేశించగా 21తీర్మానాలను ఆమోదించడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశానికే గర్వకారణంగా నిలిచాయన్నారు. మంత్రి కేటీఆర్ కృషితో పాక్స్ ఖాన్, అమెజాన్ తదితర ఎన్నో కంపెనీలు రాష్టానికి వస్తున్నాయని అందులో వేలాది మందికి ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారని పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో సబితా ఇంద్రారెడ్డి, బీఆర్స్ పార్టీ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. ముందుగా సభ ప్రాంగణం లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ జెండాను మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ తొమ్మిది సంవత్సరాలలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన వ్యవసాయ రంగం, సామాజిక భద్రత, మహిళ శ్రేయస్సు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, దళితబంధు, విద్యుత్ రంగం, విద్యా వైద్య రంగం, బీసీ, మైనార్టీ సంక్షేమం, కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, ఆసరా పెన్షన్లు, నియోజకవర్గ అభివృద్ధి, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాల పై ఈ ప్రతినిధుల సమావేశంలో తీర్మానాలు చేసి వివరించారు. యువ నేత పట్లోళ్ళ కౌశిక్ రెడ్డి, ప్రజా ప్రతినిదులు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు,నాయకులు కార్యకర్తలు, అభిమానులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

'అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న బీఆర్ఎస్'

నవతెలంగాణ- సంతోష్‌నగర్



అన్ని వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని బీఆర్ఎస్ యాకుత్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి సామ సుందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అభివృద్ధి సీఎం కేసీఆర్, కేటీఆర్, హెూం మంత్రి మహమ్మద్ అలీతోనే సాధ్యమన్నారు. మాజీ కార్పొరేటర్ సోమ స్వప్నసుందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల హయాంలో అవినీతి'



నవతెలంగాణ- ఘట్కేసర్

కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాల హయాంలో అవినీతి తీవ్రమైందని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో అడుగడుగునా అవినీతిమయంగా మారిం దన్నారు. హాత్ సే హాత్ జూడో కార్యక్రమం మూడోరోజు మంగళవారం ఘట్కేసర్ మండలం కోరేముల, వెంకటాపూర్ గ్రామంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అవినీతిలో కూరుకుపోయిన ఈ ప్రభుత్వాలను ఇంటికి సాగనంపి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని, అలా అయితేనే పేదలకు కనీసం ముద్ద అన్నం దొరుకుతుందని అన్నారు. మేడ్చల్ నియోజకవర్గం ఎ బ్లాక్ అధ్యక్షులు పోచయ్య, తెలంగాణ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ పొన్నం తరుణ్ గౌడ్, లీగల్ సెల్ కన్వీనర్ అమరేందర్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త సుశాంత్ గౌడ్, ఘట్కేసర్ మండల అధ్యక్షులు కర్రె రాజేష్, వర్కింగ్ అధ్యక్షులు బాబు రావ్ గౌడ్, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుర్రె మహేష్, కోరేముల గ్రామం కాంగ్రెస్ అధ్యక్షులు భాస్కర్ గౌడ్, ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

అధికారుల అండతో దర్జాగా కబ్జా.. ?

- అదేం అని ప్రశ్నిస్తే దౌర్జన్యం
- న్యాయం చేయాలంటూ బాధితుల వేడుకోలు

నవతెలంగాణ-బోడుప్పల్



బలహీన వర్గాల సంక్షేమం కింద నాటి ప్రభుత్వం తనకు ఇంటి జాగను కేటాయించిన స్థలంలో ఇతరులు అధికారులు, స్థానిక నేతల సహకారంతో దర్జాగా కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేపట్టి తమకు అన్యాయం చేస్తున్నారని ఓ మహిళ మీడియా ముందు తన ఆవేదనను వెలిబుచ్చుకున్న సంఘటన బోడుప్పల్ మునిసిపల్ కార్పోరేషన్ లో మంగళవారం చోటు చేసుకుంది.బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం బోడుప్పల్ లో నివాసం ఉంటున్న దళిత సామాజిక వర్గానికి చెందిన ఎం.సావిత్రికి 2002 సంవత్సరంలో అప్పటి సర్కారు బలహీన వర్గాల సంక్షేమ పథకం కింద బోడుప్పల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 63/1 లో 60 గజాల ఇంటి స్థలం కేటాయించి పట్టా సర్టిఫికేట్ ఇచ్చింది. అయితే సదరు మహిళ అర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో ఒక చిన్న రూం మాత్రమే వేసుకుని మిగిలిన స్థలాన్ని ఖాళీగా ఉంచింది ఇదే అదునుగా భావించిన భూ కబ్జా దారులు ఆ ఖాళీ స్థలంపై కన్నేసి ఫోర్జరీ సంతకాలతో తప్పుడు ధ్రువీకరణ పత్రాలు తయారు చేసి అది తమ స్థలం అంటూ సదరు మహిళను బెదిరింపులకు గురి చేసి ఇంటి నిర్మాణం చేపట్టారు. దాంతో చేసేదేం లేక సదరు మహిళ మేడిపల్లి మండల రెవెన్యూ అధికారులను ఆశ్రయించగా వారు ఎలాంటి చర్యలు తీసుకోకుండా తాత్సారం చేసి కబ్జా దారులకు సహకరించారని ఆమె వాపోయింది. మేడ్చల్ కలెక్టర్ కార్యాలయంలో పిర్యాదు చేయగా విచారణ అదేశాలు రావడంతో అసలు విషయం బయటపడింది.దీంతో విచారణ జరిపిన మేడిపల్లి రెవెన్యూ అధికారులు తప్పుడు పత్రాలతో ఇంటి నిర్మాణం చేపట్టినట్టు నిర్ధారణకు వచ్చి కబ్జా చేసిన వారిపై మేడిపల్లి పీఎస్ లో ఫిర్యాదు చేయగా రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు నలుగురు వ్యక్తులు గడ్డం రాజు,అదిములం కరుణకార్,పడిశాల మహేందర్, కృష్ణ అనే వ్యక్తులపై పలు సెక్షన్ ల కింద కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

'కేసులు నమోదైన న్యాయం జరగడం లేదు'

రెవెన్యూ అధికారులు తప్పుడు పత్రాలు అంటు నిర్ధారణకు వచ్చి మేడిపల్లి పీఎస్ లో పిర్యాదు చేయగా కేసులు నమోదయ్యాయి అయినా బాధిత మహిళ తనకు న్యాయం జరగడం లేదంటూ కన్నీటి పర్యంతమైంది. తన స్థలం వద్దకు వెళితే చంపుతామని బెదిరింపులకు పాల్పడతున్నారని వాపోయారు. తమకు ఏకైక ఆధారమైన ఇంటి స్థలాన్ని తమకు కేటాయించాలని కోరారు. కబ్జా దారుల వెనక స్థానికంగా ఉన్న వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు ఉన్నారని ఆరోపించారు.

బీఆర్ఎస్ జెండా పండుగ

నవతెలంగాణ-హయత్‌నగర్



బీఆర్ఎస్‌పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం మన్సూరాబాద్ చౌరస్తా వద్ద పార్టీ జెండాను డివిజన్ మహిళ అధ్యక్షురాలు కొసనం ధనలక్ష్మి వెంకట్ రెడ్డి ఎగుర వేశారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



కేపీహెచ్‌బీ కాలనీలో బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు పాల్గొని కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని పలు ఫేజ్లలో, కాలనీల్లో బీఆర్ఎస్ జెండాను ఎగరేశారు. అనంతరం ఎమ్మెల్యే కృష్ణారావు ఆధ్వర్యంలో ఫతేనగర్ లో నిర్వహించిన బీఆర్ఎస్ బహిరంగ సభకు పార్టీ నేతలు, కార్యకర్తలు ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు జనగాం సురేష్ రెడ్డి, వెంకటేశ్వరరావు, సాయిబాబా చౌదరి, నాగేశ్వరరావు, రాణా ప్రతాప్, ఎస్.కె మహబూబ్, జీఎల్ఎన్ రెడ్డి, భవాని, భారతి, కన్నాలత, రమాదేవి, పద్మా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంటామని జీహెచ్ఎంసి అధికారులు తెలిపారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా డివిజన్ జగద్గిరిగుట్ట స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ ఆదేశాల మేరకు డివిజన్లోని జీహెచ్ఎంసి సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సింగిరెడ్డి మల్లారెడ్డి, గుజ్జుల పాపిరెడ్డి, మహేందర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, డివిజన్ యూత్ అధ్యక్షులు రాయి విగ్నేష్, డివిజన్ సోషల్ మీడియా అధ్యక్షులు కిరణ్ చారి, డివిజన్లోని ఎంటమాలజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.వేల కోట్లతో కూకట్‌పల్లి నియోజకవర్గంలో అభివృద్ధి

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ/బాలానగర్



కూకట్‌పల్లి నియోజకవర్గంలో రూ.వేల కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు మంగళవారం కూకట్‌పల్లి భారత రాష్ట్ర సమితి నియోజకవర్గ ప్రతినిధుల సభకు ఆయనతో పాటు రైతు బంధు సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, శాసన మండలి సభ్యులు కుర్మయ్యగారి నవీన్ కుమార్ హాజరయ్యారు. ఈ సభలో తొమ్మిది తీర్మానాలను ప్రవేశపెట్టగా సభకు హాజరైన సభ్యులు ఏక కంఠంతో ఆమోదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గం లో రూ.వేల కోట్ల నిధులతో ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు , అండర్ పాసులు, రోడ్ల పునరుద్ధరణ, మంచి నీటి, డ్రైనేజీ సదుపాయాలు కల్పించామన్నారు. నియోజకవర్గంలో వేల కుటుంబాలు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా లబ్ది పొందారన్నారు. పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకూ తగిన గుర్తింపు ఉంటుందన్నారు. తొమ్మిదేండ్ల కాలంలోనే వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా మిషన్ భగిరథ పథకం ద్వారా తాగునీరు అందించామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఐడీఎల్ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి కేటాయిస్తే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ప్రతి నిరుపేదకీ అందజేస్తామని తెలిపారు. ఈ సభలో నియోజకవర్గ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని బోయిన్‌పల్లి, బాలానగర్, ఫతేనగర్, మూసాపేట, బేగంపేట, కూకట్ పల్లి, కెపిహెచ్బీ, అల్లాపూర్, వివేకానంద నగర్ తదితర డివిజన్ల కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులకు సన్మానం

నిరుపేదలు ఎక్కడ ఉంటే అక్కడ వారికి ఖార్డు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అండగా ఉంటారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ ప్రతినిధుల సభలో ప్రజా ప్రతినిధులు ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సుమన్ మల్లాది, మంజులతలకు ఆయనతో పాటు ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, నవీన్‌రావు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలు ఎక్కడ ఉంటే అక్కడ వారికి ఖార్డు స్వచ్ఛంద సంస్థ నిర్వాకులు సుమన్ దంపతులు అండగా నిలుస్తూ వారికి నిత్యావసర సరుకులు అందించడమే కాకుండా సమాజంలో అందరూ ఎదగాలన్న ఉద్దేశంతో వృత్తి విద్యా కోర్సులు ఉచితంగా అందిస్తున్నారన్నారు. అందుకు తగ్గ ప్రోత్సాహకాలు ఇవ్వడం నిజంగా అభినందించదగ్గ విషయమన్నారు.

డివిజన్‌లోని సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

మూసాపేట్ డివిజన్ వార్డు కార్యాలయంలో అన్ని బస్తీల నాయకులు, బస్తీ వాసులతో కలిసి, అన్ని విభాగాల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, స్థానిక సమస్యలను వివరించి సత్వరమే పరిష్కరించాలని మూసాపేట్ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బస్తీలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన సమావేశమనీ, ఈ సమావేశంలో బస్తీ ప్రజలు వివరించిన తమ సమస్యలపై సంబంధితశాఖ అధికారులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. కాలనీ, బస్తీవాసుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించే దిశగా వారు ఆలోచించాలని అధికారులకు సూచించారు. ప్రతి బస్తీ, కాలనీ నుంచి వచ్చిన బస్తీ అధ్యక్షులకు కాలనీవాసులకు వారి వారి బస్తీ సమస్యలను గుర్తించి, వారి సమస్యల ఫిర్యాదు పత్రాలను, పూర్తిగా సంబంధిత అధికారులకు అందించామనీ, వారు వీలైనంత త్వరగా అన్ని సమస్యలకు పరిష్కారం చూపిస్తారని కార్పొరేటర్ మహేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ వెంకటరమణ, మూసాపేట సెక్టార్ ఎస్సై రామకృష్ణ, జలమండలి మేనేజర్ సాలోమి, వెటర్నరీ డాక్టర్ లింగ స్వామి, విద్యుత్ అధికారులు, ఇతర అధికారులు, బస్తీ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల పట్ల వివక్ష చూపొద్దు

- వికలాంగుల హక్కుల జాతీయ వేదిక



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

వికలాంగుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపవద్దని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్.పి.ఆర్.డి) మేడ్చల్ జిల్లా కార్యదర్శి జంగిటి మల్లేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జగద్గిరిగుట్ట డివిజన్ జగదంబ మార్కెట్ నుండి చివరి బస్ స్టాప్ వరకు ఎన్ పి ఆర్ డి మండల, డివిజన్, కమిటీలతో కలిసి వికలాంగులకు పెన్షన్ పెంపు, ఉచిత విద్యుత్, ప్రయాణ సౌకర్యాల కోసం, ఉద్యోగ అవకాశాల కోసం ర్యాలీ నిర్వహించారు. నామినేటెడ్ పోస్టుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని ఏప్రిల్ 1 నుండి 30 వరకు నిర్వహించే ప్రచార ఉద్యమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఎన్ పి ఆర్ డి సభ్యులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. వికలాంగులకు పదివేల పెన్షన్ పెంచి ప్రతినెల ఐదో తేదీలోపు చెల్లించాలని, వికలాంగులకు విద్యుత్ 250 యూనిట్ల వరకు ఉచితంగా ఇవ్వాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రస్తుతం ఉన్న రోస్టర్ ను సవరించాలని,40 శాతం వైకల్యం ఉన్న వికలాంగులకు యుడిఐడి కార్డులను వెంటనే పంపిణీ చేయాలని, విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి సభ్యులు అంజు రాణి, డి ఆదర్శ్, బాల నర్సయ్య, కె. అనంతం, ఎం. రాజు, మంజుల, భారతి పాల్గొన్నారు.



మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ప్రతినిధుల సభకు భారీ బైక్ ర్యాలీతో తరలి వెళ్లారు. అంతకుముందు మూసాపేట్ డివిజన్ లోని వడ్డెర బస్తీ, జనతా నగర్, గూడ్స్ షెడ్ రోడ్డులో పార్టీ జెండాను శ్రావణ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కర్క పెంటయ్య, జిల్లా గోపాల్, కర్క రవీందర్, కరుణాకర్, తుకారాం, విష్ణు, రాజు, శ్రీనివాస్, రవి సింగ్, సత్యనారాయణ, శివశంకర్, రాము, అరుణ్, జైరాజ్, కృష్ణ, వీరాచారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కూకట్‌పల్లి



కుత్బుల్లాపూర్ సర్కిల్ గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సభలో జిల్లా ఇంచార్జి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డితో కలిసి పాల్గొన్న ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-దుండిగల్

కోర్టు ధిక్కరణకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



కోర్టు దిక్కునకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని అల్లాపూర్‌కు చెందిన కొడిచెర్ల సత్యమ్మ డిమాండ్ చేశారు. అల్లాపూర్ లోని సర్వేనెంబర్ 18లో తనకు చెందిన భూమిలో ఇటీవలే జీహెచ్ఎంసీ అధికారులు నాలా నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో మంగళవారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 60 ఏండ్ల క్రితం ఇక్కడ తమ పూర్వీకులు 4.17 ఎకరాల స్థలం కొనుగోలు చేశారనీ, సుమారు 25 ఏండ్ల క్రితం తన భర్తకు ఓ రెవెన్యూ అధికారికి గొడవ జరగడంతో అతను కక్షపూరితంగా ఇది ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో మార్చారని ఆరోపించారు. అప్పటి నుంచి ఈ విషయమై ప్రభుత్వంతో కోర్టులో పోరాడుతున్నామని తెలిపారు. ఇప్పటికీ ఈ కేసు హైకోర్టులో విచారణ జరుగుతున్నట్టు వివరించారు. ఇంకా కోర్టు తీర్పు విలవడక ముందే జీహెచ్ఎంసీ అధికారులు ఇది ప్రభుత్వ భూమి అని పేర్కొంటూ నాలా నిర్మాణ పనులు చేపట్టారని తెలిపారు. ఇదే విషయంలో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు నిషేధాజ్ఞలు ఉన్న ఈ స్థలంలో నిర్మాణాలు చేపట్టడం కోర్టును ధిక్కరించడమే అవుతుందన్నారు. సదరు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోర్టు తుది తీర్పు వెలువడే వరకు ఇక్కడ ఎలాంటి కార్యక్రమాలు జరగకుండా నిలిపివేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పెద్ది అంజయ్య, ప్రకాష్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మతోన్మాద రాజకీయాలు సాగనీయం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

బీజేపీ హఠావో-దేశ కో బచావో అనే నినాదంతో ఇంటింటికి సీపీఐ పేరుతో జరిగే పాదయాత్రలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం జగద్గిరిగుట్ట సీపీఐ కార్యాలయం ప్రాంగణంలో సిపిఐ నాయకులు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ లు మాట్లాడు తూ నియోజకవర్గ వ్యాప్తంగా సీపీఐ కార్యకర్తలు లక్ష కరపత్రాలను 40 వేల ఇండ్లకు లక్ష మంది ప్రజలను కలిసి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం అమ లు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు హరినాథ్ రావు, సహదేవ్ రెడ్డి, వంగాల శ్రీనివాస్, పర్వీనా సుల్తానా, మండల నాయకులు ఇమామ్, సుధాకర్, రాజు, నగేష్ చారి, చాంద్, కీర్తి, ప్రసాద్, నర్సమ్మ పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి శంభీపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ జెండా పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను కుత్బుల్లాపూర్ నియోకవర్గ బిఆర్ఎస్ కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ రానున్న రోజుల్లో జాతీయ స్థాయి రాజకీయాల్లోనూ బలమైన శక్తిగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ అర్కల జీతయ్య బండల వెంకటేష్, శంభీపూర్ యాదగిరి, తిరుమలేష్, జీ.మల్లేష్, శ్రీశైలం యాదవ్, బిక్షపతి, శ్యామ్‌రావు, ఆకుల బాబు, క్రిష్ణ, సుంకరి వినోద్, ఆర్కల వెంకటేష్, కిరణ్, బండల మురళి, హరీష్, యూత్ నాయకులు శంభీపూర్ దీపక్, నవీన్, ఆకాష్, రాజేష్, సతీష్, మురళి, వెంకటేష్, ప్రభు, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు...



కొలన్ నీలా గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో..

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో 12వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్ 2 లో స్థానిక నాయకులతో కలిసి బిఆర్ఎస్ పార్టీ జెండా ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాజేశ్వరీ చౌదరీ, బిఆర్ఎస్ వైస్ ప్రెసిడెంట్ పద్మ ప్రసాద్, స్థానిక డివిజన్ బిఆర్ఎస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి,అనుబంధ కమిటీల సభ్యులు వెంకటేష్, బట్ట మురళి,గాలి శ్రీనివాస్, చందు,నిరుడు యాదగిరి, లడ్డు, ఇస్మాయిల్, బాలరాజు, సురేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని శంభీపూర్ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు,. ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పార్టీ జెండాను ఆవిష్కరించారు. నవతెలంగాణ-దుండిగల్



వ్యాధులపై అవగాహనా ర్యాలీ

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం మూసాపేట సర్కిల్ ఎంటోమాలజీ విభాగం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయం నుండి బయలుదేరి వివిధ కాలనీలలో దోమల నివారణ వాటి నుంచి వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంటమాలజీ సిబ్బంది మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ ఎఈ నగేష్ తిప్పర్తి, ఈఎఫ్ఎ లు మహేందర్ రెడ్డి యదిలాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్విన్ కాలనీ డివిజన్‌లో బీఆర్ఎస్ సంబురాలు

నవతెలంగాణ-కూకట్‌పల్లి



బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శేరిలింగంపల్లి శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సభకు ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలి వచ్చారు. మియపూర్ నరైన్ గార్డెన్స్‌లో ఈ కార్యక్రమం జరిగింది. అంతకుముందు ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ కార్యాలయం, ఎల్లమ్మబండ చౌరస్తా, అంబేడ్కర్ నగర్, జన్మభూమి కాలనీ, జయా నగర్, సాయి నగర్, ఆల్విన్ కాలనీ-జై శంకర్ కాలనీ, ఆల్విన్ కాలనీ ఫేస్-2, వెంకటపాపయ్య నగర్, రాజీవ్ గాంధీ నగర్, మొగులమ్మ కాలనీ, పీజేఆర్ నగర్, కాలనీలలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళా నాయకురాళ్లతో కలిసి బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేసి సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, గౌరవ అధ్యక్షులు అనిల్ రెడ్డి, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

బీజేపీకి కుల, మతాలపై రాజకీయాలు తప్ప వేరే ఎజెండా లేదు



- ముషీరాబాద్ బీఆర్ఎస్ మీటింగ్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-ముషీరాబాద్

దేశంలో బీజేపీకి కుల మతాల పైన రాజకీయాలు చేయడం తప్ప వేరే ఎజెండా లేదని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. గురువారం ముషీరాబాద్ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనాన్ని బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, బిఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ప్రజల కళ్ళముందే ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సెక్యులర్ నాయకుడు అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ ఎంపీగా గెలుపొంది కేంద్ర మంత్రిగా పదవులు అనుభవిస్తున్న కిషన్ రెడ్డి ముషీరాబాద్ నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో ఐదు డివిజన్లకు చెందిన బిజెపి కార్పొరేటర్లు అభివృద్ధి, ప్రజా సమస్యలు పట్టించుకోకుండా నిర్మాణదారుల నుండి అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్నారని ఘాటు విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యులు వి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, డివిజన్ అధ్యక్షులు రావులపాటి మోజెస్, ఎం రాకేష్ కుమార్, వై శ్రీనివాసరావు,బల్ల శ్రీనివాస్ రెడ్డి ,నర్సింగ్ ప్రసాద్ ,వల్లాల శ్యామ్ యాదవ్, మన్నె దామోదర్ రెడ్డి, కొండా శ్రీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటకృష్ణ (బబ్లు) సోమ సుందరం, శివ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు

కార్యకర్తలే బీఆర్ఎస్‌కు ఊపిరి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్ వద్ద మంగళవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధ్యక్షతన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రతినిధుల సభ (ప్లీనరీ సమావేశం) నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ డా.పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గులాబీ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. సభలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి త్యాగాలను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం 12 తీర్మాణాలను ప్రవేశపెట్టగా.. ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీల అధ్యక్షులు, నాయకులు బలపర్చారు. అనంతరం ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలే బీఆర్ఎస్‌కు ఊపిరి అనీ, వారు లేకపోతే పార్టీ లేదన్నారు. సేవా భావం, క్రమశిక్షణ, క్రియాశీలకంగా పని చేసే 60 లక్షల సభ్యత్వాలు గల ఏకైక పార్టీ బీఆర్ఎస్ అన్నారు. సీఎం కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ము ధైర్యం దేశంలో ఏ పార్టీ నేతలకూ లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు, తప్పుడు ఆరోపణలతో పబ్బం గడుపు కోవడమే ప్రతిపక్షాల పని అన్నారు. నేడు ఏ రంగాన్ని తీసుకున్నా దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుంది అంటే అది సీఎం కేసీఆర్ గొప్పతనమే అన్నారు. ప్రశ్నిస్తే ఈడీ, ఐటీ, సీబీఐ దాడులు చేస్తూ బీఆర్ఎస్ నేతలను ఇబ్బందులకు గురి చేయిస్తున్నారని చెప్పారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారన్నారు. సీఎం కేసీఆర్ వెంటే నడుస్తున్నారని చెప్పారు. ఎన్నికలవేళ మాయ మాటలు చెప్పి ప్రజలను మభ్య పెట్టేందుకు వచ్చే విపక్షాలకు చెంపపెట్టు సమాధానం చెప్పాలని అన్నారు. సోషల్ మీడియాలో చేసే అసత్య ప్రచారాలను ఎప్పటికప్పుడు తెప్పి కొట్టి వాస్తవాలను ముందు ఉంచాలన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గడిచిన తొమ్మిదేండ్లలో రూ.6 వేల కోట్లతో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గడపగడపకు వివరించి రాబోయే రోజుల్లో మూడో గులాబీ జెండా ఎగిరేలా బీఆర్ఎస్ శ్రేణులు, సమిష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మేయర్, కొంపల్లి చైర్మన్, వైస్ చైర్మన్లు, జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు, నిజాంపేట్ కార్పొరేటర్లు, ఎక్స్ చైర్మన్లు, కౌన్సిలర్లు మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్, దుండిగల్, నిజాంపేట్ బీఆర్ఎస్ అధ్యక్షులు, నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్, జీహెచ్ఎంసీ బీఆర్ఎస్ అధ్యక్షులు, మున్సిపాలిటీల బీఆర్ఎస్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్సీ నవీన్ రావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి



కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని కూకట్ పల్లి గ్రామంలోని బస్ స్టాండ్ వద్ద ఎమ్మెల్సీ కె నవీన్ కుమార్, కార్పొరేటర్ జూపల్లి సత్యనారయణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో డివిజన్ లోని వివిధ కాలనీల ,బస్తీలో నుండి హాజరైన బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు బైక్ ర్యాలీ చేపట్టి ప్రతినిధుల సభకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కూకట్‌పల్లి నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొట్టు విష్ణు కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకల్లో కొలను శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, 32 వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాసరెడ్డి హాజరై 33,32 డివిజన్‌లలో మదర్ థెరిస్సా విగ్రహం దగ్గర, తెలుగు తల్లి విగ్రహం దగ్గర, సాయిబాబా గుడి వద్ద ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ జెండాలను ఆవిష్కరించారు. ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద ఆధ్వర్యంలో జగిరిన సమ్మేళానికి భారీ సంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో 33వార్డ్ ప్రెసిడెంట్ అరిగే ముత్యాలు 32వ వార్డ్ ప్రెసిడెంట్ అశోక్, శ్రీను, సుధాకర్, ఎనుముల శ్రీను, మహిళా అధ్యక్షులు జ్యోతి, నర్సింహా, మేకల బాలకృష్ణ, మహేష్ పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అజింక్యకు పిలుపు

- కెఎల్ రాహుల్, శార్దుల్‌కు చోటు
- సూర్యకుమార్ యాదవ్‌కు మొండిచేయి
- ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్‌కు భారత జట్టు ఎంపిక

ముంబయి : 17 నెలలు భారత జట్టుకు దూరమైన అజింక్య రహానె మరోసారి ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ గద కోసం బరిలోకి దిగనున్నాడు. ఆస్ట్రేలియా గడ్డపై భారత్‌కు చారిత్రక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ విజయాన్ని అందించిన నాయకుడిగా అజింక్య రహానె కితాబు అందుకున్నప్పటికీ.. పేలవ ఫామ్‌తో సెలక్టర్లు రహానెపై వేటు వేశారు. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ గాయపడటం, సూర్యకుమార్ యాదవ్ ఆశించిన మేరకు రాణించకపోవటానికి తోడు ఐపీఎల్‌లో అజింక్య రహానె సరికొత్త సంచలనాలు నమోదు చేయటంతో బీసీసీఐ సీనియర్ సెలక్షన్ కమిటీ అతడిని టెస్టు జట్టులోకి ఎంపిక చేసింది. ఐసీసీ 2023 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో భారత్, ఆస్ట్రేలియా పోటీపడనున్నాయి. జూన్ 7-11న లండన్‌లోని ది ఓవల్ మైదానంలో గద సమరం జరుగనుంది. 'నేను ఎవరికీ ఏది నిరూపించుకోవాల్సినది లేదు. నా పోటీ నాతోనే. దేనికోసమూ పరుగెత్తాలనే ఆలోచన లేదు. నా ఆటపైనే దృష్టి పెట్టాను. మిగతా విషయాలు అన్ని సర్దుకుంటాయని' అజింక్య రహానె అన్నాడు.

ఇక నిలకడగా నిరాశపరుస్తున్న కెఎల్ రాహుల్ సైతం ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్ జట్టుకు ఎంపికయ్యాడు. రోహిత్ శర్మ సారథ్యంలో 15 మంది బృందాన్ని సెలక్టర్లు మంగళవారం ఎంపిక చేశారు. వైస్ కెప్టెన్‌గా ఎవరి పేరును



ప్రకటించలేదు. బ్యాటింగ్ లైనప్‌లో రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్, చతేశ్వర్ పుజారా, విరాట్ కోహ్లి, అజింక్య రహానె, కెఎల్ రాహుల్ ఉన్నారు. ఏకైక వికెట్ కీపర్‌గా తెలుగు తేజం కె.ఎస్ భరత్ ఎంపికయ్యాడు. ఆల్‌రౌండర్లుగా రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, అక్షర్ పటేల్, శార్దుల్ ఠాకూర్ జట్టులో నిలిచారు. పేస ర్లుగా మహ్మద్ షమి, మహ్మద్ సిరాజ్, ఉమేశ్ యాదవ్, జైదేవ్ ఉనద్కత్‌లు చోటు దక్కించుకున్నారు. పేస్ దళపతి జశ్‌ప్రీత్ బుమ్రా శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటున్నాడు. అతడి పేరును సెలక్టర్లు పరిగణనలోకి తీసుకోలేదు.

భారత టెస్టు జట్టు

రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, చతేశ్వర్ పుజార, విరాట్ కోహ్లి, అజింక్య రహానె, కెఎల్ రాహుల్, కె.ఎస్ భరత్ (వికెట్ కీపర్), రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, శార్దుల్ ఠాకూర్, మహ్మద్ షమి, మహ్మద్ సిరాజ్, ఉమేశ్ యాదవ్, జైదేవ్ ఉనద్కత్.

ఐపీఎల్‌లో నేడు
బెంగళూర్ X కోల్‌కత
వేదిక : చిన్నస్వామి, సమయం : రా: 7.30
స్టార్‌స్పోర్ట్స్,జియో సినిమాలో ప్రసారం

టైటాన్స్ తడాఖా

- మెరిసిన గిల్, మిల్లర్, మనోహర్
- ముంబయిపై గుజరాత్ గెలుపు



నవతెలంగాణ-అహ్మదాబాద్

గుజరాత్ టైటాన్స్ ఐదో విజయం సాధించింది. ముంబయి ఇండియన్స్‌పై 55 పరుగుల తేడాతో ఏకపక్ష విజయం నమోదు చేసిన టైటాన్స్ పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది. 208 పరుగుల భారీ ఛేదనలో ముంబయి ఇండియన్స్ చేతులెత్తేసింది. రోహిత్ శర్మ (2), ఇషాన్ కిషన్ (13), తిలక్ వర్మ (2), టిమ్ డెవిడ్ (0) విఫలమయ్యారు. కామెరూన్ గ్రీన్ (33, 26 బంతుల్లో 3 సిక్సులు), సూర్యకుమార్ యాదవ్ (23, 12 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), నేహల్ వాదెర (40, 21 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులు) ఓటమి అంతరాన్ని కుదించారు. 59 పరుగులకే ఐదు వికెట్లు చేజార్చుకున్న ముంబయి ఇండియన్స్ 152/9 పరుగులు చేయటమే గొప్ప!. ముంబయి ఇండియన్స్‌కు ఇది నాల్గో ఓటమి. తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 207/6 పరుగులు చేసింది. శుభ్‌మన్ గిల్ (56, 34 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీతో చెలరేగాడు. డెవిడ్ మిల్లర్ (46, 22 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సులు), అభినవ్ మనోహర్ (42, 21 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులు) విధ్వంసక ఇన్నింగ్సులతో చెలరేగారు.

చివర్లో చెడుగుడు

వృద్ధిమాన్ సాహా (4) , కెప్టెన్ హార్దిక్ పాండ్య (13) ఆరంభంలోనే నిష్క్రమించినా.. విజయ్ శంకర్ (19) తోడుగా శుభ్‌మన్ గిల్ (56) నిలకడగా రాణించాడు. ఆరు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 30 బంతుల్లో అర్థ సెంచరీ కొట్టాడు. 13 ఓవర్లలోపే టాప్-4 బ్యాటర్లను కోల్పోయిన గుజరాత్ టైటాన్స్ ఆ తర్వాత రెచ్చిపోయింది. డెవిడ్ మిల్లర్ (46), అభినవ్ మనోహర్ (42) ఐదో వికెట్‌కు వేగంగా 71 పరుగులు జోడించారు. రాహుల్ తెవాటియ (20 నాటౌట్) ఎదుర్కొన్న ఐదు బంతుల్లో ఏకంగా మూడింటిని సిక్సర్లుగా మలిచాడు. మిల్లర్, మనోహర్, తెవాటియ వీరవిహారంతో టైటాన్స్ చివరి ఏడు ఓవర్లలో 104 పరుగులు పిండుకుంది.

స్కోరు వివరాలు :

గుజరాత్ టైటాన్స్: 207/6 (శుభ్‌మన్ గిల్ 56, మిల్లర్ 46, మనోహర్ 42, చావ్లా 2/34)

ముంబయి ఇండియన్స్ :152/9 (నేహల్ 40, కామెరూన్ గ్రీన్ 33, సూర్య 23, నూర్ 3/37)

రహానె రణధీర

- ఐపీఎల్‌లో16 అజింక్య విశ్వరూపం
- 2.0 అవతార్‌లో చెలరేగుతున్న రహానె

అజింక్య రహానె ఓ మంచి సంప్రదాయ శైలి బ్యాటర్. ఐపీఎల్‌లో అతడు క్రీజులోకి రాగానే అభిమానులూ బౌండరీలనే ఎక్కువ ఆశిస్తారు. ఫీల్డర్ల నడుమ బంతిని బౌండరీ లైన్ దాటించటంలో రహానె దిట్ట. కానీ టీ20 క్రికెట్‌లో ఫోర్ల కంటే సిక్సర్లకే ఎక్కువ ప్రాధాన్యత. బౌండరీలు బాదిన బ్యాటర్ కంటే సిక్సర్లు సంధించిన క్రికెటర్‌కే ఎక్కువ ఆకర్షణ. 2009 నుంచి ఐపీఎల్‌లో ఆడుతున్న రహానె.. అభిమానులు అతడిని మరిచిపోతున్న తరుణంలో 2.0 అవతారం ఎత్తాడు. చెన్నై సూపర్‌కింగ్స్ తరఫున సిక్సర్ల మోతతో అభిమానులను అలరిస్తున్నాడు. మిస్టర్ డిపెండబుల్ రహానె.. మిస్టర్ ఎటాకర్ ఎలా అయ్యాడు?!

నవతెలంగాణ క్రీడావిభాగం



అప్పుడూ.. ఇప్పుడూ ధోనీ!

క్రీజులో ఓ బ్యాటర్ చెలరేగుతుంటే మరో బ్యాటర్ అతడికి సహకారం అందిస్తుంటారు. అలా ఓ ఎండ్‌లో నిలబడి యాంకర్ ఇన్నింగ్స్ ఆడే బ్యాటర్లకే యాంకర్ ఇన్నింగ్సులు ఆడగల సమర్థుడు అజింక్య రహానె. ఇది అజింక్య రహానెపై వ్యంగ్యాస్త్రమైనా.. అందులో కొంత నిజం లేకపోలేదు. వైట్‌బాల్ క్రికెట్‌లో రహానె పరిమితులపై అప్పటి భారత కెప్టెన్ ఎం.ఎస్ ధోని మాట్లాడాడు. ఫీల్డింగ్ పరిమితులు ముగిసిన అనంతరం, సర్కిల్ బయట ఐదుగురు ఫీల్డర్లు మొహరిస్తే రహానె బౌండరీలు సాధించలేడు. మిడిల్ ఆర్డర్‌లో అతడిని ప్రయోగించేందుకు ఈ కారణం అడ్డు వస్తుందని ధోని సెలవిచ్చాడు. ఆధునిక వన్డేలకు అనుగుణంగా పరుగుల వేటలో వేగం సాధించని రహానె క్రమంగా 50 ఓవర్ల ఫార్మాట్‌కు దూరమయ్యాడు. టీ20 ధనాధన్ ఫార్మాట్‌లో రహానెకు పెద్దగా ప్రాధాన్యత దక్కలేదు. గత సీజన్లో కోల్‌కత నైట్‌రైడర్స్ తరఫున నిరాశపరిచాడు.

అటు భారత టెస్టు జట్టులో చోటు కోల్పోయి, ఇటు ఐపీఎల్‌లో అవకాశాలు దక్కక అజింక్య రహానె కెరీర్ చరమాంకానికి వచ్చిందనే అభిప్రాయం ఏర్పడింది. ఈ దశలో అజింక్య రహానె ఎవరూ ఊహించని రీతిలో పుంజుకు న్నాడు. రహానె విధ్వంసక రూపంలోనూ ధోని పాత్ర ఉంది. చెన్నై సూపర్‌కింగ్స్ ప్రీ సీజన్ క్యాంప్‌లో రహానెతో కలిసి ధోనీ సుదీర్ఘంగా సాధన చేశాడు. పరుగుల వేటలో రహానెపై ఒత్తిడి పెంచకుండా, అతడు స్వేచ్ఛగా ఆడేందుకు అవకాశం కల్పించాడు. డ్రెస్సింగ్‌రూమ్‌లో తనపై ఎటువంటి ఒత్తిడి లేకపోవటంతో క్రీజులోకి వచ్చిన రహానె బౌలర్లను ఊచకోత కోస్తున్నాడు.

దంచుడే దంచుడు

ఐపీఎల్2023లో ఐదు మ్యాచులు ఆడిన అజింక్య రహానె.. ఈ సీజన్లో టాప్-20 బ్యాటర్లతో పోల్చితే అత్యధిక స్ట్రయికరేట్ నమోదు చేశాడు. రెండు అర్థ సెంచరీలు సహా 18 ఫోర్లు, 11 సిక్సర్లతో రహానె 209 పరుగులు పిండుకున్నాడు. తాజాగా కోల్‌కత నైట్‌రైడర్స్‌పై 29 బంతుల్లోనే 71 పరుగులు బాదాడు. గత ఐపీఎల్ సీజన్లతో పోల్చితే ఈసారి రహానె తనకంటే మూడు రెట్లు శక్తివంతమైన ప్రదర్శన చేస్తున్నాడు. ఐపీఎల్ 2019లో రహానె ప్రతి 31.67 బంతులకు ఓ సిక్సర్ సాధించాడు. అతడే అతడి అత్యుత్తమం. కానీ ఈ సీజన్లో ప్రతి 9.54 బంతులకు బంతిని స్టాండ్స్‌లోకి పంపిస్తున్నాడు. ఇక ఓవరాల్‌గా బౌండరీలు బాదటంలో రహానె ముందంజలో నిలిచాడు. ఈ సీజన్లో 105 బంతులు ఎదుర్కొన్న రహానె ప్రతి 3.6 బంతులకు ఓ బౌండరీ చొప్పున 29 బౌండరీలు సాధించాడు. గ్లెన్ మాక్స్‌వెల్ (3.7), వెంకటేశ్ అయ్యర్ (4.1), రోహిత్ శర్మ (4.2) రహానె తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. పేస్ బౌలింగ్‌పై ఆడటం రహానెకు వెన్నతో పెట్టిన విద్య. కానీ ఈ సీజన్లో అది ఆకాశమే హద్దుగా మారింది. పేస్‌పై 18 బంతులు ఆడిన రహానె 254.16 స్ట్రయికరేట్‌తో పరుగులు సాధించాడు. అగ్రశ్రేణి పేసర్ మార్క్‌వుడ్‌పై దండయాత్ర చేసిన ఎం.ఎస్ ధోనికి సైతం ఈ స్థాయి గణాంకాలు లేవు.

ధనాధన్ రూపం ఎలా?

ఐపీఎల్‌లో అజింక్య రహానె మునుపెన్నడూ చూడని కోణాన్ని ఆవిష్కరించాడు. 2009 సీజనో స్ట్రయికరేట్ 117.07 కాగా.. 2019లో 137.89 స్ట్రయికరేట్ అతడి అత్యుత్తమం. ప్రస్తుత సీజన్లో రహానె స్ట్రయికరేట్ 199.04. టాప్-20 బ్యాటర్లలో మరో ఆటగాడికి ఈ స్థాయి స్ట్రయికరేట్ లేదు. వాంఖడెలో ముంబయి ఇండియన్స్‌పై 27 బంతుల్లో 61 పరుగులు చేసిన రహానె.. ఆ ప్రదర్శనతో సంతృప్తి పడలేదు. మరింత దూకుడుగా ఆడేందుకు సిద్ధమయ్యాడు. సంప్రదాయ బ్యాటర్ నుంచి ధనాధన్ హిట్టర్‌గా మారేందుకు రహానె పెద్దగా మార్పులేమీ చేసుకోలేదు. తన బ్యాటింగ్ శైలిని మార్చుకోలేదు. అవే షాట్లకు కాస్త టైమింగ్, పవర్‌ను జత చేశాడు. కవర్ డ్రైవ్, పుల్, హుక్, ఫ్లిక్ షాట్లను టైమింగ్‌తో ఆడుతున్నాడు. ముంబయిపై సంప్రదాయ షాట్లతోనే విరుచుకుపడిన రహానె.. కోల్‌కతపై విలక్షణ షాట్లను సైతం ఆడాడు. సీజన్‌కు ముందు సూపర్‌కింగ్స్ సన్నాహక శిబిరంలో రహానె బ్యాటింగ్‌పై కఠోర సాధన చేశాడు. సిక్సర్లు బాదటంపై ప్రత్యేకంగా సాధన చేశాడు. ఐపీఎల్‌లో 153 ఇన్నింగ్స్‌ల్లో 17-20 ఓవర్ల నడుమ రహానె 32 సార్లు బ్యాటింగ్ చేశాడు. సహజంగా పవర్‌ప్లే ముగియగానే రహానె కథ ముగుస్తుంది!. కానీ ఈ సీజన్లో ఈ సమయంలోనే రహానె అరాచకం సృష్టించాడు. 9 బంతుల్లో ఏకంగా ఆరు సిక్సర్లు బాది 33 పరుగులు పిండుకున్నాడు. అభిమానులు, క్రికెట్ పండితులు ఆశ్చర్యపడే ఇన్నింగ్స్‌లు ఆడుతున్న అజింక్య రహానె.. 'ఇంకా నా అత్యుత్తమ ప్రదర్శన చేయలే' అనటం కొసమెరుపు.



ఎల్లప్పుడూ నా మైండ్‌సెట్‌ను ఎక్కువగా విశ్వసిస్తాను. ఆలోచన ధోరణి సరిగా ఉన్నప్పుడు ఏదైనా చేయగలం. సీజన్‌కు ముందు మైండ్‌సెట్ క్లియర్‌గా ఉంచాను. సన్నద్ధత ప్రక్రియను ఆస్వాదించాను. ప్రస్తుతం నాకు ఎటువంటి ఆలోచనలు లేవు. నా ఆటను గొప్పగా ఎంజాయ్ చేస్తున్నాను. నాలోని అత్యుత్తమ ప్రదర్శన ఇంకా బయటి రాలేదు. - అజింక్య రహానె

హైదరాబాద్‌లో జాతీయ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్స్

ఆసియా, ఒలింపిక్స్‌కు అర్హత పోటీలుగా గుర్తింపు

నవతెలంగాణ-హైదరాబాద్

హైదరాబాద్ మరో జాతీయ క్రీడా ఈవెంట్‌కు వేదిక కానుంది. 76వ సీనియర్ జాతీయ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్స్ జులై 2-5 వరకు గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగనున్నాయి. చివరగా జాతీయ స్విమ్మింగ్ పోటీలకు గువహటి వేదికగా నిలిచింది. 2023 ఆసియా క్రీడలు, 2024 పారిస్ ఒలింపిక్స్ సమీపిస్తుండటంతో ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్లకు అర్హత పోటీలుగా సీనియర్ నేషనల్స్ చాంపియన్‌షిప్స్‌ను పరిగణనలోకి తీసుకుంటామని వరల్డ్ అక్వాటిక్స్ ప్రకటించింది. దీంతో హైదరాబాద్‌లో జరుగనున్న జాతీయ పోటీలకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. భారత అత్యుత్తమ స్విమ్మర్లు అందరూ గచ్చిబౌలిలోని ఈతకొలనులో ఆసియా, ఒలింపిక్ బెర్త్‌ల కోసం తాడోపేడో తేల్చుకోనున్నారు.

నవచిత్రం

అందర్నీ అలరించే రామ బాణం

'లక్ష్యం', 'లౌక్యం' వంటి బ్లాక్ బస్టర్స్ తర్వాత గోపీచంద్, డైరెక్టర్ శ్రీవాస్ కలయికలో వస్తున్న హ్యాట్రిక్ మూవీ 'రామబాణం'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇందులో గోపీచంద్ సరసన డింపుల్ హయతి కథానాయికగా నటించింది. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం మే 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా కథానాయిక డింపుల్ హయతి 'రామబాణం' చిత్ర విశేషాల గురించి మంగళవారం మీడియాకి ఇచ్చిన ఇంటర్వ్యూ..



డింపుల్ హయతి

ఇందులో ఎలా సెలెక్ట్ అయ్యారు?

- 'కిలాడీ' సినిమా చేస్తున్నపుడే ఈ సినిమాకి సైన్ చేశాను. అయితే అందులో చాలా గ్లామరస్‌గా కనిపించాను. ఆ సినిమా చూసిన తర్వాత దర్శకుడు శ్రీవాస్ ఎందుకో తాను అనుకున్న 'భైరవి'లా అనిపించడం లేదనే డౌట్ వ్యక్తం చేశారు. అందుకే రెండుసార్లు స్క్రీన్ టెస్ట్ చేసి, భైరవి పాత్రకు నేను సరిపోతాననే నమ్మకం కుదిరిన తర్వాతే ఎంపిక చేశారు.

మీ పాత్ర తీరు ఎలా ఉంటుంది?

- ఇందులో అర్బన్ అమ్మాయిగా కనిపిస్తా. నా పాత్ర పేరు భైరవి. వ్లాగర్. నిజ జీవితంలో నేను సోషల్ మీడియాకి దూరంగా ఉంటాను. కాబట్టి ఈ పాత్ర నాకు కొత్తగానే అనిపించింది. రీల్స్, వ్లాగ్స్ చేయడంలో ఫన్ జనరేట్ అయ్యింది. ఇందులో చాలా మంది సీనియర్ ఆర్టిస్టులు ఉన్నారు. వారందరితో కలిసి వ్లాగ్ చేయాలి, ఇది చాలా ఎంటర్‌టైనింగ్‌గా అనిపించింది. నా పాత్రపరంగానే కాదు మొత్తంగా 'రామబాణం' అందరినీ అలరించే ఎంటర్‌టైనర్.

గోపీచంద్‌తో పని చేయడం ఎలా అనిపించింది ?

- గోపీచంద్ చాలా తక్కువగా మాట్లాడతారు. పొద్దున్న హాయ్ అంటే సాయంత్రం బాయ్.. దట్సాల్. నేనూ తక్కువగానే మాట్లాడతాను. అయితే పని పట్ల ఆయన చాలా ఫోకస్డ్‌గా ఉంటారు. సీన్ సరిగ్గా రాకపోతే ఆయన కళ్ళలోనే అర్థమైపోతుంది. చాలా కంపోజ్డ్‌గా మాట్లాడతారు. నాకు చాలా సపోర్ట్ చేశారు. ఆయనతో పని చేయడం గ్రేట్ ఎక్స్‌పీరియన్స్.

జగపతి బాబు, కుష్బూ లాంటి సీనియర్ నటీనటుల నుంచి ఏం నేర్చుకున్నారు?

- 'రామబాణం' సెట్‌లో ఎప్పుడూ కనీసం ఓ పది మంది ఆర్టిస్టులతో కళకళలాడుతూనే ఉండేది. ఈ ప్రయాణంలో కుష్బూ నాకు సెకండ్ మదర్ అయిపోయారు. సెట్‌లో ఆవిడ అనుభవాలన్ని పంచుకున్నారు. అలాగే జగపతి బాబు కూడా. అందుకే ఈ సినిమా నాకు గ్రేట్ జర్నీ.

దర్శకుడు శ్రీవాస్‌తో వర్క్ ఎక్స్‌పీరియన్స్ గురించి?

- శ్రీవాస్ స్వీట్ పర్సన్. చాలా అల్లరి చేస్తారు (నవ్వుతూ). ఆయన ప్రతీదీ చాలా వివరంగా చెప్తారు. నా పాత్రకి సంబధించిన ప్రతి డీటైల్‌ని ముందే చెప్పి.. సలహాలు, సూచనలు ఇచ్చారు. అవి ఎంతగానో ఉపయోగపడ్డాయి.

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాతల గురించి ఏం చెబుతారు?

- విశ్వప్రసాద్, వివేక్ గ్రేట్ ప్రొడ్యుసర్స్. సినిమాకి కావాల్సిన ప్రతీదీ సమకూరుస్తారు. వారి నిర్మాణంలో మరోసారి పని చేయాలని ఉంది. ప్రస్తుతం తెలుగు, తమిళంలో రెండు పెద్ద సినిమాలు చేస్తున్నాను. వాటి గురించి త్వరలోనే అప్‌డేట్ ఇస్తాను. ఇప్పటికే తమిళంలో ప్రభుదేవా, విశాల్‌తో, అలాగే బాలీవుడ్ సినిమా 'అతరంగిరే'లో నటించాను. నాకు ఇతర భాషల్లో ప్రయోగాలు చేయడం అంటే చాలా ఇష్టం.

పఠాన్ వేరు.. ఏజెంట్ వేరు..

హీరో అఖిల్, దర్శకుడు సురేందర్ రెడ్డి కాంబినేషన్‌లో వస్తున్న స్పై యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఏజెంట్'. ఈనెల 28న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. ఏకె ఎంటర్‌టైన్‌మెంట్స్, సురేందర్ 2 సినిమా పతాకాలపై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఇప్పటికే ట్రెమెండస్ రెస్పాన్స్‌తో భారీ అంచనాలని పెంచింది. ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తున్న నేపథ్యంలో 'ఏజెంట్'లో కీలక పాత్ర పోషించిన బాలీవుడ్ కథానాయకుడు డినో మోరియా మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు..



డినో మోరియా

'ఇందులో నేను 'రా' ఏజెంట్ పాత్ర పోషించాను. ప్రత్యేక శిక్షణ తీసుకున్న పవర్‌ఫుల్ ఏజెంట్‌ని. అయితే వ్యవస్థలో నాకు జరిగిన ద్రోహం కారణంగా వ్యవస్థకు ఎదురు తిరిగి, వ్యవస్థపై పగ తీర్చుకునే పాత్ర నాది. దీంతో ఈవిల్‌గా మారిపోతాను. నాలో చాలా మ్యాడ్‌నెస్ ఉంటుంది. దర్శకుడు సురేందర్ రెడ్డి నా పాత్రని చాలా అద్భుతంగా డిజైన్ చేశారు. ఈ కథ విన్నప్పుడే చాలా నచ్చేసింది. తెలుగులోకి రావడానికి ఇదే బెస్ట్ స్క్రిప్ట్ అని డిసైడ్ అయ్యాను. ఇది ముగ్గురు ఏజెంట్స్ కథ. ఇందులో నేను విలన్‌గా మారడానికి కూడా ఒక కారణం ఉంటుంది. కథలో చాలా ప్రాధాన్యత ఉన్న పాత్ర చేసినందుకు చాలా హ్యాపీగా ఉంది. అలాగే ఇరవై ఏళ్ల క్రితం 'ప్రియురాలు పిలిచింది' సినిమాలో మమ్ముట్టితో కలిసి పని చేశాను. మళ్ళీ ఇన్నాళ్ళకు ఆయనతో కలసి చేయడం గొప్ప అనుభూతి. ఇందులో ఆయనికి ఎదురుతిరిగే పాత్ర చేశాను. అది పెద్ద సవాల్‌గా అనిపించిది. రామ్‌చరణ్ నా ఫ్రెండ్. ఆయన ద్వారా అఖిల్‌ని ఒకసారి కలిశాను. అదే అఖిల్‌ని 'ఏజంట్' సెట్‌లో చూసి ఆశ్చర్య పోయాను. చాలా అద్భుతంగా కనిపించాడు. తన లుక్ మొత్తం మార్చేశాడు. తన డెడికేషన్‌కి హ్యాట్సాఫ్. రెండున్నర గంటల సినిమాని ప్రేక్షకులు ఆద్యంతం ఎంజాయ్ చేస్తారు. ఏజెంట్ రోలర్ కోస్టర్ రైడ్ ఎక్స్‌పీరియన్స్‌ని ఇస్తుంది. మలుపులు, లార్జ్ యాక్షన్, విజువల్స్, సౌండ్ అన్నీ ప్రేక్షకులను అలరిస్తాయి.

ఇందులో నా పాత్ర పేరు గాడ్. చాలా పవర్ ఫుల్ పాత్ర అది. వ్యవస్థపై, ఆ వ్యవస్థని క్రియేట్ చేసిన బాస్ పై రివేంజ్ తీర్చుకోవాలని చూస్తాను. అయితే నా పాత్ర 'పఠాన్'లో జాన్ అబ్రహం పాత్రకు సిమిలర్‌గా ఉందనిపిస్తుంది కదా అని అడగొచ్చు. విచిత్రంగా 'పఠాన్' కూడా ముగ్గురు ఏజెంట్స్‌కి సంబంధించిన కథే. ఏజెంట్ కథకి 'పఠాన్' కథతో పోలిక లేదు.

అవన్నీ సుకుమార్ చేసిన మార్పులే..



కార్తీక్ దండు

సాయిధరమ్ తేజ్ హీరోగా నటించిన మిస్టికల్ థ్రిల్లర్ 'విరూపాక్ష'. సంయుక్తా మీనన్ కథానాయిక. కార్తీక్ దండు దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై బాపినీడు బి.సమర్పణలో నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. దర్శకుడు సుకుమార్ స్క్రీన్ ప్లే అందించిన ఈ చిత్రం ఈనెల 21న ప్రపంచవ్యాప్తంగా విడుదలై, ప్రేక్షకుల విశేష ఆదరణతో మంచి విజయాన్ని అందుకుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు కార్తీక్ దండు మీడియాతో తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. అలాగే ఈ సినిమా విజయపరంపర గురించి పలు ఆసక్తికర విషయాలను షేర్ చేశారు.

'ఈ సినిమాకి ముందు 'భమ్‌బోలేనాథ్' సినిమాని డైరెక్ట్ చేశా. దాని తర్వాత చేసిన ఈ 'విరూపాక్ష'కు ట్రెమండస్ రెస్పాన్స్ రావడం ఆనందంగా ఉంది. ఈ మధ్యకాలంలో హర్రర్ కామెడీలు వస్తున్నాయే తప్ప, స్ట్రిక్ట్ హర్రర్ మూవీస్ రావడం లేదనిపించింది. 2016, 2017లో ఓ పేపర్‌లో ఆర్టికల్ చదివా. గుజరాత్‌లో ఓ మహిళ చేతబడి చేస్తుందన్న అనుమానంతో ఓ చెట్టుకు కట్టేసి రాళ్లతో కొట్టి చంపేశారు. అప్పుడు ఈ కథ రాద్దామనిపించింది. నిజంగా ఆమెకు చేతబడి వచ్చి ఉంటే, వారందరూ చచ్చిపోయేవారేమో కదా. కథ రాసుకున్న తర్వాత సుకుమార్‌గారి దగ్గరకు వెళ్లడానికి ముందు చాలా చిన్న స్పాన్‌లో అనుకున్నాను. కానీ ఆయన కథ విన్న తర్వాత సాయితేజ్, ప్రసాద్‌గారిని డిసైడ్ చేశారు. ఇక క్లైమాక్స్‌లో ఆడియన్స్ థ్రిల్ అయిన విషయాలు సుకుమార్ చేసిన మార్పులే. హర్రర్ అంటే దెయ్యాలే కాదు. మనకు వెన్నులో చలి పుట్టించే ప్రతిదీ హర్రరే. ఆడియన్స్‌కి కొత్తగా చూపించాలనే ఉద్దేశంతో ఈ సినిమాలో మర్డర్లని కూడా కొత్తగా డిజైన్ చేశాం. ఈ సినిమా అరుంధతి, చంద్రముఖి మిక్స్ అని కామెంట్స్ వినిపించాయి. అయితే కథా పరంగా కాదు. సక్సెస్ పరంగా ఆ రెండు సినిమాలకూ మిక్స్ అని నమ్ముతా. వేరే భాషల్లో రిలీజ్ చేయటానికి 'కాంతార' ఫార్మేట్‌ని ఫాలో అవుతాం. ఇక్కడ మౌత్ టాక్ స్ప్రెడ్ అయ్యాక, మిగిలిన భాషల్లో రిలీజ్ చేస్తాం' అని కార్తీక్ దండు తెలిపారు.

వినోదం + భయం

రోషన్, కోమల్ జెన్, సాక్షి, స్రవంతి, పూజా డే కీలక పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'రాణిగారి గదిలో దెయ్యం'. అబిద్ దర్శకత్వంలో మౌంట్ ఎవరెస్ట్ పిక్చర్స్ పతాకంపై పి.వి.సత్యనారాయణ నిర్మించారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, ఆర్.కె.గౌడ్ ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేసి, సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, 'హర్రర్ కంటెంట్ చిత్రాలకి ఎప్పుడూ ఆదరణ ఉంటుంది. అదే కోవలో రూపొందిన ఈ సినిమా కూడా బిగ్ సక్సెస్ కావాలి' అని అన్నారు."మా బ్యానర్‌లో వస్తున్న ఐదో సినిమా ఇది. హర్రర్ కాన్సెప్ట్‌తో వినోదాత్మకంగా సాగే చిత్రమిది. అన్ని వర్గాల ప్రేక్షకులకు కావాల్సిన అన్ని అంశాలూ ఈ సినిమాలో ఉన్నాయి. త్వరలో విడుదల చేస్తాం' అని నిర్మాత పి.వి.సత్యనారాయణ చెప్పారు. దర్శకుడు అబిద్ మాట్లాడుతూ, 'నన్ను నమ్మి నిర్మాత అవకాశం ఇచ్చారు. హర్రర్ కథతో చక్కని సినిమా తీశాం. షేర్ అద్భుతమైన సంగీతం అందించారు. ఈ జర్నీలో నాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు' అని తెలిపారు. సిరాజ్ మాట్లాడుతూ, 'తెలుగు ఇండస్ట్రీలో దర్శకుడిగా, సంగీత దర్శకుడిగా, డిస్ట్రిబ్యూటర్‌గా ఉన్నా. మంచి కథతో ఈ సినిమా చేశాం. చక్కని పాటలు కుదిరాయి. తప్పకుండా ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకంతో ఉన్నాం' అని అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ప్రవీణ్.



కోమల్ జెన్, అబిద్, సిరాజ్

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.